# దేవాపి మహర్షి బోధలు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2005 - గురుపూర్ణిమ ప్రతులు : 1,000
ద్వితీయ ముద్రణ : 2011 - గురుపూజలు ప్రతులు : 1,000

వెల : రూ॥ **60-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531
e-mail : dhanishta@rediffmail.com

ముద్రణ :
ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 0891-2747320, 9848075132.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించియున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి  చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | పరిచయము | 10 |
| 1 | కర్తవ్యము | 25 |
| 2. | సుదర్శన చక్రము | 29 |
| 3. | గుప్తవిద్య - ప్రయోజనము | 33 |
| 4. | అశ్వవిద్య - 1 | 36 |
| 5. | అశ్వవిద్య - 1 | 39 |
| 6. | గోపాల మంత్రము | 43 |
| 7. | కర్మజ్ఞానములు | 46 |
| 8. | మా దివ్య శరీరము | 48 |
| 9. | బిందువు | 49 |
| 10 | సిద్ధాంతము - ఆచరణ | 50 |
| 11. | సూర్య చంద్ర లోకములు | 51 |
| 12. | నలుడు | 52 |
| 13. | నామ రహస్యము - 1 | 53 |
| 14. | నామ రహస్యము - 2 | 55 |
| 15. | అశ్వము | 57 |
| 16. | వృషభము | 59 |
| 17. | సత్యము - మతము | 60 |
| 18. | సూర్య చంద్రులు | 61 |
| 19. | కుమారో బుధః | 62 |
| 20. | పృథివి - అంతరిక్షము - దివి | 64 |
| 21. | డమరుకము - శ్రీ చక్రము | 65 |
| 22. | కర్ణుడు - కుంతి | 67 |
| 23. | పూర్వకథ - 1 | 68 |
| 24. | పూర్వకథ - 2 | 69 |
| 25. | జ్ఞానయోగము - కర్మయోగము - 1 | 71 |

| | | |
|---|---|---|
| 26. | జ్ఞానయోగము - కర్మయోగము - 2 | 73 |
| 27. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 1 | 75 |
| 28. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 2 | 78 |
| 29. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 3 | 81 |
| 30. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 4 | 83 |
| 31. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 5 | 86 |
| 32. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 6 | 88 |
| 33. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 7 | 90 |
| 34. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 8 | 92 |
| 35. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 9 | 95 |
| 36. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 10 | 97 |
| 37. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 11 | 99 |
| 38. | మహర్షి దేవాపి సాన్నిధ్యము - 12 | 102 |
| 39. | సాన్నిధ్యము | 104 |
| 40. | కర్మ స్వరూపము | 106 |
| 41. | సాధన-శరీరము | 108 |
| 42. | తుమ్మ ముళ్ళు | 42 |
| 43. | సూచనలు-1 | 112 |
| 44. | సూచనలు-2 | 114 |
| 45. | సదాచారము | 116 |
| 46. | విచక్షణ | 117 |
| 47. | కపటి | 118 |
| 48. | ప్రభావము | 119 |
| 49. | సంస్కారము - జ్ఞానము | 121 |
| 50. | నీరు పల్ల మెరుగు | 122 |
| 51. | ముక్కుసూటి మార్గము | 123 |
| 52. | ప్రజ్ఞావిలాసము | 125 |
| 53. | కర్మవిమోచనము | 127 |

| | | |
|---|---|---|
| 54. | తప్పుడు కోట | 129 |
| 55. | నూతన శంఖారావము | 131 |
| 56. | కొన్ని ప్రశ్నలు | 132 |
| 57. | మా కొలబద్ద | 134 |
| 58. | శంబళ | 136 |
| 59. | శ్రావస్తి | 138 |
| 60. | మెల్లకన్ను | 140 |
| 61. | గ్రద్ద కన్ను | 142 |
| 62. | చర్విత చర్వణము | 144 |
| 63. | యోగవిద్య | 146 |
| 64. | అంతఃకరణములు | 112 |
| 65. | అవధూత దేహ ధర్మము | 148 |
| 66. | సద్గురువు | 149 |
| 67. | సహవాసము | 150 |
| 68. | బ్రహ్మచర్య వ్రతము | 151 |
| 69. | ఫల త్యాగము | 152 |
| 70. | అసూయాగ్ని - 1 | 153 |
| 71. | అసూయాగ్ని - 2 | 154 |
| 72. | ఆడంబరము - అధోగతి | 155 |
| 73. | ప్రేమ | 156 |
| 74. | ఉడకని మెతుకులు | 158 |
| 75. | సుగంధ పరిమళములు | 160 |
| 76. | హృదయ సమర్పణ | 161 |
| 77. | నూతనత్వము | 163 |
| 78. | మధుర మార్గము - 1 | 165 |
| 79. | మధుర మార్గము - 2 | 167 |
| 80. | మధుర మార్గము - 3 | 130 |
| 81. | మధుర మార్గము - 4 | 171 |

| | | |
|---|---|---|
| 82. | కలుపుగోలుతనము | 173 |
| 83. | శ్రమ - ఫలితము | 174 |
| 84. | మూర్ఖత | 175 |
| 85. | ఒక రహస్యము | 176 |
| 86. | తారణ మార్గము | 178 |
| 87. | సంస్కారము | 180 |
| 88. | మా అనుభవము | 182 |
| 89. | ప్రదర్శన - దర్శనము | 184 |
| 90. | మానవ లక్షణము | 186 |
| 91. | భౌతిక లోకసత్యము | 188 |
| 92. | జ్ఞానము - భాష | 190 |
| 93. | వైద్యమతములు | 192 |
| 94. | నిశ్శబ్దము - స్నేహము | 194 |
| 95. | విటమినులు | 196 |
| 96. | పనితనము | 198 |
| 97. | మొండితనము | 199 |
| 98. | యుక్తాహారము | 200 |
| 99. | శిష్య దురాచారము | 202 |
| 100. | శంబళ | 204 |
| 101. | నిస్పృహ | 206 |
| 102. | ఒక సాధన | 208 |
| 103. | బహుముఖత్వము | 210 |
| 104. | పెద్దరికము | 212 |
| 105. | దైవ నిర్ణయము | 214 |
| 106. | సద్గురు రూప ధ్యానము | 216 |
| 107. | స్వస్వరూప దర్శనము | 218 |
| 108. | స్వస్వరూపజ్ఞానము | 220 |

# దేవాపి మహర్షి బోధలు

## పరిచయము

మరువు, దేవాపి మహర్షులు అనాది నుండి భూమిజీవుల యుద్ధరణకై నిర్విరామము కృషిచేయుచున్న మహర్షులు. వీరి పుట్టు పూర్వోత్తరములు ఎవ్వరికిని తెలియదు. అన్ని పురాణము లందును వీరు గోచరింతురు. విష్ణుపురాణము నుండి భాగవత పురాణము వరకుగల పురాణములలో అచ్చటచ్చట ప్రస్తుతి చేయ బడిరి. జీవులకు వర్ణాశ్రమ ధర్మములను నేర్పుచు, ధర్మము నందు రుచి కల్పించి, ధర్మమార్గమున నడిపింపజేసి, ఉత్తీర్ణులను గావించుట వీరుచేయు మహత్తర నిష్కామ కర్మయజ్ఞము. ఈ యజ్ఞము వీరు అనాదికాలముగ నిర్వర్తించుచున్నారు. జగద్గురువు మైత్రేయునికి దివ్యప్రణాళికలో తోడ్పాటు గావించుచున్నప్పటికిని వీరు మైత్రేయునికన్న పూర్వులు. వాసుదేవుని వ్యూహమునందు జీవుల ఉద్ధరణకై యుగముల తరబడి పనిచేయుచున్న మహానుభావులు.

మరువు మహర్షి సూర్యవంశపు రాజు. ఇక్ష్వాకు వంశము వాడు. అనగా శ్రీరాముని వంశము వాడు. అనగా త్రేతాయుగము నుండి భూమిపై నున్నవాడు. అంతకు ముందునుండి కూడ యుండి యుండవచ్చును. అట్లే దేవాపి మహర్షి చంద్రవంశపు రాజు. ఇతడు భీష్ముని తండ్రి అయిన శంతనమహారాజునకు అగ్రజుడు. ఆ జన్మలో దేవాపి బ్రాహ్మణ ధర్మమును స్వీకరించి తనకు తానుగ కోరి రాజ్యము నుండి బహిష్కరించబడెను. నిజము

నకు కురు సామ్రాజ్యమునకు అతడు చక్రవర్తియై యుండ వలసినది. కాని వాసుదేవుని వ్యూహము ననుసరించి వాసుదేవుడు శ్రీకృష్ణుడుగ అవతరించుటకు ముందుగనే రాజ్యపరిత్యాగము గావించెను.

దేవాపి మహర్షి ఆ జన్మలో శ్రీకృష్ణుని కన్న నాలుగు వందల సంవత్సరముల ముందు పుట్టినవాడు! నాలుగు వందల సంవత్సర ముల ముందు దైవము యొక్క వ్యూహమును గ్రహించి, అందు తన పాత్రను గ్రహించి, తదనుగుణముగ చక్రవర్తిత్వమును పరి త్యాగము చేయుటకు కొంత దూరదృష్టి కావలెను. అది ఋషి దృష్టి. దేవాపి ఋషి మాత్రమే కాదు, రాజర్షి. రాజర్షి మాత్రమే కాదు మహర్షి. దేవాపి, శంతనుడు, కాశీరాజగు దివోదాసు, జగద్గురు వగు పరాశర మహర్షి, వీరందరును సమకాలికులు, వీరు ఆ జన్మల యందు, ఆయా దేహములందుండుట పురాణ పురుషుని అవతరణమునకు నాలుగు వందల సంవత్సరముల ముందు జరిగినది. దేవాపి మహర్షియై నిలుచుట ఆ జన్మలో జరిగినదను కొనలేము. అట్లే మరువు మహర్షి కూడా.

ఈ ఇరువురు మహర్షులు వాసుదేవుని వ్యూహమున అనాది కాలముగ పనిచేయుచు తెరవెనుక నుండుట కెక్కువ అభిలషించి రని అనిపించును. మహర్షుల పుట్టు పూర్వోత్తరములు మనకు పురాణ సంహితలలో లభ్యమగును. వారు చేసిన సాధనలు కూడ లభ్యమగును. కాని ఈ మహర్షుల పుట్టు పూర్వోత్తరములు, సాధనలు పురాణముల యందు కూడ లిఖింపబడలేదు. అది బహుశః వారి సంకల్పము కావచ్చును. పరాశరులు విష్ణుపురాణమున, వేద

వ్యాసులు భాగవత, కల్కి పురాణములలో వీరిని తగుమాత్రము పరిచయముచేసి వదలినారు. అదియును అతి స్వల్పమే.

ఈ భూమి పుట్టుక ముప్పదికోట్ల సంవత్సరముల క్రితము జరిగినది. అందు ఆదిమానవుని అవతరణము ఒకకోటి, ఎనభై లక్షల సంవత్సరముల క్రితము జరిగినది. ఈ కోటి ఎనభై లక్షల సంవత్సరములలో కొన్ని మన్వంతరములు గడచినవి. ఎన్నియో యుగములు గడచినవి. మానవజాతి ఉద్ధరణమునకై కుమారులు, ఋషులెందరో భూమికి దిగి వచ్చిరి. ఈ మొత్తము భూమి కథ, మానవజాతుల కథ, ఈ మహర్షు లిద్దరికిని కరతలామలకములు. ఈ భూమిపై జరుగుచున్న జగన్నాటకమునంతయు వారు సాక్షీ భూతులుగ గమనించుచు తమ వంతు కర్తవ్యమును వాసుదేవుని కల్పితముగ నిర్వర్తించుచున్నారు. వీరిరువురును దివ్యదేహ ధారులు. అణువుల నుండి అప్పటికప్పుడు దేహమును కట్టుకొని ప్రత్యక్షము కాగలరు. అట్లే అదృశ్యము కాగలరు. స్మరణ మాత్ర మున సాన్నిధ్యమునివ్వగల వాసుదేవోపాసకులు. వీరు విష్ణు స్వరూపులు, త్రికాలజ్ఞులు వీరికి తెలియని మన్వంతర రహస్య ములు, మతాతీత సత్యములు, మానవజాతి కథలు, లేవన్నచో అతిశయోక్తి కాదు.

రాశిచక్రమున సద్గురుపరంపర అంతయు ఆషాఢ శ్రావణ ములను అధిష్టించి యుండగ మరువు మహర్షి మేషరాశిని, దేవాపి మహర్షి ధనుర్ రాశిని అధిష్ఠించి యున్నారు. ధనుర్‌రాశి మూలాధార ప్రజ్ఞ. అచటనే యోగప్రజ్ఞ యున్నది. ఈ కేంద్రమునకు దత్తా త్రేయుడధిపతి. కపిలుడు గణపతి, హనుమంతుడు అచ్చటి

గురుపరంపర. ఇట్టి మహత్తరమైనటువంటి యోగప్రజ్ఞకు అధిపతిగ ధనుర్ రాశిని పరిపాలించుచున్న దేవాపి మహర్షి, సమస్త యోగ మార్గములను ప్రచోదనము గావించుచు జీవులను త్వరితగతిని పురోగమింపచేయుచున్నారు. యోగమునకు మూలాధారము ఆరంభముకాగ సహస్రారము గమ్యమై యున్నది. అచ్చట ఆ ప్రజ్ఞను పరిపాలించుచు మరువుమహర్షి జీవుల నూర్ధ్వముఖమున కాకర్షించుచుండును. ఉత్తమలోకముల ప్రవేశము కల్పించు చుండును. యోగదండము లేక బ్రహ్మదండమునకు ఇరుపార్శ్వ ముల వీరిరువురు పనిచేయుచు భూమి యందలి సమస్త గురు పరంపరకు స్ఫూర్తినిచ్చుచు మరుగుననున్నారు.

రహస్య దివ్యాచరణము వీరిరువురి ప్రత్యేకత. రహస్యము, మౌనము, అనిర్వచనీయమగు పవిత్రత, ఆత్మత్యాగము వీరి సహజ లక్షణములు. తమకు పేరు ప్రతిష్టలు కలుగకుండ దైవమునకే పేరు ప్రతిష్ఠలు కలుగునట్లు ప్రవర్తించు దివ్యజీవులు, చిరంజీవులు.

చిరంజీవులు లోకకళ్యాణార్థమై భగవత్‌వ్యూహము ననుస రించి జన్మలెత్తుచు తామెవరో తమకు జ్ఞప్తి కలిగి వర్తింతురు. జన్మ ప్రయోజనములను మరువక, లోక హితార్థమగు కార్యముల నొనర్చుచు మనస్సు, ఇంద్రియము, శరీరములను హితకార్యముల కొరకై ఉపకరణములుగ వాడుదురు. చచ్చిన వెంటనే మనుష్యు డంతరించునని, శరీరముకన్న వేరుగ జీవుడు లేడని మ్లేచ్ఛ సిద్ధాంతము. ఇట్టివారు తమ శరీరమే తామనుకొని జీవించు చుందురు. కాని శరీరములంతములైనపుడు జీవులా శరీరములతో మరణింపరన్నది శాశ్వత సత్యము. శరీరము మరణించినప్పుడు

జీవుడు మరియొక శరీరమును కోరును. నూతన శరీరము కర్మాను బంధమై ఏర్పడును. నూతన శరీరమున జన్మించినపుడు మునుపటి జీవితము మరుపునకు వచ్చును. నిజమునకు మరుపే మృత్యువు. మరుపు లేనివానికి మృత్యువు లేదు. మృత్యువనగా మరుపేకాని, శరీరమంతమగుట కాదని పెద్దల యవగాహన. జన్మల తరబడి తామెవరో, తమ కర్తవ్యమేమో జ్ఞప్తి యున్న వారిని చిరంజీవు లందురు. వీరు మరపులేని వారు గనుక మృత్యువును దాటిన వారు. వీరికనేక జన్మలలో ఒకే స్మృతి అనుస్యూతముగ నుండును. ఒకే పవిత్రమైన కార్యము ఇన్ని జన్మల తరబడి నిర్వహించుటలో వారు నిమగ్నులైయుందురు.

ఇట్టి చిరంజీవులను గూర్చి వేద పురాణాది సంహితలలో ఉదహరించినపుడు ఏ జన్మలోని శరీర నామముతో చెప్పవలెను? జన్మమున కొకపేరు తల్లితండ్రుల ద్వారా ఏర్పడుచుండును. ఆ పేరు ఆ జన్మాంతము వరకే. మరల జన్మ ఎత్తినపుడు మరియొక పేరు యేర్పడుచుండును. దుస్తులు మారినట్లు జన్మములు మారు చుండగ, ఇన్ని దుస్తుల యందు ఒకే మనిషిని ఒకే నామముతో పిలుతుము గదా! అట్లే సూక్ష్మ లోకములలో శరీరములు మారి నప్పటికిని నామము ఒక్కటియే యుండును. చిరంజీవుల కిట్టి నామముండును. వారిని గూర్చి ప్రస్తావించినప్పుడు వారి మొత్తము వృత్తాంతమునకును, జన్మలన్నింటికిని సూచకమగు సంకేతనామ మొకటి యుండుట సదుపాయము. ఇది వేదసంప్రదాయము. వేద పురాణములయందు గోచరించు ఋషుల పేర్లలో ఎక్కువ భాగమిట్టిదే. ఈ విధముగ దేవాపి, మరువు మహర్షులు, వేద

వ్యాసుని పురాణములయందు పేర్కొనబడిరి. అంతకు ముందు పరాశరులున్నప్పటి దేవాపి, మరువు మహర్షుల శరీరములు వేరు. వేదవ్యాసులకు సమకాలికులుగ, మైత్రేయునికి ప్రాణమిత్రునిగ నున్న ఈ ఋషుల దేహములు వేరు.

ఈ మహర్షులు మూడు రకముల దేహములు కలిగి మూడు విధములగు కార్యములను ఒకేమారు నిర్వర్తింపగలరు. వీరికి వజ్ర శరీరముండును. ఇది దాదాపు శాశ్వత శరీరమే. దీనిని కారణ శరీరమని కూడ అందురు. ఇందుండి వెలుగు లోకముల కార్యములను చక్కపెట్టుదురు. సూక్ష్మతరమగు దివ్య ప్రణాళికను గ్రహింతురు. తదనుగుణముగ కర్మాచరణమేర్పరచుకొందురు. వీరికి సూక్ష్మ శరీరముకూడ నొకటి యుండును. ఇందుండి సూక్ష్మ శరీర కార్యములు చక్కబెడదురు. భౌతిక శరీరమొకటి యుండును. ఇందుండి భూలోక కార్యములను చక్కబెడుదురు. అవసరమగుచో ఒకే సమయమున పలుచోట్ల కనిపింపగలరు. ఈ శరీరము లన్నియు అష్టాంగ యోగమున మానవునికి సిద్ధించగలవు. ఇవి అద్భుతములు కావు. కృషి ఫలములు. జన్మల తరబడి చేసిన నిష్ఠాయుతమైన యోగసాధన యోగసిద్ధినిచ్చును. ఈ విషయమున మహర్షులు పరిపూర్ణసిద్ధులు.

ఉదాహరణకు మరువు, దేవాపి మహర్షులు హిమాలయములలోని కలాప గుహల యందు నివసించుచు భౌగోళికముగ లోకహితులకు, సత్సాధకులకు ప్రేరణ కలిగించుచు జాతి పురోగమునకై అహర్నిశలు పనిచేయుచుందురు. వీరు శ్రీకృష్ణుని ద్వారకా జీవన సమయమున కృష్ణునికి తోడ్పాటు గావించుచు అనేకానేక

కార్యములను ద్వారకలో చక్కపెట్టుచుండెడివారు. అచ్చట వారి పేర్లు శతానీకుడు (దేవాపి), మధువ్రతుడు (మరువు).

అధర్మ మెప్పుడును ధర్మముపై దురాక్రమణము చేయుచు నుండును. దీనికి అమాయక ప్రజలు బలియగుచుందురు. ఇట్టి ప్రజలను కాపాడుకొనుట, ధర్మమును నిలబెట్టుట, ప్రకృతి యొనర్చునొక కర్తవ్యము. యిట్టి పరమ ప్రయోజనమును సాధించుటకు ప్రకృతియే కొందరు జీవులను, సిద్ధులుగను, చిరంజీవులుగను తీర్చిదిద్దుకొనుచుండును. నిజమునకు యీ ఋషులు శ్రీకృష్ణుని అప్రాకృత శరీర నిర్మాణ మహాయజ్ఞమున కూడ పాల్గొనినారు. పరాశరులు, మైత్రేయులు, వేదవ్యాసులతో కలసి తమ వంతు కర్తవ్యములెన్నియో వినియోగించినారు. రహస్య జీవనమున కిచ్చగించుటచే పురాణ సంహితలలో తమను గూర్చిన ప్రస్తావన బీజప్రాయముగనుండునట్లు జాగ్రత్త పడినారు. మైత్రేయుడు, వేదవ్యాసులు ఎంతటి ప్రసిద్ధిగాంచిన యోగులో వీరుకూడ నట్టి వారే. ఆరాధ్యనీయులే. ప్రాతఃస్మరణీయులు, వాసుదేవ స్వరూపులు.

భాగవతమున వేదవ్యాస మహర్షి ద్వాదశ స్కంధమున వీరిని గూర్చి ఇట్లు పలికెను. “శంతనుని యనుజుండగు దేవాపియు, ఇక్ష్వాకు వంశజుండగు మరుత్తును, యోగయుక్తులై కలాప గ్రామ నిలయులై కలియుగాంతమువరకు వాసుదేవ ప్రేరితులై ప్రజలను ఆశ్రమాచార ధర్మములు తప్పకుండ నడుపుచు నారాయణ స్మరణంబు నిత్యం బొనర్చి కైవల్యపద ప్రాప్తులగుదురు.”

అట్లే నవమ స్కంధమున దేవాపి, మరువు మహర్షులీ విధముగ తెలుపబడిరి.

శ్రీఘ్రునకు మరువు అను రాజశ్రేష్టుండు పుట్టెను. ఆ రాజ యోగి సిద్ధుడై కలాప గ్రామంబుననున్నవాడు. కలియుగాంతంబున నష్టంబయ్యెడు సూర్యవంశంబు గ్రమ్మర బుట్టింప గలవాడు. (12వ అధ్యాయము)

*దేవాపి కలాప పురం*
*బావాసము కాగ యోగియై యున్నాడు*
*ర్వీవర కలి నష్టంబగు*
*జైవాతృక కులము మీద సంస్థాపించున్*

విష్ణు పురాణమున వీరిని గూర్చి పరాశర మహర్షి యిట్లు పలికెను :

*దేవాపి : పౌరవో రాజా మరుశ్చిశ్వాకు వంశజ మహాయోగ బలోపేతౌ, కలాపగ్రామ సంశయో కృతేయుగ ఇహాగత్వ ఛత్ర ప్రవర్తకే హితౌ భవిష్యతో మనోర్వేశే బీజ భూతౌ వ్యవస్థితౌ యేతేన క్రమయోగేన మనుపుత్రే వసుంధర కృత త్రేతాది సంజ్ఞాని యుగాని త్రీర్యుగ భుజ్యతే కలౌతు బీజ భూతాస్తే కేచి త్తిష్టంతి భూతలే. యద్దైవ దేవాపి మరువు సంప్రాప్తం సమవిస్తతే.*

కురువంశపు రాజగు దేవాపి, ఇక్ష్వాకు వంశపు రాజగు మరువు సమస్త యోగ సిద్ధులు కలిగి కలాప గ్రామమున నివసించుచున్నారు. కృతయుగము వచ్చు వరకు వారు జీవులచే హితము ననుసరింప చేయుచు మరల వర్ణాశ్రమ ధర్మములను భూమిపై

స్థాపింపగలరు. వారు రాబోవు మన్వంతరమునకు బీజములై నిలచుటకు సంకల్పించినారు. భవిష్యత్ యుగములలో (కృత, త్రేత, ద్వాపరములలో వారు జీవులకు యోగము, ధర్మముల నందింపజేయుదురు.)

కల్కి పురాణమున కూడ నిదే విషయమును వేదవ్యాస మహర్షి పేర్కొనుట జరిగినది. అందిట్లున్నది : *మరుపు దేవాపి మహర్షులు యోగేశ్వరులై ఋషి నివాసమైన కలాప గ్రామమున వసించి యున్నారు. కలియుగాంతమున వీరు మరల వర్ణాశ్రమ ధర్మములను మానవుల కందించి నూతన శకము ఆరంభింతురు. (9వ స్కంధము, 22వ అధ్యాయము)*

కల్కిపురాణమున రెండవ అధ్యాయమున ప్రథమ అంశ మున శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవునితో పలికిన పలుకులుగ యిట్లు లిఖించబడినది : నీ ప్రార్థన ననుసరించి నేను భవిష్యత్తున శంబళ గ్రామమున విష్ణు యశస్సు, సుమతి దంపతికి జన్మించ గలను. నా నలుగురు సోదరులతో నేను మరల అజ్ఞానమును, అధర్మ మును ఛేదించి, ధర్మమును స్థాపించగలవాడను. నీవును దేవతలు మీ మీ అంశలలో జన్మించి నాకు తోడ్పాటు గావించగలరు. నా హృదయేశ్వరియగు శ్రీలక్ష్మి సింహళరాజగు 'బృహద్ధృతుడు, కౌముదులకు పద్మ అను నామమున జన్మించగలదు. అపుడు నేను భూవలయమునకు మరువును చక్రవర్తిగను, దేవాపిని జగద్గురువుగను స్థాపింతును. అప్పటినుండి భూమిపై సత్య యుగ మారంభమగును. శాశ్వత ధర్మము నెలకొల్పబడును. కలి వధింప బడును.

కల్కి పురాణమున యింకను యిట్లున్నది : మునుల ప్రార్థనల నంగీకరించి కల్కి భగవానుడు గంగాతీరమున వారికి ప్రత్యక్షమై మునులనందరిని పలుకరించి ఆశీర్వదించి యిట్లనెను. "పుణ్య పురుషులారా! మీ యందు దేదీప్యమైన కాంతులతో వెలుగొందుచున్న ఆ యిరువురి మహాత్ములెవరు? వారిచ్చటి కెందులకేతెంచిరి? వారు గంగకు ఎందుకు ప్రార్థనలు సలుపు చున్నారు?" అనుచూ యింకను వారిరువురిని ఉద్దేశించి యిట్లనెను. "మీరు జాహ్నవి నెందుకు ఆరాధించుచున్నారు? మీరెవరు? మీ నామములేవి?

అపుడు మరువు మహర్షి ముందుకేతెంచి, కల్కి దేవునికి నమస్కరించి తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు, తన నామమును తెలిపెను. చతుర్ముఖ బ్రహ్మ నుండి మరీచి పుట్టుట, మరీచి నుండి మరువు పుట్టుట, మరువు నుండి ఇక్ష్వాకు పుట్టుట అట్లు వరుసగ వంశపరంపరను విశదీకరించి తాను యిక్ష్వాకు వంశజుడనని, శీఘ్రుని కుమారుడనని వివరించెను. మరువు ఇంకను యిట్లనెను.

కృత యుగాంతమునుండి ఈ కలియుగాంతము వరకు కలాప గ్రామము నివాసిగ తాను ధ్యాన నిమగ్నుడై లోకహితమున నిలచి వాసుదేవ ప్రేరితముగ నిలచియున్నానని తెలిపెను. మరువు మహర్షి బ్రహ్మనుండి జనించిన వంశమునందు తాను యాభై తొమ్మిదవ వానిగ తెలుపుకొనెను. అప్పుడు కల్కి దేవుడు కోరగ దేవాపి మహర్షి కూడ తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు చంద్రవంశమును వర్ణించెను. అత్రి మొదల్కొని, ప్రతీకుని వరకు

గల చంద్రవంశమును తెలిపి, తాను ఆ వంశమున నలుబది రెండవ తరమునకు చెందినవాడని, తన నామము దేవాపి యని తెలిపెను. తాను కూడ మరువు మహర్షివలె కలాప నివాసియై, ధ్యానయోగమున నిలచి వాసుదేవప్రేరితముగ లోకహితముగ కార్యముల నొనర్చితినని తెలిపి నమస్కరించెను.

అపుడు కల్కిదేవుడు సంతసించి వారిరువురి నాశీర్వదించి యిట్లు పలికెను :

"మీరిరువురు అసమాన ధర్మస్వరూపులు. వాసుదేవుని వ్యూహము ననుసరించి జగత్హితముగ యుగముల తరబడి మానవజాతి ఉద్ధరణకై కృషి సలిపినారు. నేను కలి ధర్మమును నశింపచేసి కృత ధనువును స్థాపించగలవాడను. అపుడు మరువు భూవలయమునకు చక్రవర్తియై అయోధ్య రాజధానిగ ధర్మ పరిపాలనమును ప్రారంభింప గలడు. దేవాపి జగద్గురువై హస్తిన కేంద్రముగ విశ్వ విజ్ఞాన విద్యను, వేద వేదాంగములను, యోగ మును జీవుల కందించుచు వారిని అమృతత్త్వదిశగ నడుపగలడు.

ఇట్లనేకానేక విషయములు కల్కిపురాణమున ఈ మహర్షుల గురించి వివరింపబడినవి.

ఇట్లు మరువు, దేవాపి మహర్షులు కలాపగుహల యందు నివసించుచు మైత్రేయునితో సహకరించుచు విశ్వవిజ్ఞాన విద్యయు, యోగమును భూగోళ వ్యాప్తి గావించుచు తదను గుణ మైన శిష్యపరంపరను నేర్పరచుచు సాగుచున్నారు.

వీరి ప్రభావముననే గ్రీకు, ఇజ్రయిలు దేశములలో విశ్వ విజ్ఞానవిద్య ఆయా శతాబ్దములలో వెలుగొందినవి పైథాగరస్. సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ మొదలగు జ్ఞానులు గ్రీకు దేశమున కెంతయో జ్ఞానము నందించిరి. గ్రీకు దేశపు జ్ఞానులలో పైథాగరస్ అత్యంత ప్రసిద్ధి గాంచినాడు. దేవాపి మహర్షియే పైథాగరస్‌గ జన్మించి గ్రీకు దేశీయులకు జ్ఞానభిక్ష పెట్టెనని యొక నానుడి కలదు.

అటులనే రోమనుల యందు పుట్టిన చక్రవర్తులందరికిని సూర్యవంశపు రాజైన మరువు ప్రచోదన కారకుడని కూడ యొక నానుడి కలదు. రోమను సామ్రాజ్యమున ఘనకీర్తి సంతరించు కొన్నవాడు జూలియస్‌సీజర్. అతడు మరువు మహర్షి యొక్క ప్రధాన శిష్యుడని యొక నానుడి కలదు. రోమను రాజ్యమే లేనిచో ఐరోపా ఖండమునకు నాగరికతయే యుండెడిది కాదు. సంఘ జీవనము, నగరవాసము, పౌర బాధ్యతలు, రాజ్యాంగము, చట్టము పరిరక్షణ, ఖగోళ భూగోళ శాస్త్రములు, జ్యోతిష్యము, ఇత్యాది మానవ వికాసపరమగు అంశములన్నియు రోమనులే ఐరోపా ఖండమున ప్రవేశపెట్టిరి. అంతకుముందు శతాబ్దముననే ఆర్యా వర్తపు ప్రజలు నాగరికులై యుండెడివారు. హస్తిన, ద్వారక, వారణాసి, మధుర, ఉజ్జయిని విశిష్ట నగరములుగ నుండెడివి.

యూదు ప్రజలను బానిసత్వము నుండి విడిపించిన మోజెస్, మరువు మహర్షి అవతారమని, అతి బలిష్టమైన ఈజిప్టు చక్రవర్తిని నిర్జించి, బానిసత్వపుచెర నుండి విడిపించి యూదు లకు స్వాతంత్ర్యము కల్పించుటయే కాక, వారికి జ్ఞానభిక్షను కూడ

పెట్టినాడు. అటులనే యూదు ప్రవక్తలలో అత్యంత ప్రాధాన్యము వహించిన జ్ఞాని 'యలీజా' దేవాపి మహర్షి యొక్క అవతారమని కొందరు భావించుచుందురు.

ఏసుక్రీస్తు జన్మ సమయమున అతనిని సందర్శించి ఆశీర్వదించిన ముగ్గురు జ్ఞానులును మైత్రేయుడు, మరువు, దేవాపి మహర్షులని హిమాలయములలోని ఆశ్రమవాసులు భావింతురు. చివరి మూడు సంవత్సరములు ఏసును నడిపించినది కూడ మైత్రేయుడే అని వారి భావన.

ఇటీవల శతాబ్దములలో నెపోలియన్ చక్రవర్తికి ప్రేరణ కలిగించి ఐరోపా ఖండమంతటికిని ఒకే రాజ్యాంగ విధానము నందింపజేసిన బృహత్తర ప్రయత్నము వెనుక మరువు మహర్షి హస్తమున్నదని ప్రతీతి.

పంతొమ్మిదవ శతాబ్దములో ఈ మహర్షులే హెలేనా పెట్రోవా బ్లావెట్స్కీకి దర్శన మిచ్చి జ్ఞానబోధను గావించి, పిండాండ బ్రహ్మాండ సృష్టి రహస్యములును, మన్వంతర రహస్యములను తెలియజెప్పి, విశ్వ విజ్ఞాన విద్యకు మరియొక ప్రయత్నము చేసినారు. ఆ ప్రయత్నమునకు కొనసాగింపుగ 20వ శతాబ్దమున 'ఏలిస్. ఏ. బైలీ' అను ఆంగ్లయువతిని, 'నికోలారోరిక్' అను రష్యా దేశపు యువ రాజును, భారతీయులైన 'కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యుల' వారిని తమ స్పర్శచే ప్రభావితము గావించి భౌగోళిక జ్ఞానసంపదను సంతర్పణ గావించినారు.

భౌగోళికముగ ఐదువేల సంవత్సరములలో ఈ మహర్షులు గావించిన మహత్తర కార్యములన్నియు కూడ మానవ పురోభి వృద్ధికే నిర్దేశింపబడినవి. జీవ పరిణామమునకే తోడ్పడినవి. గత ఐదువేల సంవత్సరములుగ వీరు తీర్చిదిద్దిన శిష్యపరంపర భౌగోళిక వ్యాప్తి చెందినవి. అన్ని రంగములలోను నిష్ణాతులైన శిష్యులు కలరు. అమెరికన్ ప్రెసిడెంట్ 'రూజ్‌వెల్ట్', శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్' వంటి మహాపురుషులు కూడ వీరి శిష్యకోటిలోని వారే. మతముల కతీతమైన సత్యములను దర్శింపచేయుచు మత ఛాందసము నుండి జీవుల నుద్ధరించుట కూడ వీరు చేయు ప్రయత్నములోని భాగములు. అట్టివారిలో భరత దేశము నేలిన అక్బరు చక్రవర్తి యొకరు. ఆయన దేవాపిమహర్షి శిష్యుడని ప్రతీతి.

ఋషి కార్యముల నెరుగుట ఋషుల అనుగ్రహముననే తెలియగలదు. అంతయును తెలుపుట ఎటులను సాధ్యము కాదు. కాని వారి స్మరణ సకల శుభంకరము. అట్టి ప్రయత్నమే ఇది. మరువు, దేవాపి మహర్షుల గూర్చి పురాణ సంహితల యందు న్నను తెలిసిన వారు బహుకొద్ది. గుప్తముగ వేల సంవత్సరముల నుండి జగద్ధిత కార్యముల నొనర్చుచున్న ఈ మహర్షులను గూర్చిన విషయములు ఇప్పుడిప్పుడే జనసముదాయము పరిచయము లోనికి వచ్చుచున్నవి. వారిని గూర్చి పరిచయము చేయు ప్రయత్నమే ఇది.

# 1

## కర్తవ్యము

పరహితము నొనర్చుట, దివ్యత్వమునకు చేరువగుట అనునవి సత్సాధకునకు కల్గు రెండు నిరంతర భావములు. గమ్యము చేరువరకు అనగా సత్యమును తెలియు వరకు ఆ సత్యము తానే అని తెలియు వరకు సత్సాధకుడు పరితృప్తి చెందడు. తాను చేయు పర'హిత' కార్యములు, ధ్యానాదికములు అత్యల్పముగా తోచుచుండును. తాను చేయు సాధన కాని, కార్యములు గాని చెప్పుకొనుటకు సిగ్గుపడు చుండును. జీవన విధానమును అన్ని విధములుగా దివ్యత్వము వైపునకు మరల్చు కొనుటకు కృషి సలుపుచుండును. అనగా కుటుంబము నందు, వృత్తియందు సంఘపరమైన కార్యముల యందు, దైవమును, ధర్మమును జొప్పించు చుండును. చేయుచున్నది చాలదని ఆరాటపడుచుండును. చేయవలసినది మిక్కుటముగ నున్నదని భావించుచుండును.

సాధనయందు సోమరితనము చోటు చేసుకొన్నచో తానిప్పటికే చాలా చేసితినని, చేయుచుంటినని తన శక్తి సామర్థ్యముల మేరకు

పనిచేయుచుంటినని తృప్తి చెందుట, గర్వపడుటగా నుండును. రోజునగల ఇరువది నాలుగు గంటలలో ఒకటి, రెండు గంటలు మాస్టరుగారి కార్యముల నొనర్చి చాలా చేయుచుంటినని భ్రమపడు చుండును. తనకున్న కుటుంబపరమైన బాధ్యతలు అంతకన్న సాధనకుగాని, పరహితకార్యమునకు గాని అనుమతించనని తనకు తానే సర్ది చెప్పుకొనుచుండును. కుటుంబ సభ్యులతో తాను మెలగు విధానమును ప్రేమపూరితమైన యుక్తితో నిర్వర్తించుకొనిన గృహము నందే మిక్కుటముగా అంతర్ముఖముగను, బహిర్ముఖముగను కార్యము లను నిర్వ ర్తించుకొన గలుగును. తన భ్రమ తనకు సత్య మనిపించుట వలన సాధనకు కొంత సమయమే కేటాయించుట చేయుచుండును. ఇది సోమరితనము.

ఒకనాడొక శిష్యుడు దేవాపి మహర్షిని సమీపించి తాను చాలా సాధన చేయుచుంటిననియు అనగా ప్రతిదినము ఉదయము, సాయంత్రము ధ్యానము చేయుచుంటిననియు, ఒక గంట సమయము సేవకు వినియోగించుచుంటిననియు, అయినప్పటికి తనయందు వికాసము తగురీతిన కలుగుట లేదనియు వాపోయెను. దేవాపి మహర్షి మందస్మితము చేసి, ఇట్లు పలికిరి : "రెండు గంటలు నీ వొనర్చు సాధనను ఇరువది రెండుగంటలలో తుడిచి వేయుచున్నావు కదా! వికాసము ఎట్లు కలుగ గలదు? జీవితమున ఏ సన్నివేశము నందైనను, దివ్య సాన్నిధ్యము లభించుచునే యుండును. దానిని నిరంతరము గుర్తించుచుండుట నిజమైన సాధన. నీవు దైవమును

గుర్తించు కాలముకన్న గుర్తింపని కాలము మిక్కుటముగ నున్నది. గుర్తించు కాలము గుర్తింపని కాలము కన్న మిన్నగా నున్న సందర్భ మున నీవు కోరిన వికాసమునకు అవకాశము కలుగును.

నీవు నీ అనారోగ్యమను భావమునందు ఎక్కువగ జీవించు చున్నావు. శరీరమున నున్న అనారోగ్యమున కన్న భావన యందు దానిని గూర్చిన విచికిత్స ఎక్కువగ నున్నది. ఆరోగ్యము కొరకు చేయవలసిన కర్తవ్యము నందు సోమరితన మెక్కువై అనారోగ్యమును గూర్చిన చింతన పెంచుకొనుచున్నావు. ఈ విధమైన భావనా మార్గమున నీ అనారోగ్యమునకు పరిష్కారము లేదు. సోమరితనమును వదులుము. చేయవలసినది చేయుము. ఊహలను వదిలి కర్తవ్యము నందు నిలుపుము" అని నిర్దేశించిరి.

సాధకులు సాధనకన్న మిక్కుటముగ అనారోగ్య చింతన చేయుట, ఆరోగ్యపరమైన విధానమును అలవరచుకొన కుండుట సోమరితనము. "ఇప్పటికే చాలా శ్రమ పడుచున్నాను" అను భావన చేయుట కూడ సోమరితనము. తన గురించి తాను జాలిపడుట సోమరితనమునకు మరింత దారి తీయగలదు. తన భావన, తను భావన పురోభివృద్ధికి అడ్డుగోడలు. ప్రత్యేకించి నలభై సంవత్సర ములు దాటిన వారి కివి గట్టి అవరోధములు కాగలవు. ఇందు జీవించు వారు సాకులతో సాధనను మరతురు. దేహము నందలి భ్రాంతిని వదలుట, ఉత్సాహముతో పరహిత కార్యమును ఒనర్చుట ఒక్కటియే

పరిష్కారము. ప్రపంచమున కోట్లాది జనులు తమ శరీరమును తాము సంరక్షించుకొనుటకై జీవించుచున్నారు. వారిలో నౌకరిగ నుండుట లోకహితుని ధర్మము కాదు. ఇట్లే సాధకులు తమ వ్యక్తిగత జీవితమునకు వలసిన సదుపాయమును అమర్చుకొను సుడిగుండ మున ప్రవేశించుట కూడ జరుగు చుండును. భగవానుడు బోధించిన కర్తవ్య మార్గమునే ఎన్నుకొని ఫలితములను ఆశించని స్థితి సాధకునకు అత్యవసరము. జీవితమున అన్ని విషయముల యందు కర్తవ్యాచరణ మొక్కటియే సత్యమై నిలచును. ఫలితముల నాశించు మార్గమున సాధన కొరవడుటయే కాక ఆరాటముతో జీవితమున చిక్కులు వేసుకొనుట జరుగును. కర్తవ్యోన్ముఖునికి అప్రయత్నముగ సమస్తము జీవిత మార్గమున లభించుచుండును. అప్రయత్న ముగ లభించువాని కొరకు ఆశించుచు కర్తవ్యమును వదలుట సోమరితనము.

## 2

# సుదర్శన చక్రము

**మా**నవుడు జ్ఞానమార్జించుచూ చేసిన దర్శనములలో సుదర్శన చక్రము ప్రాముఖ్యము వహించును. జ్ఞానమునకు సంబంధించిన సంకేతములలో చక్రము స్వయం సంపూర్ణమైనది. భారతీయులు, ఈజిప్టు, గ్రీసు, ఛాల్డియా దేశములవారు గుప్తజ్ఞాన మును ఆర్జించు కొనునప్పుడు దర్శించిన జ్ఞానమునకు కొన్ని సంకేతముల నేర్పరచు కొనిరి. భారతీయ వాఙ్మయమున ఈ చక్రమును వృత్తమని పేర్కొనిరి. వృత్తమనగా సమస్తము అని అర్థము. దీనినే పూర్ణమనియు జ్ఞాన మనియు కూడ వ్యవహరింతురు. ఒక జీవియొక్క వృత్తము కాని, ఒక కాలము యొక్క వృత్తముగాని, సర్వజీవుల సర్వ కాలముల వృత్తము కాని, ఈ సమస్తమును వృత్తముగ దర్శించినారు.

జ్ఞానమునకు చిహ్నముగా పూర్ణమునకు సంబంధించిన గణితము వేదమున ఇట్లు వివరించినాడు.

పూర్ణ మదః పూర్ణమిదం
పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ
పూర్ణమేవా వశిష్యతే

దీని తాత్పర్యమేమనగా సున్నలో నుండి సున్న తీసివేసినచో సున్నయే మిగిలి యుండును. అనగా సంకల్పమనబడు కేంద్రము ద్వారా పరతత్వము నుండి ఎన్ని బ్రహ్మాండాకాశములు తీసినను, పరతత్వము తరుగదు. ఒక్కొక్క బ్రహ్మాండము నుండి ఒక్కొక్క సూర్యుడు, నవగ్రహములు పుట్టి పెరిగి అందులో కలసిపోవు చుండును. ఒక్కొక్క భూమిపై గల ఒక్కొక్క వృత్తాకారమగు జ్ఞానము ఇంకొకరికి సంక్రమించినను మిగులుచునే యుండును. అనగా గురువు తన భావ వృత్తములో వున్న దంతయును శిష్యునకు తీసి ఇచ్చిన తర్వాత కూడా తన భావవృత్తము అట్లే యుండును. జీవులు పరంపరగా నార్జించుకొను జ్ఞాన వృత్తము, ఆ జీవులు మరణించిన తర్వాత కూడ నుండును. మానవజాతి నశించిన తర్వాత కూడ ఈ జ్ఞానమట్లే యుండును. మరల పుట్టిన భూగోళముపై మరల మానవు లచే దర్శించబడును.

ఎన్నిమార్లు దర్శించిననూ దర్శింపబడు వస్తువు ఒకటే గనుక జ్ఞానము మరలనట్లే దర్శింపబడును. పుస్తకములు నశించిననూ, ఆ పుస్తకములను మొదట వ్రాసిన జ్ఞానము ఎన్ని మార్లైనను ఆ జ్ఞానము వ్రాయగలదు. ఆ జ్ఞానమండలమే వేదము. దానికి నాశము లేదు.

ఏ వస్తువైనను పరిపూర్ణతతో వృత్తాకారము వహించును. కాలము మండలాత్మకము. దూరము మండలాత్మకము. జ్ఞానమునకు శిశువు కాలము. కాలమునకు శిశువు దూరము. ఈ రెండింటి జతయే బ్రహ్మాండము. అది సృష్టికి ముందు వృత్తాకారము (360 డిగ్రీలు), సృష్టి జరుగుటలో అండాకారము (365 డిగ్రీలు) సృష్టి బిడ్డలగు గోళములు అండాకారములు. వాని గమన మార్గములు

కూడ అండాకారములు. గోళ మందలి జీవులు కూడా తొలుత అండాకారములే. పిదప దిస్వభావములైన అండాకారములు జనించినవి (బుధుడు – బుద్ధి) తరువాత అండము నుండి రెండు భిన్న భావములైన డిప్పలు అవతరించి నవి. (శుక్రుడు, కుజుడు), సాశనములు, అనశనములు. విడిపోయిన ఈ రెండు డిప్పలు. అండమును పూరించుటకు యత్నము జరుగుచుండును. సృష్టికాండ సాగుటకు సగభాగము నుండి ప్రాణశక్తి సూర్యకిరణముల రూపములగును. రెండవ సగభాగము చంద్ర కిరణముల రూపముగ వ్యక్తమగుచు గర్భధారణము నొనరించుచూ దేహములను కల్పించుచున్నవి. ఈ రెండు భాగములను స్త్రీ, పురుష అంశలుగా ఎంచబడుచున్నవి. దేవలోకము, పితృలోకములుగ కూడ తెలియబడుచున్నవి. సూర్య చంద్రాదులుగ కూడ తెలియబడుచున్నవి. సూర్యుడు వృషభముగను, చంద్రుడు గోవుగను, భూమి దూడగను గుప్తవిద్యలలో వర్ణింపబడినవి.

ఈ సందర్భముననే ఒకటి మూడగుచున్నదని చెప్పబడినది. అందు ఒకటి నిత్యము. రెండవది అమృత మయము. మూడవది భ్రాంతి మూలకము. సూర్యుని చుట్టునూ భూమి తిరుగుదారి నిత్యము. భూమి చుట్టునూ సూర్యుడు తిరుగు చున్నట్లు కనిపించు దారి భ్రాంతి చక్రము. భూమి చుట్టునూ చంద్రుడు తిరుగు చక్రము మూడవది. ఈ చక్రభ్రమణము వలననే భూమిపై జీవుల జనన మరణాదులు కలుగచున్నవి. ఋతువులు మున్నగునవి తెలియ బడుచున్నవి. ఆత్మ, బుద్ధి, మనస్సు అను మూడు వృత్తములుగ శరీరముల రూపమెత్తు నడక ఇది. దీనినే పైథాగరస్ మహాశయుడు వృత్తమున త్రిభుజముగ సంకేతించి తన శిష్యులకు మాత్రము రహస్యముగ ఉపదేశించెడివాడు.

భిన్న వేగములు గల సూర్యుడు, చంద్రుడు ఒకే భాగ (డిగ్రీ) మీద నుండినట్లు భూమికి కనిపించుట ఈ చక్రమున (భ్రాంతి చక్రమున) ఇరువది నాలుగు తావులందు జరుగును. వీనినే పర్వము లందురు. ఈ ఇరవై నాలుగు పర్వముల అందమే గాయత్రీ ఛందస్సు. దీనికి సూర్యుడు కేంద్రము. దీనినొక గానముగ తాళ లయాత్మకముగ కనుగొనగల్గుట గాయత్రి. దాని నడకతో తన కర్తవ్యమును గుర్తెరుగుట దీని యర్థము. దీని రహస్యమును ఉద్బోధచేయు 24 అక్షరముల వరుసయే గాయత్రి మంత్రము. ఈ విధముగ ఈ చక్రమునకు 24 కణుపులు (12 పూర్ణిమలు, 12 అమావాస్యలు). 12 అంచులు (12 మాసములు). దీనినే సూర్యుని 12 భావములుగా గుప్తవిద్య వర్ణించును. 12 భాగములలో ఒక్కొక్క దానిలో 30 చొప్పున 360 అరలు ఈ చక్రమున కట్టబడి వున్నవి. ఇట్లు చక్రమునకు, అందము నకు గల సంబంధము చర్చించ బడినది. ఈ సంబంధము కనిపెట్టుట లోనే సర్వసృష్టి యొక్క కర్మఫల మార్గమున్నది.

ఈ చక్రమును ఆరుగురు కుమారులు త్రిప్పుచుందురట. వారే ఋతువులు. అచ్చట ధాత, విధాత అను రెండు శక్తులు, నల్లని, తెల్లని నూలు పోగులను (వెలుగును, చీకటిని) నేయుచుందురట, అవియే రాత్రింబవళ్లు. ఈ చక్ర వర్ణమున ఖగోళ రహస్యములన్నియు వివరింపబడెను. దానినే జోతిష్టోమ యజ్ఞమందురు. భారతమున ఉదంకుడు నాగలోకమునకు పోయిన సందర్భమున ఈ చక్రము వర్ణింపబడినది.

దీనినే సుదర్శన చక్రమందురు.

3

## గుప్తవిద్య - ప్రయోజనము

**జీ**వుల పుట్టుకవేళ ఆ జీవులపై ఆ సమయము యొక్క ముద్ర పడును. ఈ ముద్రలు క్షుద్రజంతువులలో కన్పింపవు. పాదములు గల జంతువులలో చివర వ్రేళ్ళపైపడును. మానవుల చేతి, కాలివేళ్ళ చివర ఈ ముద్రలు స్పష్టముగా కనపడును. ఈ ముద్రలను బట్టి మానవుడు జీవితమున ఎందుకు పుట్టెనో తెలియుటయు, అతడు పుట్టిన తిథి, వారము, నక్షత్రము, గ్రహస్థితి, అతని పేరులోని ధ్వనులను గుణించి జీవిత ప్రయోజనము కనుగొనుటయు శాస్త్రకారు లెరిగిన విషయము. ఈ విధమైన సంబంధము బ్రహ్మాండ పిండాండ ములలో కలదని కనుగొని మానవుడు తన కర్తవ్యమును గుర్తెరుగుటకే ఈ గుప్త విద్యలు, అర్హులగు వారి చేతిలో గురు పరంపరగా వచ్చు చున్నవి. ఈ విధముగ కాలము ఒక చక్రముగా ఉపాసింపబడు చున్నది. అందలి భూత, భవిష్యత్, వర్తమానములు ఆ చక్రమున సమదూరములగు మూడు బిందువులు.



సమకోణ త్రిభుజము, వృత్తమును ఇమడ్చబడిన పైథాగరస్ చిహ్న మిదియే. దీనినే భారతీయులు ఆత్మ, బుద్ధి, మనస్సు చక్రము గను, గురుచక్రముగను, త్రిగుణాత్మక చక్రముగను బోధించిరి. భారతీయ జ్యోతిశాస్త్రమున ఈ త్రిభుజము నందలి కోణములను ప్రత్యేకముగా వివరించిరి. జీవి పుట్టిన సమయమున ఆ ప్రదేశమున తూర్పు రేఖ వర్తమానమును, అచటనుండి మిగిలిన రెండు కోణముల భూత భవిష్యత్తులను దర్శింప చేయును. దీని మీదనే హస్త రేఖలలోని త్రిభుజ ముద్ర లాధారపడి యున్నవి.

ఇట్లు శాశ్వత జ్ఞానమునకు గల ఏడు గ్రంథులలో జ్యోతిశ్చక్ర విద్య, రేఖా విద్యయు ఒకటి. దీని రహస్య గ్రంథము ప్రాచీనమున ఒక మూలభాషలో నుండెడిది. అది కేవలము ఉపదేశ గమ్యమైన భాష, అనగా, గురువు కొన్ని అక్షరము లుపదేశించి కొన్ని ఆకారములు చెప్పినచో శిష్యునకు సర్వజ్ఞత వచ్చును. ఆ గ్రంథములోని విషయ ములు కొంత కొంత భారతీయ భాషల లోనికి, టిబెట్, ఈజిప్టు, గ్రీకు భాషలలోకి అనువదింపబడినవి. కాలక్రమమున ఇతర భాషల లోకి అనువాదమగుసరికి మూలభావము నశించినది.

వేదము, బైబిలు మొదలగు మూలగ్రంథము లందు ఈ విషయములు గోచరము కాగలవు. "ఖీరో" (Cheiro) అను ద్రష్ట విషయమున బైబిలు అనువాదకులు దురభిప్రాయబడిరి. ఏడవ అధ్యాయము, Book of John ఏడవ పద్యమున ఈ విధముగ నున్నది. "దైవము" మానవుని అరచేతుల యందు, వ్రేళ్ళయందు కొన్ని సంకేతములను గుర్తులను ఏర్పరచెను. కారణమేమన, ఆ గుర్తులను సంకేతములను అవగాహన చేసుకొని మానవుడు తన జీవన

ప్రయోజనము తెలుసుకొన గలుగును. ఈ విషయము దురవగాహన చేసుకొనుటచే అనువాదము పొరపాటుగ జరిగినది.”

భారతీయ సంప్రదాయమున ఈ జ్యోతిశ్చక్రమును భగవంతుని కాలస్వరూపముగ ఆరాధించుట జరుగుచున్నది. శాస్త్రపరమైన సుదర్శనము మరుగున పడినది. సుదర్శన చక్రము విషయమున దర్శనజ్ఞానము వలసినవారు పై చెప్పబడిన సంకేతమును గురు శ్లోకము నాధారముగ చేసికొని ధ్యానము చేసినచో వారియందీ శాస్త్రము మరల ఉద్భవింపగలదు.

**గురు శ్లోకము :**

*గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।*
*గురుస్సాక్షాత్పర బ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥*



4

## అశ్వవిద్య - 1

ప్రాచీన వేద సంప్రదాయము ఒక మతముగా పరిణమింపక ముందున్న శాస్త్రకక్ష్యలను పరిశీలించుట అత్యవసరము. అనేక దేవతలు జంతువుల రూపములలో వారి విజ్ఞానము సంకేతింపబడి యున్నది. అశ్వము, మేషము, విహంగము, చక్రము, పద్మము, సర్పము, హంస ఇత్యాది సంకేతములు వున్నవి. అందు అశ్వమును గూర్చి కొంత పరిశీలింతము.

*"అశ్నుతే గమనేన ఇతి అశ్వః"* అనగా గమనమున వ్యాపించున దని దీని భావము. కిరణము, అగ్ని ఈ విధమగు వ్యాపనము, గమనము కలిగియున్నవి. ఇతర జీవుల గమనమునందున్నప్పుడు వ్యాపన ముండదు. వ్యాపనమునందున్నప్పుడు గమనముండదు. గమనము, వ్యాపనము రెండూ కలిగియుండుట దైవీ లక్షణము. చైతన్య మట్టిది. గుఱ్ఱము సంకేతముగ ఈ విద్యను అశ్వవిద్యగ వేద ఋషులు బోధించిరి.

"శ్వ" అనగా రేపు, నిన్న. "అశ్వ" అనగా రేపు నిన్న కానిది. అనగా నేడు. భవిష్యత్తు, భూతములుగాక ఉన్న కాలమును అశ్వమని

ఋషులు చమత్కరించిరి. అనగా ప్రస్తుతము, వర్తమానము, నిత్యనూతనమగు ప్రాణశక్తి అని అర్థము. జ్ఞానము అని కూడా అర్థము. అనుభవవైకమగు ప్రాణశక్తి అని అర్థము. వేద వాఙ్మయమున అశ్వము అనగా తేజోమయము, విజ్ఞానమయము, కామగమనము, నిత్యగమనము, కాలస్వరూపము గల ఒక దేవత. పంచభూతములు శరీరముగ సృష్టి అగుట, శరీరము పంచభూతములుగ లయమగుట అను సంచయ లయ శక్తులకు మూలకారణమై అంగములయందు నిహితమైన ప్రాణాగ్నిని అశ్వత్థము అని చెప్పుదురు. అశ్వరూపమున అగ్ని అంగములయందు వుండుటచే అశ్వత్థము అనిరి.

అశ్వవిద్య యనగా ప్రస్తుతము జీవించు సాధన. గతించిన విషయముల యందు రాబోవు విషయముల యందు మనసును విహరింపనీయక ప్రస్తుతమునందు నియమించుట వలన సాధకుడు ప్రాణవంతుడుగను, తేజోవంతుడుగను, అప్రమత్తుడుగను జీవించ గలడు.

ప్రస్తుతము లేక వర్తమానము నిర్దేశించుచున్న కర్తవ్యము లందు మేల్కొంచియున్న జీవుడు సన్నివేశములయందు అప్రమత్తుడై యుండుట వలన ఏకాగ్ర మనస్కుడై తత్సన్నివేశముల నుండి పూర్ణాను భూతిని పొందును. ఈ సాధనయందు సిద్ధిపొందిన వారు జీవిత సన్నివేశముల యందు రసానుభూతి పొందుట కర్హులగుదురు. నిత్యమూ ప్రస్తుతము నందే నియమింపబడిన మనస్సు రస స్వరూపు డైన భగవంతుని ఆస్వాదింపగల స్థితి యందుండును. గతమునందు, భవిష్యత్తునందు తగుల్కొని మనస్సు ప్రస్తుతమును మరచుటచే అనుభూతి కరవగుచుండును. భోజనము చేయునపుడు, తరువాత

చేయవలసిన పనులలో నిమగ్నమైన మనస్సు భోజనానుభూతిని పొందదు. పనులు చేయుచున్నప్పుడు మనస్సు సాయంకాలము కుటుంబ సభ్యులతో ఏమి చేయవలెనో ప్రణాళిక వేసినపుడు, ఆ మనసు పనులయందు వర్తింపక కర్మానుభూతిని కలిగించదు. సాయంకాలము కుటుంబముతో సినిమాకో, సముద్ర తీరమునకో వెళ్ళిన సమయమున మరిచిపోయినవి, చేయనివి పనులు గుర్తుకు వచ్చి సముద్ర తీరమును, సినిమాను ఆనందించు అర్హతను కోల్పోవును. ఇట్లు భోజనానుభూతిగాని, కర్మానుభూతిగాని, విశ్రాంతి అనుభూతిగాని దక్కనీయక రాబోవు లేక అయిపోయిన విషయముల యందు రమించు మనస్సు శవము వంటిదని ఋషులు పేర్కొనిరి. ప్రస్తుతమున ఏకాగ్రతతో కర్తవ్యమున కేంద్రీకృతమైన మనస్సులకు మాత్రమే ఆనందానుభూతి సులభము. ఇట్లు అశ్వమునందు స్థిరపడిన మనస్సు ప్రతిచిన్న విషయమునందు కూడ పూర్ణముగ రమింపగలదు. దంత ధావనము, స్నానము, వస్త్రధారణము వంటి సామాన్య సన్నివేశములయందు కూడ మిక్కుటమైన అనుభూతి చెందుచుండును. ఇది ప్రాథమికమైన విద్య. ఇది ఆధారముగ సర్వవిద్యలను గ్రహింపవచ్చును. అశ్వముఖుడుగ భగవంతుని చిత్రీకరించుట కిదియే సంకేతార్థము. 'ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే' అని వేదవాక్యము. అనగా సర్వ విద్యలకు ఆధారము అశ్వము తలగా గల దేవత యని అర్థము. ఈ విద్య నేర్పి, ఇతర విద్యలు నేర్పుట వేద సంప్రదాయము.

# 5

## అశ్వవిద్య - 2

సంవత్సర చక్రమును ప్రవర్తింప చేయుచున్న శక్తి అశ్వమే. అది సూర్య కేంద్రితమైన శక్తి. అందుండియే సర్వము నందును విత్తనములు మొలక రూపమున మరల మరల బహువిధముగ జన్మించుచున్నవి. మరల మరల పునరావృతమైన వర్షించు పర్జన్య శక్తి కూడ అశ్వమే. అనగా సూర్య కేంద్రకమైన సంవత్సర చక్రమున అగ్ని అశ్వ స్వరూపుడు. దాని నారోహించి పర్జన్య శక్తి వర్తించు చుండును. భూమి సూర్యుని చుట్టూ వృత్తాకారముగ తిరుగు నపుడు ఏర్పడు అక్షరములన్నియు తేజోమయములు. సూర్యుని నుండి భూమికి చేరు ఈ కిరణములన్నియు భూమికిని సూర్యునికి వెలుగు మార్గము లేర్పరచుచున్నవి. సూర్యుని నుండి భూమికి గమనము చేయుచు వ్యాపించి యన్నవి. అనగా అశ్వములుగ నున్నవి. ఈ వెలుగు కిరణముల నాధారము చేసుకొని భూలోకము నుండి సూర్యలోకమునకు చేరవచ్చును. మహాభారతమున ఉదంకోపాఖ్యాన మున ఈ రహస్యమునే సూచన ప్రాయముగ వేదవ్యాసుడు తెలిపినాడు. పాతాళమున బంధింపబడిన ఉదంకుడు అశ్వము యొక్క తోకను

ఆధారముగ గొని శ్వాసను పూరించి, అశ్వము యొక్క ముఖము ద్వారా ఊర్ధ్వమున కేతెంచి, గురు సాన్నిధ్యమున నిలచును. ఇచ్చట సంకేతింపబడిన అశ్వము కిరణమే.

పదార్థమునందు బద్ధులైన జీవులు కూడ వెలుగు కిరణముల నాధారముగ చేసుకొని, ఊర్ధ్వముఖముగ వెలుగు పుట్టు చోటులో చేరుటకు సాధన మార్గము సంకేతింపబడినది. తన యందలి హృదయము లేక భ్రూమధ్యము అను వెలుగు కేంద్రములపై సాధకుడు మనస్సు లగ్నముచేసి శ్వాస నాధారముగ ఆ కేంద్రములను చేరుట అశ్వవిద్య యొక్క రెండవ సందేశము. పర్జన్య శక్తి ఇట్లే భూమి జలము లను ఆకాశమునకు గొనిపోవుట, ఆకాశజలములను భూమికి కొనువచ్చుట చేయుచున్నది. ఈ రహస్యములను తెలుపు యజ్ఞమునే జ్యోతిష్టోమము అందురు. అగ్నికి వాయువునకు గల ఋతు నిర్మాణా త్మక శక్తి ఇందు చమత్కరింపబడినవి.

బ్రాహ్మీకరణములైన యజ్ఞములలో ఈ అశ్వవిద్యను అశ్వమేధ మందురు. మేధ్యమైన అశ్వము ఈ సంవత్సర విద్యయే. జ్యోతిర్మార్గ మున జీవి శ్వాస గమనాగమనములను, జీవన్మరణములను, కర్మ ఫలములను తెలుసుకొనుటకు సర్వజ్ఞమగు స్వస్వరూప జ్ఞానమునకు ఈ విద్య దారితీయును. సమస్తములకు మూల కారణమైన ఆత్మ తత్వము లేక సూర్య తత్వము ఒక అశ్వము శిరస్సుగా రూపింబడినది. ఉషస్సు అశ్వమునకు శిరస్సని బృహదారణ్యక ఉపనిషత్తు చెప్పు చున్నది. ఈ ఉషస్సు ప్రతి దినము ప్రారంభమునందు, ప్రతి సంవత్సర ప్రారంభము నందుకూడ దర్శన మిచ్చును. సంవత్సర ఉషస్సు అశ్వనీ

నక్షత్రమున ఆరంభమగును. అదియే దేవతల సూర్యోదయము. ఇది మానవులకు సంవత్సరమున కొకమారు వచ్చును. అప్పుడు వసంత ఉష్ణ కిరణ ధారలచే సూర్యుడు భూమిని తడుపును. అట్టి సూర్యుని ఉచ్చస్తుడందురు. అతడే అశ్వని శిరస్సు గల దేవత. ఈ రహస్యమే తరువాత హయగ్రీవ విద్యగా తంత్రశాస్త్రమున నెలకొనినది.

హయగ్రీవుడు సర్వవిద్యలకును ఆధారము. జ్ఞానానంద మయమగు వెలుగు. నిర్మలమైన స్ఫటికాకృతి కలవాడు. ఇతడు వాగ్దేవతలలో ఒకడుగా దర్శింపబడినాడు. గుఱ్ఱపు సకిలింపులో గల హల్లులను, అచ్చులను, ఒక క్రమముగ నేర్పరచినచో హయగ్రీవ మంత్రమగును. వాని నుచ్చరించుటలో మానవుని నాడీమండలము లోని సప్తాశ్వములు ప్రచోదనము చేయబడి సర్వవిద్యల రహస్య ద్వారములు తెరచుకొనును. దానికి మూలిక బ్రహ్మీ అను వృక్ష పర్ణము.

ఈ విధముగ లోకసాక్షి యగు సూర్యునకు ప్రతిబింబమగు అంతస్సాక్షి అగు సూర్యుని ఉషస్సుగా భావించి ఉపాసించుటయే హయగ్రీవ విద్య. సమస్త జ్ఞాన ప్రదమగు యోగ విద్యయే అశ్వ విద్య. దీనికి మూలకారకమైన ఖగోళ భాగము ధనస్సు అనబడు రాశి. ఇది అశ్వని నుండి 240° లలో ఆరంభించి 270 డిగ్రీలలో అంతమగును. వింటిని ధరించి అశ్వము వంటి ఉత్తర శరీరము గల నరుడు దీని రూపము. అనగా విజ్ఞాన కేంద్రమునకు గురి పెట్టుచున్న జ్ఞానాగ్నియగు వేగవంతమైన జీవమని దీని అర్థము. ధనస్సు పురుషునకు సర్వశుభకర మనబడు నవమస్థానము. ప్రతి సంవత్సరము సూర్యుడీ భాగలలో ప్రవేశించినపుడు ధనుర్మాస

మారంభమగును. నిష్కామమైన విజ్ఞాన కాండను ఉపాసించు ధనుర్మాస వ్రతమిందులకే.

యోగదండమునకు రెండు పాములు మెలికలు చుట్టుకొని యుండుట అశ్వరాశి చిహ్నము. బైబిలు గ్రంథమున కూడ ఈ రాశికి సంకేతము కలదు. దీనినే Aron's Rod అని ఉపదేశ రహస్యముగ చిత్రించిరి. ఈ ఉపదేశమందిన వారికి దేవుని సృష్టి రహస్యములు వ్యక్తమగును. ఈ సంకేతమునే మనవారు కుండలినీ యోగ సాధనగ దర్శించిరి. ఈ అశ్వరాశిలో సూర్యుడు ప్రవేశించిన దినము నుండి యోగ సాధన వ్రతము లారంభించుట శాస్త్ర రహస్యము. ఈ విధముగ జ్యోతిర్మయమైన శాశ్వత జ్ఞానాశ్వమునకు అశ్వనీ నక్షత్రము ముఖము. మూలా నక్షత్రము తోక. సూర్యుడు అశ్వనిలో ప్రవేశించుట, మూలలో ప్రవేశించుట రెండు విధముల విజ్ఞాన యజ్ఞములకు మూలకారణమై అనంతమగు జ్ఞాన రాశికి చిహ్నమై ఒప్పుచున్నవి.

ఇందలి రహస్యార్థము గమనింపదగినది. అశ్వని శిరస్సగు ఉషస్సు, మేషము యొక్క శిరస్సుగ ఉండును. మూల, అశ్వము యొక్క జఘనము. అది మూలాధారమున (ధనస్సున) నుండును. ఈ రెండశ్వముల దేవతలే నాసత్యదస్రులు. ఈ రెండు గుఱ్ఱములను కట్టిన రథమే జీవాత్మ శరీరము. ఈ రథముల రెక్కలే అక్షరముల లెక్కలుగ ఆదిపర్వము మొదట అక్షౌహిణి కథనముగ చెప్పబడినది.

## 6

## గోపాల మంత్రము

సర్వతః సామరస్యము, వైభవము, విజయము కలిగించు తత్వమును గోపాలతత్వము అందురు. ఈ తత్వము యొక్క నివాస స్థానము బృందావనమందురు. బృందావనమనగా అనేక విధములైన సూర్య చంద్రాత్మక వలయమలు పరిరక్షింపబడు దేశము. ఇందలి సూర్యాత్మక ప్రజ్ఞను బృహస్పతి తత్వము, చంద్రాత్మక ప్రజ్ఞను శుక్రతత్వము పరిరక్షించుచుండును.

'గో' అను శబ్దము విజయము చెందిన జీవాత్మ యొక్క స్థితి, జీవాత్మ విజయము చెందుటయనగా తాను అక్షరుడ ననియు, శాశ్వతుడుననియు తెలుసుకొనుట. గోశబ్దము నందు రెండు శబ్దములు ఇమిడి యున్నవి. అవి గ, ఓ. 'గ' శబ్దము బృహస్పతి తత్త్వమునకు సంబంధించినది. 'ఓ' శబ్దము సూర్యతత్త్వమునకు సంబంధించినది. సూర్యతత్త్వము ఆత్మతత్త్వమే. దానితో బృహస్పతి తత్త్వము చేరినప్పుడు ఆత్మతత్త్వము వికాసము చెంది అపరిమిత మొందును. ఇదియే జీవుని విజయము.

**'పా'** అను అక్షరము పానము చేయుట, పరిరక్షింపబడుట అను భావములకు సంకేతము. తాను పరిరక్షింపబడి అమృత తత్త్వమును పానము చేయుట 'పా' అనుశబ్దము సంకేతించుచున్నది. 'పా' శబ్దమునకు శుక్రతత్త్వము జ్యోతిషమున సంకేతింపబడినది. శుక్రుడు అమృతత్త్వ విద్యకు అధిపతి  గదా!

'గోపా' శబ్దము, పరిరక్షింపబడి అమృత పానము చేయుచు సామరస్యమును, విజయమును, పొందిన జీవాత్మను సూచించును. గోప, గోపీజనులనగా వీరే. సూర్య చంద్రాత్మక ప్రజ్ఞలుగ సృష్టి వలయమును ఏర్పరచువారు కూడా వీరే.

వీరు పొందు తాదాత్మ్యస్థితిని శబ్దపరముగ ఇంద్రబీజము అయిన 'ల' అను అక్షరముగ ఋషులు తెలిపిరి.

పానము, పరిరక్షణము, అమృతత్త్వము, సామరస్యము, విజయము అను గుణములన్నియు **'గోపాల'** అను శబ్దమున ఇమిడి యున్నవి. గోపాల మంత్రముచే ఇట్లు తాదాత్మ్యము చెందిన జీవులు ఎందరోకలరు. శ్రీకృష్ణుని గానము, భజనము, ధ్యానము, స్మరణము చేసిన భక్తులు పరిసరముల ప్రభావము నండి పరిరక్షింపబడుట కృష్ణభావనా పారవశ్యమున జీవించుట ఇందలి రహస్యము. జగద్గురువగు శ్రీకృష్ణుడు తనను ధ్యానము చేసిన వారందరికీ పై విజయమును అనుగ్రహించుచుండును.

గోపాల మంత్రమును ఈ క్రింది యంత్రమున ధ్యానము చేయవచ్చును.




♃ = గ, గో - బృహస్పతి

☉ = ఓ - సూర్యుడు

♀ = పా - శుక్రుడు

♆ = ల - ఇంద్రుడు

జీవుని విజయమునకు ఇంతకుమించిన యంత్రము లేదు. జీవుని ప్రయాణమున ప్రతి నిత్యము మాధుర్యము నిండి యుండుట, జీవితము వైభవోపేతముగా ముందుకు సాగుట ఇందలి అద్భుతము.

## 7

## కర్మజ్ఞానములు

సిద్ధాంతము నుండి ఆచరణ వ్యక్తమగు చున్నది. ఎవరి సిద్ధాంతమును బట్టి వారు ఆచరించెదరు కదా! ప్రతి ఆచరణకు కేంద్రబిందువుగ ఒక సిద్ధాంత మున్నది. సిద్ధాంతము నుండి, ఆచరణ నుండి సిద్ధాంతము పుట్టుచునే యుండును. సిద్ధాంతము బీజమైన, ఆచరణ, వృక్షమగును. మరల ఆ వృక్షము నుండి అదియే బీజము జనించుచున్నది.

తండ్రి నుండి కొడుకు జనించి, కొడుకు నుండి మరుల కొడుకు జనించుటచే మొదటి కొడుకు తండ్రి అగుచున్నాడు. కొడుకు తండ్రి అగుట, తండ్రి కొడుకగుట బీజము వృక్షముగ అనుశ్యృతము సాగుచునేయుండును.

మనస్సు నుండి సంకల్పము పుట్టి సంకల్పము నుండి మరల మనస్సు పుట్టుచు నుండును. అటులనే చరిత్ర నుండి పరిణామము పుట్టి చరిత్రగ మారుచున్నది.

కేంద్రము నుండి పరిధి పుట్టుచున్నది. పరిధి యందలి ప్రతి బిందువు నుండి మరల పరిధులు పుట్టుచున్నవి. ఈ విధముగ కేంద్రము పరిధిగను, పరిధిగను, పరిధి కేంద్రముగను మారుచున్నవి.

పై విధముగ కర్మ నుండి జ్ఞానము పుట్టుచు, జ్ఞానము నుండి కర్మ పుట్టుచున్నది. కర్మ, జ్ఞానములు, చెట్టు, విత్తనముల వంటివి. ఈ రెండింటి యందు సమభావము కలిగి యుండుట యోగస్థితికి దారి తీయును. కర్మలేని జ్ఞానము, జ్ఞానము లేని కర్మ ద్వంద్వమునకు సంసరణము కలిగించును. కర్మమును, జ్ఞానమును సమరీతిని గౌరవించి అనుసరించుట పరిణామమునకు దారి తీయును.



## 8

## మా దివ్య శరీరము

**మే**ము అగుపడుట, అదృశ్యమగుట చూచి దిగ్భ్రాంతి చెంద నవసరము లేదు. ఇది ఒక వైజ్ఞానిక శాస్త్రము. సూక్ష్మలోకమున స్వామిత్వము, శాశ్వతత్వము పొందిన వారికి ఈ విషయము క్రీడాప్రాయము. కొన్ని కిరణముల ప్రభావమున అగుపడుట జరుగును. వాటిని మరల విడుదల చేయుట వలన అదృశ్య మగుట జరుగును. ఈ ప్రక్రియ అదృశ్యమగు సూక్ష్మశరీరము ద్వారా జరుగును. ఈ విధముగ అవసరమును బట్టి భూమిపై ఎక్కడైనా, ఎపుడైనా అవతరించ గలుగుట మాకు గల మంచి సౌకర్యము. సూక్ష్మ శరీర మాధారముగ అంతర్‌గ్రహ ప్రయాణములు కూడ మేము సలుపుచుందుము. ఇది అనేక జన్మల కృషి. అంతర్ గ్రహ ప్రయాణము లకు వలసిన సూక్ష్మశరీరము అత్యంత తోజోవంతముగ నుండును. బహు పటుత్వము కలిగి యుండును. భౌతికచక్షువులతో ఈ మా శరీరమును దర్శించుట సాధ్యము కాదు. అందువలననే భౌతిక శరీర మును కూడ ధరించి యుందుము. ఉత్తమ సాధకులకు కూడ మా వెలుగు శరీరము స్పష్టాస్పష్టముగ దర్శించుట యుండును కాని పూర్ణ దర్శనమునకు అవకాశము లేదు. మీ క్షేమము కోరి పూర్ణదర్శన మీయజాలము.

# 9

## బిందువు

శుద్ధచైతన్యము నుండి సంకల్ప ముద్భవించు క్షణమున చైతన్యమే బిందువుగ నేర్పడును. అనగా సంకల్ప బీజముగ తాను మొత్తము చైతన్యము నుండి వేరగును. బిందువేర్పడిన తక్షణమే దానికి పరిధి ఏర్పడును. అనగా సంకల్ప బిందువునకు కాలపరిమితి ఏర్పడును. సృష్టియందు మానవుని యందుకూడ ఇట్లే సంకల్పము లేర్పడుచుండును. మరల శుద్ధచైతన్యమున లీనమగుచుండును.

కేంద్రమునుండి పరిధికిగల దూరము సంకల్పము యొక్క వైశాల్యమును నిర్ణయించినది. ఒక సంకల్పము నిర్వర్తింపబడు లోపల అందులో అంతర్భాగముగ మరియొక సంకల్పము మొలకెత్తును. అనగా ఆదిసంకల్పములలోని వివరములే అనుగత సంకల్పములుగ దిగి వచ్చుచుండును. ఈ అనుగత సంకల్పములన్నియు ఆది సంకల్పము వశమున నుండును. స్థూలముగ ఆదిసంకల్పము నుండి ఏర్పడు అనుగత సంకల్పములు ఏడుగ పెద్దలు వర్గీకరింతురు. సూక్ష్మముగ మానవ మేధస్సునకు అందని వర్గీకరణములున్నవి. ఆదిసంకల్పమునే మహా సంకల్పమని కూడ అందురు.

# 10

## సిద్ధాంతము - ఆచరణ

ఆచరణకు సిద్ధాంతము బీజము. సిద్ధాంతమునకు ఆచరణ శిశువు. ఒకటి బీజము మరియొకటి వృక్షము. అటులనే సంకల్పము నకు మనస్సు తల్లి, మనస్సునకు సంకల్పము పుత్రుడు. సంకల్పము నకు జ్ఞానము తల్లి, జ్ఞానమునకు సంకల్పము పుత్రుడు. పరిణామము చరిత్ర గర్భమునుండి వెలువడుచుండును. పరిణామము నుండి మరల చరిత్ర వెలువడుచుండును. సృష్టి అంతయు చర్వితచర్వణమే. అనగా జరిగినదే మరల మరల జరుగుచుండును. కాని జరిగినపుడెల్ల పాతదిగ కాక కొత్తదిగ గోచరించును. దీనినే ఋషులు "నవ" అని పిలిచెదరు. ఎప్పుడును కొత్తదిగనే కొనిరాబడుచున్నది. కావున "నవనీత" మనిరి.

ప్రతిదినము నిద్రలేచుట, పనులు చేయుట, భుజించుట, మాటలాడుట, విశ్రాంతి గొనుటగా జరుగుచున్నను, ప్రతిదినము ప్రత్యేక దినముగ గోచరించుచున్నది కదా! ఇట్లు సంకల్పముల నుండి ఆచరణములు, ఆచరణముల నుండి మరల సంకల్పములు అనంతముగ చక్రభ్రమణము చేయుచునేయుండును. అయిపోవుట ఏ స్థితి యందు ఉండదు.

11

# సూర్య చంద్ర లోకములు

**సూః** + యః = సూర్యః. ఎవడు వృద్ధి యగుచున్నాడో అతడే సూర్యుడు. అతడు సృష్టికి కేంద్రము. అనగా బీజప్రాయ మగు సంసార వృక్షమునకు మూలరూపము. ఇతడు తూర్పున ఉదయించును. తూర్పు అనగా భూమి, ఆకాశములు కలిసిన చోటు అనగా కశ్యపుడు, అదితి కలిసిన చోటు. అచట సూర్యుడుగ ఉదయించును. అతడు చీకటినుండి పుట్టును గాని, యతడు పుట్టిన వెనుక చీకటి యుండదు. అతడు లోక చక్షువు. అతడు పుట్టినవెనుక లోకము లుండునుగాని, అంతకుముందు లోకముండదు. అంతకు ముందు లోకములు నిద్రలో ఉండును. అతడు నిన్న ఉదయించిన తావుననే ఉదయించినట్లు ఉండును కాని, ఏనాటికానాడు ఒక క్రొత్త శిశువు.

## 12

## నలుడు

నలుని కథయందును, ధర్మరాజు కథయందును బోధింపబడిన సత్య మొక్కటియే. నలోపాఖ్యానమే మరికొన్ని విశేషములతో మహాభారతముగ ఈయబడినది. దమయంతికి క్రొత్తరూపమే ద్రౌపది. పంచపాండవుల సమగ్ర రూపమే నలుడు. నలుడు రూపుకట్టిన ధర్మము. పంచేంద్రియములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, విడివిడిగ పంచపాండవులు సమగ్రముగ నలుడు. నలుడు జూదమాడి ఓడెను. ధర్మజుడు కూడ జూదమాడి ఓడెను. ఇద్దరును రాజ్యమును కోల్పోయిరి. ఇద్దరును మరల వారి వారి సతీమణుల పాతివ్రత్య మహిమచే శుభమును పొందిరి. దమయంతి, ద్రౌపది క్రియాశక్తి స్వరూపములు. శక్తి నుండియే సృష్టి పంచీకరణము చేయబడినది కదా! పంచీకరణము చేయబడిన సృష్టియందు శక్తియే నిండియున్నది కదా! ఈ అనుబంధమునే పరిణయముగ కీర్తించుట కవి సమయము. కావున నలుని కథ శ్రద్ధతో చదివినచో మహాభారతము చదివిన కలుగు వికాసము బీజప్రాయముగ కలుగ గలదు.

# 13

## నామ రహస్యము - 1

ప్రతి వ్యక్తి పేరును, ఆ వ్యక్తి స్వభావమునకు సంబంధించిన రహస్యములను విడమరచు తాళము చెవి. ప్రతి వ్యక్తి స్వభావము కాలక్రమమున ప్రత్యేకముగ నేర్పడుచుండును. వ్యక్తి సహజముగ పరమాత్మనుండి వ్యక్తమైన జీవుడే అయినప్పటికి అతని చుట్టు ఏర్పడు స్వభావము అతనికొక ప్రత్యేకత నేర్పరచును. కాలమును, దేశమును బట్టి జన్మించిన జీవుని నామము కూడ తల్లితండ్రుల సంకల్పము నుండి దిగివచ్చును. తల్లితండ్రులు తాము కనితిమని, పేరు పెట్టితి మని భావింతురు. కాని జీవుడు, అతని నామము తల్లితండ్రుల నుండి కాక, వారి ద్వారా వ్యక్తమగుచున్నవి. జీవుడు తనతోపాటు తన స్వభావమును, స్వభావమునకు అనుగుణమగు నామమును తనతోనే తెచ్చుకొనును. అతని నామమున అతనికి సంబంధించిన జీవప్రజ్ఞ స్వరూప స్వభావములు స్పష్టాస్పష్టముగ ఇమిడివున్నవి.

నామ శబ్దమునకు జీవుడు అప్రయత్నముగనే ప్రతిస్పం దించును. అంతియే కాదు పిలుచువాడు, పిలువబడువాడు కూడ

తద్విషయమున ప్రతిస్పందింతురు. పిలుచువాడు, పిలువబడు వాడు, పిలుచుట అను మూడింటికిని కేంద్రముగ శబ్దమున్నది.

శబ్దము యొక్క ఈ త్రిపుటిని అవగాహన చేసుకొన్న వానికి మంత్రశాస్త్ర రహస్యములు తెలియగలవు.



## 14

## నామ రహస్యము - 2

**నా**దమునుండి శబ్దము, శబ్దమునుండి నామములు ఒక క్రమమున నేర్పడుచుండును. ఈ క్రమము కాలక్రమమున శతాబ్దముల తరబడి పరిణామము చెందుచుండును. జీవుని యొక్క పరిణామమును బట్టి అతడు జన్మజన్మలకు పొందు నామములు కూడ పరిమితి చెందుచుండును. నాదస్వరూపుడైన జీవుడు పూర్ణత్వము నొందువరకు వివిధ జన్మల నెత్తుట, స్వభావము ననుసరించి వివిధ నామములను ధరించుట జరుగుచుండును. ఇన్నిటియందు తానొకడు శాశ్వతముగ పయనించుచుండుట చేత పూర్ణత్వము పొందిన వెనుక జన్మజన్మలకు జీవునిగ తనకొకే నామము ఏర్పరచుకొనుట, ఏ జన్మకాజన్మ ప్రత్యేక నామము కలిగియుండుట కూడ సిద్ధించును. పురాణములందు వచింపబడిన వశిష్ఠుడు, అగస్త్యుడు, విశ్వామిత్రుడు ఇట్టివారే. ఎన్ని వందల జన్మలు గడిచినను వారీ నామములతోనే గుర్తింపబడెదరు. పరమగురువుల నామములు కూడ అట్టివే.

స్వభావమును సంబంధించిన నామమొకటి వుండగ అందుండి ప్రవర్తించుచున్న జీవుని నామమొకటి ఏర్పడి, ఆ నామము శాశ్వతమై నిలచును. ఆ నామమందలి శబ్ద ప్రభావమే ఆ సిద్ధ పురుషుని ప్రభావముగ వర్తించుచుండును.

# 15

## అశ్వము

**జ్యో**తిర్మయమైన ద్వాదశ రాశిచక్రమును ఋషులొక యజ్ఞముగ అభివర్ణించిరి. ఈ అశ్వము యొక్క ముఖము అశ్వినీ నక్షత్రము. మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢలు తోక. సూర్యుడు అశ్వినిలో ప్రవేశించుట, ధనుస్సులో ప్రవేశించుట రెండు విధముల విజ్ఞాన యజ్ఞములకు మూలకారణమై అనంతమగు జ్ఞానరాశికి చిహ్నమై ఒప్పుచున్నది.

ఇందలి రహస్యార్థము గమనింపదగినది. అశ్విని – గుఱ్ఱము శిరస్సగు ఉషస్సు. అది మేషరాశి యొక్క శిరస్సున నుండును. మూల – అశ్వము యొక్క జఘనము. అది మూలా (ధనురాశి ప్రజ్ఞ) ధారమున నుండును. ఈ రెండు కేంద్రముల దేవతలే నాసత్య దస్రులు. వీరు ముఖముచే గర్భము ధరించు మొదటి కిరణముల జంట. వెన్నెముక యను నక్షత్ర మండలమునకు ప్రాణములు. ఈ రెండు గుఱ్ఱములను కట్టిన రథమే జీవాత్మ శరీరము. అశ్వ (మేష) రాశిలో సూర్యుడు ప్రవేశించిన దినమునుండి యోగసాధన వ్రతములు

ఆరంభించుట శాస్త్రరహస్యము. అశ్వరాశి నుండి నవమ స్థానము కాలపురుషునకు సర్వ శుభంకరము. సూర్యుడీ భాగలలో ప్రవేశించినపుడు ధనుర్మాసము ఆరంభమగును. అశ్విని నుండి మూలకు, మూల నుండి అశ్వినికి గల మార్గమునందు సమగ్ర యోగము నిక్షిప్తమై యున్నది.



**16**

## వృషభము

ప్రతి అణువు పరిణామములో ఒక సూర్యమండలము కాగలదు. ప్రతి జీవుడును అటులనే పరిణామ క్రమమున అనగా పరమపదము చేరుకొను మార్గమున ఒక బ్రహ్మాండ శరీరమును ధరించగలడు. నిజమునకు విశ్వమంతయు ఏకాక్షరము నుండి ఉద్భవించినదియే కదా! పరమపదము నుండి ఉద్భవించిన వాక్కు ఈ సమస్త విశ్వ నిర్మాణమునకు ఆధారమై నిలచియున్నది. దీనినే దివ్య సంకల్పమని కూడ నిర్వచింతురు. దీని పంచాంగములే పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచేంద్రియములు మరియు కర్మేంద్రియములు. పై తెలుపబడిన నాలుగు పంచకములను వాక్కుయే అధిష్ఠించి యుండును. దీనినే పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి స్థితులని తెలుపుదరు. పంచాంగముగ నేర్పడిన సృష్టికి అధిష్ఠాన దేవత సరస్వతి లేక వాక్కుయే. ప్రవహించునది కావున సరస్వతి యనిరి. వాక్కును వృషభముగ కూడ పేర్కొనిరి. మనయందు ఈ వృషభము కంఠధ్వని రూపమున వ్యక్తమగుచున్నది. కంఠధ్వనిని సమర్థవంతముగ, శ్రావ్యముగ, పవిత్రముగ నిర్వర్తించుకొనువారు తమ జీవనమును పునర్ నిర్మాణమును చేసుకొనగలరు.

## 17

## సత్యము - మతము

సత్య దర్శనము జరిగినపుడెల్ల అందుండి ఒక మతము ఉద్భవించును. మానవుడు మహాత్ముడైనపుడెల్ల అది ఒక సత్య దర్శన ఘట్టము. సత్య మొక్కటియే యైనను దర్శించిన రూపము (జీవుడు) వేరు గనుక అతని నుండి సత్యము మరల అపూర్వముగ వ్యక్తమగు చుండును. సత్యము, దానిని పొందు సూత్రము ఒకటియే అయినప్ప టికి అది వ్యక్తమైనప్పుడు ఉపాధి కారణమున వైవిధ్యము చెందుట గమనింపవలెను. ఒకే కీర్తన పదిమంది కంఠముల నుండి వెలువడి నపుడు వైవిధ్యము చూచుచున్నాము కదా! వైవిధ్యము కంఠమునకు సంబంధించినవే కాని కీర్తనకు సంబంధించినది కాదు కదా! ప్రతి జీవియు తన తోటి జీవికన్న వైవిధ్యముగ నుండును. అది కారణముగ సత్యము పలురకములుగ వ్యక్తమగుచుండును. సత్యమొక్కటియే! దానిని తెలిసినవారు వివరించు పద్ధతుల వారిని బట్టి, కాలమును బట్టి, దేశమును బట్టి మారుచుండును. ఇట్టి వివిధములుగ గోచరించు బోధనల యందలి సత్యమొక్కటే అని గ్రహించువాడు బుద్ధిమంతుడు.

18

## సూర్య చంద్రులు

**సూ**ర్యుని కిరణములు సరాసరి భూమిపై పడుచుండును. అవే సూర్యుని కిరణములు చంద్రునిపై ప్రతిబింబించి భూమికి చంద్ర కిరణములుగ చేరును. కిరణముల రూపమున జీవులే రెండు విధములుగా భూమిని చేరుచున్నారు. కొందరు సూటిగా సూర్యుని నుండి భూమికి చేరగా, కొందరు చంద్రుని మార్గమున భూమికి చేరుచున్నారు. ఇందు మొదటి వారిని సూర్యవంశపు రాజులని, రెండవ వారిని చంద్రవంశపు రాజులని ప్రాచీన గ్రంథములు పేర్కొనుచున్నవి. సూర్యుడు ఆత్మకు ప్రతీక, చంద్రుడు మనస్సునకు ప్రతీక. ఆత్మజ్ఞానము కలవారు సూర్యవంశము వారు. మనో విజ్ఞానము కలవారు చంద్రవంశము వారు. మొదటి వారిది దేవయాన పథము అందురు. ఈ పథమున చావు పుట్టుకలు లేవు. రెండవది పితృయాన పథము అందురు. ఈ పథమున జీవులు పుట్టుచు చచ్చుచునుందురు. మొదటిది అర్చిర్ మార్గమనియు, రెండవది ధూమ్ర మార్గమని కూడ పెద్దలు బోధించినారు. ఈ సూత్రమును వివరించునదే శర్మిష్ఠ – దేవయాని కథగ తెలుపబడినది. దేవయాన పథము ఆత్మజ్ఞాన పథము. శర్మిష్ఠ పితృయాన పథమునకు సంకేతము.

## 19

## కుమారో బుధః

సూర్యుడు సత్యలోకమును, బుధుడు రజోలోకమును, చంద్రుడు దృశ్యమాన జగత్తును అధిష్ఠించియున్న దేవతలు. వీరు వరుసగా సత్వము, రజస్సు, తమస్సు గుణములకు కూడ అధి దేవతలు. సూర్యుడు ప్రజ్ఞకు అధిదేవత. చంద్రుడు పదార్థమునకు అధిదేవత. వీరిద్దరి సంయోగము ఏర్పడు జీవులకు బుధుడు అధి దేవత. వారు సహజముగ రజోమూర్తులు. అనగా వెలుగు మూర్తులు. 'కుమారో బుధః' అని వేదము తెలుపుచున్నది. సూర్యుడు తండ్రి, చంద్రుడు తల్లి. సూర్యప్రజ్ఞ చంద్రునిద్వారా మరల పుట్టుటయే కుమారప్రజ్ఞ లేక బుధప్రజ్ఞ. బుధుడు మానససృష్టికి ప్రతీకగ నిలబడును. తండ్రికి సమీపముగ నుండును. రాశి చక్రమున గూడ సూర్యునికి అత్యంత సమీపమున సంచరించు గ్రహము బుధుడే. తండ్రియే కొడుకుగ దిగివచ్చెనని, తల్లి ద్వారమున దిగివచ్చెనని అందుచే దిగివచ్చిన వాడు స్వతస్సిద్ధముగ తండ్రియే అని తెలియ

వలెను. 'ఆత్మావైపుత్రనామాసి' అను వాక్యమున ఈ సూత్రము తెలుపబడినది.



పై త్రిభుజమును ధ్యానించినచో ఈ సత్యము తెలియనగును.

## 20

## పృథివి - అంతరిక్షము - దివి

సూర్యుడు సమస్తమునకు కారణముకాగ శనిదేవత ఫలిత మగును. శనిదేవతను అంకుశముగ, జ్యోతిషమున సంకేతించుదురు. యమము, నియమము కలిగిన వారిని శనిదేవుడనుగ్రహించును. అవి లేనివారిని అంకుశమై శిక్షించును, అనగా శిక్షణ నిచ్చును. శనిదేవత దేవాలయమునకు పునాది కాగా, సూర్యుడు దేవాలయము నకు శిఖర మగును.

సూర్యుడు దివ్యలోకమునకు, శని పృథ్వీలోకమునకు, కుజుడు అంతరిక్ష లోకములకు అధి దేవతలు. కుజుడనగా స్కందుడే. అతడు సేన రౌద్రమూర్తి లేక రుద్రత్వము కలవాడు. రుద్రులే అంతరిక్ష దేవతలు. చీకటులను చెండాడి చీకటిపై నుండు వెలుగును ఆవిష్క రించి వ్యాప్తిచేయు ప్రజ్ఞయే స్కందప్రజ్ఞ. ఇతడు కారణముగ దివినుండి భువి వరకు వెలుగు వ్యాపించి యుండును. ఇది జ్యోతిషపరమైన అవగాహనముపై అవగాహన మేరకు కుజుడు, శని సూర్యపుత్రులుగ వ్యవహరింపబడుచున్నారు.

## 21

## డమరుకము - శ్రీ చక్రము

**సూ**ర్య, చంద్ర, బుధాత్మకమైన త్రిభుజమును సత్యలోకమనియు; శని, కుజ, చంద్రాత్మకమైన త్రిభుజమును అసత్యలోకమనియు జ్యోతిషము తెలుపుచున్నది.



పై త్రిభుజమును వెలుగు లోకమనియు లేక రజో లోకమనియు, క్రింది త్రిభుజమును తమోలోకమనియు, రెండింటిని సంధానపఱచు చంద్రాత్మక ప్రజ్ఞ విరజ అనియు తెలియవలెను. కుజుని సంకల్ప శక్తి ఆధారముగ గొని యమనియమములతో జీవితమును గఱపువారు ప్రతిబింబ లోకమునుండి వెలుగు లోకముల లోనికి ప్రవేశింపగలరు. వెలుగు లోకమున ప్రజ్ఞకు స్థిరత్వము కలదు. ప్రతిబింబ లోకమున అస్థిరత్వము, అశాశ్వతము, నశించుట,

మరణము ఇత్యాదులు కలవు. ఈ రెండి త్రిభుజముల ధ్యానమే ఋషులు శ్రీ చక్రముగ, యంత్రముగ సంకేతించినారు.



పై చూపిన మొదటి చిత్రమును శివుని డమరుకముగ కూడ తెలిపినారు. శివుని డమరుకము ప్రజ్ఞ. పదార్థలోకముల సంకేతము. సృష్టి చక్రమందు ప్రజ్ఞ పదార్థమును దమించు కాలము, పదార్థము ప్రజ్ఞను దమించుకాలము ఒకదాని వెంట మరియొకటి చక్రాకారముగ జరుగుచుండును. పగలు, రాత్రి వాని సంకేతములు. జీవులు అవిరామముగ అందు పల్లటీలు కొట్టుచు జీవించుచుందురు. అట్టి చక్రమునందు స్థిత ప్రజ్ఞత్వము నొందు టకు శ్రీచక్రధ్యానము ఋషులు అనుగ్రహించిరి.

# 22

## కర్ణుడు - కుంతి

**బృ**హస్పతి జీవనమునకు, జ్ఞానమునకు, సమర్థతకు, పవిత్రతకు, సద్గుణ సంపత్తికి, సృజనాత్మక శక్తికి, బ్రహ్మచర్యమునకు ప్రతీక. ఆకాశ శబ్దమునకు కూడ ప్రతీక. ఆకాశ శబ్దము "ఖం". కం, గం, కూడ ఈ శబ్దమునుండి ఉద్భవించినవే.

శుక్రుడు అనుభూతికి, ఆనందమునకు, గ్రహించుటకు, అందమునకు, సౌకుమార్యమునకు, శీలమునకు, ప్రేమకు, కన్యాత్వమునకు ప్రతీక. పై సంకేతము నందలి ఉత్తర భాగము సూర్యుడు. దక్షిణభాగము + సూక్ష్మ ప్రకృతి లేక కన్య శుక్ర సంకేతము సూర్యునిచే ప్రభావితమై వెలుగొందుచున్న సూక్ష్మ ప్రకృతిని లేక కన్యను సూచించును. సూర్యోపాసనమున నిలచిన పవిత్రమైన కన్యగ మహా భారతమున కుంతిని పేర్కొనుట, ఈ రహస్యార్థమును వివరించు టయే. సూర్యుని ఆధారముగ కుంతి అను కన్య కర్ణుని పొందినది. కర్ణమే కర్ణుడు. అనగా వెలుగొందుచున్న సూక్ష్మ ప్రకృతినుండి సూర్యుని సహకారముతో దిగివచ్చిన వాడు. కర్ణములేని సృష్టి లేదు. రూపాంతర మున ఈ సంకేతము బృహస్పతిగ తెలియబడుచున్నది. కర్ణములేని సృష్టి లేదు అనుట, కర్ణుడులేని భారతము లేదు అనుట ఒకే అర్థమును సూచించగలవు. బృహస్పతి లేని జీవనమే లేదు కదా!

## 23

## పూర్వకథ - 1

ప్రస్తుత కాలమున ఏడడుగుల మనిషి అరుదుగ కనిపించును. తొమ్మిది నుండి పదకొండు అడుగుల మనుషులు కూడ భూమిపై అక్కడక్కడ నున్నారు. పూర్వమున ఆర్యుల కాలముననే పదడుగుల మనుషులుండిరి. యుగములు మారుచున్నపుడు మనుషుల ఎత్తు, రూపముకూడ క్రమశః మారు చుండును. అటులనే భూభాగముపై కూడ మార్పులు జరిగినవి.

పెను ఆకారములుగల మానవులు దాదాపు 3వేల సంవత్సరములకు పూర్వమే కనుమరుగైనారు. ఒకానొక కాలమున మానవుడు దాదాపు 28 అడుగుల ఎత్తుకూడ నుండెను. క్రమశః యుగ యుగమునకు కురచ కాసాగిరి. మనమిపు డెరిగిన ఈస్టర్ దీవ్వములలోగల స్థూపాకారపు మానవ శిల్పములు ఈ సత్యము నకు అద్దము పట్టును. మానవాకారములు ఎపుడును ఇపుడున్నట్లే ఉన్నవని భావించుటకూడ పరిమిత భావమే. ఒకానొక సమయ మున భూమిపై 6 నెలలు మేల్కాంచి యుండి, 6 నెలలు నిద్రించిన మానవులు కూడ కలరు. భారతీయు లెరిగిన కుంభకర్ణుడట్టివాడే!

## 24

# పూర్వకథ-2

**మా**నవుని పూర్వ వృత్తాంతము, భూగోళపు చరిత్ర తెలియుటకు బాహ్య పరిశోధనలతోపాటు అంతశ్శోధన కూడ చాల ముఖ్యము. అంతశ్శోధనలో కలుగు దర్శనముల ఆధారముగా బాహ్య పరిశోధనలు నిర్వర్తించుకొన్నచో సూక్ష్మ విషయములు తెలియగలవు. ఒకప్పటి శిఖరములు ఇప్పుడు సముద్ర గర్భమున నున్నవి. ఇప్పటి ఉన్నత శిఖరములు ఒకప్పుడు సముద్ర గర్భములో నున్నవియే. ఈ భూమి యిప్పటికి రెండుమార్లు జలప్రళయమును, మరి రెండుమార్లు అగ్నిప్రళయమును చవిచూచినది! యుగముల మార్పిడి జరిగినపుడెల్ల కొన్ని నాగరికతలు, కొన్ని భూభాగములు అదృశ్యమై పరిశోధనమునకు అందక నిలచును. పూర్వము ఈ భూమిపై మూడు కన్నులు కల మానవులు యున్నారు. నాలుగు చేతులు, మూడు కన్నులు కలిగిన మానవులు కూడ జీవించిరి. వారిని సంకేతించుటకే ద్వాపరమున శిశుపాలుడు వికృత రూపమున జన్మించెననియు, కృష్ణ స్పర్శచే అతనికి అప్పుడు జనబాహుళ్యమునకుండిన రూప మేర్పడినదనియు

తెలుపబడినది. పూర్వమేవిధముగ భూఖండములు మార్పు చెందినవో ఇక ముందుకూడ అట్లు మార్పులు చెందుట సంభవము. మానవాకారములకు కూడ ఇట్టి మార్పులు తప్పనిసరి. మార్పు సృష్టియొక్క సహజ లక్షణము కదా!

## 25

## జ్ఞానయోగము - కర్మయోగము - 1

★ కర్మాచరణము, జ్ఞానార్జనము, ఉచ్ఛ్వాస నిశ్వాసముల వంటివి.

★ జ్ఞానమార్జించుకొనుటకు సాధనము పవిత్రముగా నుండవలెను. కనుక కర్మాచరణము ప్రాముఖ్యత.

★ కర్మాచరణము మానవుని స్వభావము నుండి కల్గుచున్నది గాని, జ్ఞానము నుండి కాదు. కావున చేయుట, మానుట లొంగునవి కావు.

★ చేయుట తప్పనిసరియైనపుడు ఫలితముల వైపు లాగనివి చేయదగిన పనులు. అనగా తననుద్దేశించుకొని ఆచరింపని పనులు.

★ జీవుడు తననుద్దేశించుకొని ఆచరించు పనులు బంధకారణము లగును. ఇతరుల శ్రేయస్సు నుద్దేశించి చేయు పనుల వలన కర్మబంధ విమోచనము కల్గును.

★ సృష్టియొక్క చక్రభ్రమణము నందలి ప్రజ్ఞలు, దేవతలు, ఫలాపేక్ష

లేక స్వధర్మాచరణమునందు వర్తించుచూ సృష్టిని వర్ధిల్ల చేయు చున్నవి. మానవుడు కూడా కర్మాచరణమున అట్లే వర్ధిల్లవలెను.

☆ కర్మాచరణము నందు పూజ్యభావము, సమర్పణ బుద్ధి అవసరము. ఇతరులకు చేయుపని వారియందలి దేవతలకు చేయు సమర్పణముగా చేయవలెను.

☆ ఫలాపేక్ష లేని కర్మాచరణము వలన దేహముల యందు, వెలుపల బంధము లేక సృష్టి శక్తులు వర్తించుచున్నవి. ఫలాపేక్ష వలన మానవులు దేహమున బంధింపబడి యున్నారు.

## 26

## జ్ఞానయోగము - కర్మయోగము - 2

సృష్టి ప్రణాళిక ననుసరించని జీవుడు సుఖమును కోల్పోవుచున్నాడు కాని ప్రయాణము మాత్రము సృష్టి ప్రణాళికననుసరించియే యుండును. ప్రణాళికననుసరించు వారికి సృష్టి చక్రము నందు సమన్వయమేర్పడి కారణము లేని తృప్తి కల్గియుందురు. వారికి సర్వము యజ్ఞార్థకర్మయే కాని తమకు సంబంధించినదేదియు యుండదు. ప్రయాణమున సుఖముండును.

స్వభావము ననుసరించి లోకశ్రేయస్సు కోరి, ఫలాపేక్ష లేక కలవరపాటు లేక ఆచరించిన కర్మ వలన పరిపూర్ణ సిద్ధి కల్గును.

ఫలాపేక్ష లేకపోయిననూ పనులయందు పట్టుదల సడలరాదు. ఇతరులు కూడ ఫలాపేక్ష లేక వర్తింపవలెనను బుద్ధి యుండరాదు.

ప్రకృతి యందు పనులన్నియు గుణముల ప్రేరణచే కల్గునని గమనించి వ్యక్తులు కారణము కాదని తెలియవలెను. ఇట్లు తెలియుట

వలన తనపై కర్తృత్వము నారోపించుకొనుట, యితరుల యందు దోషములెన్నుట తప్పును. వ్యామోహమునందు చిక్కుబడుట కూడ తప్పును.

కర్మాచరణమునందు ఒకరినొకరు చూచుకొనుటలో అంతర్యామి దర్శనము చేయవలెను. అట్లు చేయుటవలన శ్రద్ధ అలవడును. అసూయాదులు సోకవు.

సృష్టియందు యేర్పడు పాపమును, తనయందు ఏర్పడు పాపమును నిత్యము తొలగించుకొనుచుండవలెను. ఇట్లు తొలగించు కొనుటయే పవిత్రీకరణము లేక సంస్కరణము అనబడును.

లోకమున మంచి పనులు, చెడు పనులు అని లేవు. మానవుని ఉద్దేశ్యమునుబట్టి అవి ఏర్పడును. వ్యక్తిగత ఉద్దేశ్యములు లేని కార్యము ఏదైననూ, సత్కర్మాచరణమే. కావున నీ స్వభావమున యేర్పడిన ధర్మమును ఫలాపేక్ష లేక నిర్వర్తించుట వలన బంధము తొలగును. అట్లు చేయుటలో శ్రద్ధ, సమర్పణము వుండవలెను. వ్యామోహము, కలవరపాటు, అహంకారము ఉండరాదు.

పై చెప్పిన ప్రకారము కర్మలాచరించుట వలన మనస్సు, యింద్రియములు, దేహమునకు సమన్వయమేర్పడి జ్ఞానము పొందుటకు అవకాశ మేర్పడును. అనగా తనయందు ప్రేరేపింపబడిన సృష్టి ప్రణాళికను బుద్ధియోగమున గమనించి, మనస్సు, యింద్రియ ములు, దేహము ద్వారా ఆచరింపజేయుట జరుగును.

27

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 1

**అ**ది 1895 వ సంవత్సరం జూన్ 30 తేదీ, నా జీవితమున అది మరపురాని రోజు. జన్మజన్మలకూ గుర్తుండెడి రోజు. నా కపుడు 15 సంవత్సరాలు. యవ్వనము తికమక పెట్టు సమయమది. ఎందరో పిల్లలు జీవితమున ఉత్సాహముతో పరుగులెత్తు చుండగా, పగలూ రాత్రి తేడా తెలియని చిలిపితనముతో, పిల్లచేష్టలతో జీవించు వయస్సు. కానీ, నా కప్పటికీ జీవితముపై విరక్తి పూర్తిగా ఉండెడిది. నా జీవితము వృధా యను భావన అనునిత్యమూ వేధిస్తూ వుండేది. ఆ వయస్సునకే నాకు తలమునకలు వేయు సమస్యలు, ఎటు చూచిననూ దుఃఖము ఆవరించి యుండేది. నేనీ ప్రపంచములోనికి రావాలని ఎప్పుడూ కోరుకొనలేదని, అయిననూ కొనిరాబడితినని భావించేదానను. నన్నెవరూ ప్రేమించేవారు కారు. నేను కూడా అంతే. అందరియందూ తెలియని కోపము, ద్వేషము, చిరాకు వుండేవి. నాకుగా నేను చిక్కులు వేసుకొనుటలో ఉత్తమశ్రేణి నిపుణత కలిగినదానను నేను. భావి జీవితమును భావించినపుడల్లా భయమావరించెడిది. పెళ్ళి, పిల్లలూ,

సంఘమున పరపతి, గౌరవము, వాని కొరకై జీవించుట నాకు యాంత్రికముగా తోచెడివి. క్రైస్తవమతము కూడా సంకుచితమైన బోధలు కలిగి నా హృదయావేదనకు పరిష్కారము చూపలేక పోయినది. నరకమును తెలిపి బెదిరించుటయే ప్రధానముగా వారి బోధన సాగుచుండెడిది. క్రతువులు– మతబోధనలు చెవులలో గింగిరు లెత్తుచుండెడివి. నాకు జీవితమంతయూ అయోమయముగ నుండెడిది. నా చుట్టునూ దట్టమైన పొగమంచు ఏర్పడి, ఏమీ కనపడని, ఏమీ వినపడని ఒంటరినై జీవించుచుండెడిదానను. నన్ను నేనుద్ధరించుకొను ప్రతి కసరత్తు నాకు విసుగు కలిగించెడిది కానీ, పరిష్కారము అందించలేదు.

అది ఆదివారము, ఉదయం సమయము. నాకు చర్చికి పోబుద్ధికాలేదు. ఇంట్లోని వారందరూ ప్రార్థనలకై చర్చికి వెళ్ళిరి. నేను ముందుగదిలో కూర్చుని నాకు తోచిన గ్రంథమును చదువుకొను చున్నాను. సింహద్వారము దానికదిగా తెరువబడినది. నాకు ఒళ్ళు గగుర్పొడిచినది. ఎదుటి దృశ్యము చూచి శరీరము దాదాపు కొయ్యబారిపోయినది. సింహద్వారమునుండి ఒక ఆజానుబాహువైన పురుషుడు తలపాగాను, ఐరోపా దుస్తులను ధరించి లోపలికి ప్రవేశించుచున్నాడు. అతని శరీర సౌష్ఠవము, ముఖము నందలి వర్చస్సు, అందము నన్ను ముగ్ధను చేసినవి. అతడు నెమ్మదిగా నడచివచ్చి నాప్రక్కనే మృదువుగా కూర్చుండెను. నాకు నోట మాట రాలేదు. తెల్లబోయి చూచుచుంటిని. అతడు మెల్లగా యిట్లనెను.

"ప్రపంచమున నీవలన జరుగవలసిన పనియొకటి యున్నది. అది కారణముగ నీ స్వభావమునందు అత్యద్భుతమైన పరివర్తన మేర్పడగలదు. ప్రస్తుతము నీవు 'నన్నంటబోకు – నా మాలకాకి' అను సామెత చందమున అందరినీ అసహ్యించుకొంటూ, అందరిచే అసహ్యింపబడుచూ దుఃఖితవై యున్నావు. నీవు చేయు కార్యక్రమమున నీకు ఆత్మనియతి కలుగగలదు. నిన్ను నీవు చక్కగా నియంత్రించుకొన గలిగినచో, ప్రపంచమున కుపయోగపడు దివ్యకారమును నీచే నేను నిర్వర్తింప చేయగలను. నీ మనో నియంత్రణము పైననే ఈ కార్యము జరుగుట కవకాశముగలదు. అప్పుడే నిన్ను మేము విశ్వసింప గలము."

## 28

# మహర్షి దేవాపి సాన్నిధ్యము - 2

ఈ దివ్య కార్యమున నీవు పలు దేశములకు పయనించ గలవు. నీ గురువు నీకందించుచున్న ఈ ప్రణాళికను నీవుగా నిర్ణయించుకొని సమర్పించుకొనుము. నీ ప్రవర్తనమును సరిదిద్దు కొనుటకు నేటినుంచి చక్కని కృషి చేయుము."

ఆ వాక్యములు చాలా కాలము నా చెవులలో గుడిగంటలవలె మ్రోగుచుండేవి. వచ్చిన మహాపురుషుడు ఒక దివ్య అవకాశమును తెలిపి, అది నా ప్రవర్తనపై ఆధారపడి యున్నదని హెచ్చరించి వెళ్ళినాడు. ప్రతి 7 సం॥లకు తాను దర్శనమిత్తునని కూడ తెలిపినాడు. మా కలయిక కొన్ని నిముషములే జరిగినది. నేనేమియు మాట్లాడ లేకపోయితిని. అతని భాషణము అధికారికముగ నుండెను. ఆజ్ఞాపించుచున్నట్లు వుండెను. కానీ, అదే సమయమున ప్రేమ - వాత్సల్యము కూడా నన్ను స్పృశించెను. తాను తెలుపవలసినది క్లుప్తముగ తెలిపి, ప్రతిభాషణమునకు వేచియుండక, చటుక్కున నిలచి, సింహద్వారము వైపునకు సాగెను. ద్వారము దగ్గర నిలచి, వెనుతిరిగి,

నా కన్నులలోనికి సూటిగ మెరపువలె ఒక చూపును ప్రసరించి కనుమరుగయ్యెను. ఆ చూపు నాటికిని, నేటికిని, జన్మ జన్మలకూ నన్ను వెలుగుదారిన నడిపించు కిరణము.

జరిగిన సన్నివేశము మరల మరల తలచుకొంటిని. ఒకమారు భయము కలిగినది. ఒకమారు మతిభ్రమించినదేమో యని దిగులు కలిగినది. ఒకమారు అమితోత్సాహము కలిగినది. ఆ సన్నివేశమును తలచుకొనునపుడల్లా హృదయము పులకించినది. ఎవరికినీ తెలుపుటకు సాహసించలేదు. తెలిపినచో తప్పక నాకు పిచ్చి పట్టినదని భావింతురను దృఢ విశ్వాసము కారణముగనే ఊరకుంటిని.

ఈ ప్రపంచమున కంతటికీ మహత్తరమగు సేవల నందించు దానిగను, వేలాది ప్రజల నుద్ధరించు ప్రవక్తగను, అప్పుడప్పుడు భావించుచుండెడిదానను. ఇది ప్రాథమిక దశయందు సామాన్యముగా అందరూ చేయు పొరపాటు. చేయబోవు కార్యమునకు వలసినది త్రికరణశుద్ధి, తపస్సు అని తెలియుటకు సమయము పట్టినది. ఆ పుణ్యపురుషుడు ఎవరో నాకు తెలియదు. అతడు మాత్రము నా హృదయమున శాశ్వతముగ తిష్ఠ వేసినాడు. నన్ను నేను నియంత్రించు కొనుటకు అతని స్పర్శ – అందుండి కలిగిన స్ఫూర్తి చాలునని తృప్తి చెందితిని. జీవితమున మొట్టమొదటిసారిగ నా మనస్సు తృప్తిని, అనుభూతి చెందినది.

ఇరువది సంవత్సరముల తరువాత 1915వ సం॥లో మొట్ట మొదటిసారిగ ఆ మహాపురుషుడెవరో నాకు తెలిసినది. అంతవరకూ అతడు ప్రతి 7 సం॥లకు నాకు దర్శన మిచ్చుచున్ననూ, అతడెవరో నాకు తెలియదు. 1915వ సం॥న అతడొక మహాత్ముడని, దివ్యజ్ఞాన సంపన్నుడని, భూమి జీవులను తరింపజేయుటకు పరిశ్రమించుచున్న దీక్షాదక్షుడని, అతడితరులకు కూడా తెలియునని, తెలిసినది. అతని నామధేయము 'దేవాపి' యని, ప్రేమ-జ్ఞానములను పంచు పరమ గురువని తెలిసినది.

# 29

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 3

**15** సంవత్సరముల వయస్సున ఆయన నాకు దర్శనమిడి నప్పుడు ఆయన విలువ నాకంతగా తెలియలేదు. గత 35 సంవత్సర ములుగా నాయందు వికాస మేర్పడుచున్న కొలదీ నా గురుదేవుని విస్తీర్ణము పెరుగుచునే యున్నది. ఆయన మావంటి వారిచే కొలువ బడువాడు కాడని, కొలతల కందనివాడని తెలిసి, నా 'చిన్నతనము' తెలిసికొంటిని. అయన సాన్నిధ్యమే నాకు సమస్తము.

నా చిన్నతనమున నా కత్యంత సన్నిహితురాలు మా గృహ మందలి వంటమనిషి. ఆమె నన్ను కంటికి రెప్పవలె కాపాడు చుండెడిది. నన్ను గౌరవించుచునే నాకెన్నియో విషయములు తెలుపుచుండెడిది. నా శారీరక, మానసిక అభివృద్ధికి ఆమె ఎంతయో తోడ్పడినది. ఆమె ఎందులకు నాయందు ప్రత్యేక వాత్సల్యము చూపెడిదో నాకప్పటికి అవగాహన కాలేదు. నేను చిరు ప్రాయము నుండియే అనగా 18 సం॥ల ప్రాయము నుండియే మత బోధనలను చేయుచుంటిని. మా వంటమనిషి నేను చేయు బోధనలకు కూడా

స్నేహపూర్వకముగా వచ్చుచుండెడిది. బోధనలను ఆవేశముగ నిర్వర్తించి, యింటికివచ్చి, మా వంటమనిషితో గర్వముగా పలుకు చుండెడిదానను. ఆమె చిరునవ్వుతో అన్నిటికినీ తలయూపు చుండెడిది.

ఒకరోజు, నేనిట్లే నా ఉపన్యాసము ముగిసిన పిదప డంబమును ప్రదర్శించుచుండగా, ఆమె నా దగ్గరకు వచ్చి కన్నులలో కళ్ళు పెట్టి సూటిగ చూచుచూ యిట్లనెను.

“భగవంతుని సామ్రాజ్యము చేరుటకు, ఆయన అంతః పురమున ప్రవేశించుటకు 12 ద్వారములు కలవని నీవెప్పటికైనను గమనించినచో నేను సంతోషింతును. ప్రపంచమున అన్ని జాతుల వారునూ, అన్ని మతముల వారునూ ఏదో ఒక ద్వారము గుండా దైవగృహ ప్రవేశము చేయగలరు. అందరునూ నీవు తెలుపు ద్వారము ననే ప్రవేశింతురని అనుకొనుట పసితనము. నీవు చేయు ప్రసంగము లన్నియూ బజారులో ఎలుగెత్తి అరచుట వంటివి. అంతకు మించిన విలువ వాటికి లేదు. దైవము ఎన్నియో రకములుగ జీవులను తన దరి జేర్చుకొనునని నీకు తెలియుట ముఖ్యము.” మా వంట మనిషి తీక్షణమైన చూపులతో ఇట్లు పలుకగా ఆ చూపుల నుండి నేను నా గురుదేవులు దేవాపి మహర్షి సాన్నిధ్యమును అనుభవించితిని.

30

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 4

నేను భారతదేశమున నుండగా నా సపర్యలకై ఒక సేవకుడు నియమితుడయ్యెను. అతని పేరు బగలూ. అతడు వ్యక్తిగతముగ నాకు కావలసిన సదుపాయములను, సౌకర్యములను అప్రమత్తుడై జాగ్రత్తగా చూచుకొను చుండెడివాడు. అతడు వయస్సున వృద్ధుడు. తెల్లని పొడుగాటి గడ్డము అతని కుండెడిది. అతడు నా దగ్గరుండగా యితరుల నెవరినీ నా పనులను చేయుటకు అనుమతించెడివాడు కాదు. అతనికి నాయందు గల శ్రద్ధ, వాత్సల్యము, నాకాశ్చర్యము కలిగించు చుండెడివి. ప్రాతఃకాలమునుండి రాత్రి నిద్రించువరకూ నా పరిరక్షకుడుగా నన్ను కాపాడుచుండెడివాడు.

ఒకరోజు ముంబళ గ్రామమున నున్న నా నివాస గృహము యొక్క పై అంతస్తు వసారా నుండి రహదారిలో పోవుచున్న హిందువులనూ, మహమ్మదీయులను, పఠానులను, శిక్కులను, రాజపుత్రులను, ధనవంతులను, పేదలను, స్త్రీలను, పురుషులను, పిల్లలనూ చూచు చుంటిని. రహదారి యందలి జనప్రవాహము అంతులేక సాగు

చుండగా - నాలో భావ పరంపర లుద్భవించినవి. వీరందరికీ ఏసుక్రీస్తు గురించి తెలియదుకదా! వీరెట్లు ఉద్ధరింపబడగలరు? క్రీస్తు ప్రేమతత్వ మందనిదే వీరికి తరణోపాయమేమి కలదు? వీరికి క్రీస్తు మార్గమును తెలుపుట ఎట్లు? అను భావ పరంపరలు తీవ్రముగ నన్ను వెంటాడినవి.

అంతలో వెనుకనుండి వాత్సల్యపూరితముగా ఒక హస్తము నా కుడి భుజముపై పడినది. శరీరము గగుర్పాటు చెందినది. వెనుకకు తిరిగి చూచితిని. నా సేవకుడు బగలూ చిరునవ్వుతో, వాత్సల్యముతో ధైర్యముగా వెనుకనుండి నా భుజముపై తన హస్తము నిడుట నా కాశ్చర్యము కలిగించినది. అతడు అతిక్రమించి ప్రవర్తించినాడను భావన క్షణమాత్రము కలిగి అదృశ్యమైనది. బగలూ ఆప్యాయముతో యిట్లనెను.

"అమ్మా! ఈ దేశములో కోట్లాది ప్రజలు లక్షలాది సంవత్స రముల నుండి జీవించుచున్నారు. మీ ఆంగ్లేయులు ఈ దేశమునకు రాక పూర్వమునుండి కూడా వీరు సమగ్రమైన జీవనము కలిగి యున్నారు. తరింపు కూడా చెందుచునేయున్నారు. నిన్నూ-నన్నూ ప్రేమించిన దైవము సృష్టి ప్రారంభము నుండీ జీవులను ప్రేమించు చునే యున్నాడు. దైవముయొక్క ప్రేమమార్గము దైవమునకు క్రొత్త కాదు, జిజ్ఞాసులగు జీవులకునూ క్రొత్త కాదు. ప్రేమ మార్గము క్రొత్తగా నేర్పడినది కాదు, అది సనాతనము. అది యీ దేశమున సనాతన ముగా నున్నది. పాశ్చాత్యులకు దానిని మరల గుర్తుచేయుటకే

ఏసుక్రీస్తు అవతరించెను. అతడు ప్రేమమార్గమును గుర్తుచేసినవాడే కాని, స్థాపించినవాడు కాదు సుమా!” అని సూటిగ హెచ్చరించెను. నేను నివ్వెరపోయితిని. మరల నా గురుదేవులు దేవాపి మహర్షి ఈ రూపమున భారతదేశమున నా సేవకునివలె నన్ను పరిరక్షించుచూ, నా అజ్ఞానపు పొరలను దగ్ధము చేసినారు. అతని సాన్నిధ్యమునకు సదా కృతజ్ఞురాలను.

**31**

# మహర్షి దేవాపి సాన్నిధ్యము - 5

**ఒ**క వేసవికాలంలో నేను లక్నో మహా నగరంలో యుండుట జరిగినది. వేసవి తీవ్రముగా నుండుటచే ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. జీవితములోని సమస్యలన్నియు మనోఫలకముపై మెదలి నన్ను తీవ్రముగా ఆందోళన పరచినవి. ఆరోగ్యము అంతంత మాత్రముగ నుండిన దినములవి. భరింపరాని శిరోవేదన యుండెడిది. జీవిత భాగస్వామి కొరకై తీవ్రమైన ఆవేదన యుండెడిది. తలకు మించిన బాధ్యత యుండెడిది. కలగాపులగముగా యీ సమస్యలన్నియూ ఒక్కుమ్మడిగా దాడి చేసినవి. వీటికి తోడు లక్నో నగరమున రాత్రి సమయమున దోమల దాడి కూడా జరుగుచుండెడిది. నిద్ర శూన్య మగుటచే విశాలమగు వరండాలోనికి వచ్చి అటునిటు తచ్చాడు చుంటిని.

అకస్మాత్తుగా ఒక పెద్ద వెలుగు మెఱపువలె అవతరించినది. నేనున్న చోటునంతటినీ నింపినది. నా గురుదేవుని వాణి వినిపించి నది. రూపము కన్పింపలేదు. నేను శ్రద్ధతో ఆయన వాణి వింటిని. వారిట్లు పలికిరి.

"నీవు అనవసరముగా చింతించుచున్నావు. చింతవలన నీకేమియూ ఉపకారము జరుగదు. నీ మనోభావములను, వాక్కులను,

చేతలను నే నెప్పటికప్పుడు పరిశీలించుచునేయున్నాను. ఈ జీవితమున నీవొనర్చవలసిన దివ్యకార్యము అతి త్వరలో నిన్ను చేరును. నీవా కార్యమునారంభింపగలవు. కాని, ఆరంభింపబడు తీరు మాత్రము నీవు తెలియగలేవు. నీవు గుర్తించలేని విధముగా అది ప్రారంభమగును.”

నా గురుదేవులు నన్ను ప్రభావితము చేయుచూ యిట్టి వాక్యములు పలికి అదృశ్యులైరి. నా జీవిత సమస్యలను నాకే వదలివైచిరి గాని, వాటిగూర్చి ఒక్క మాటయిననూ పలుకలేదు. పరిష్కారము తెలుపలేదు. ఏమి చేయవలెనో సలహా కూడా నీయలేదు. నిజమునకు, పరమగురువు లెవరూ తమ అనుయాయులకు అనుక్షణం ఏమి చేయవలెను? ఎచ్చటికి పోవలెను? ఎట్లు పలుక వలెను? అను విషయములు గూర్చి ముచ్చటించరు. అట్టి విషయము లను అనుయాయుల విచక్షణకు, బుద్ధికి వదలివైతురు. మన వ్యక్తిగత జీవితమునందలి వివరములతో వారు సంబంధము పెట్టుకొనరు. భౌగోళికముగా కార్యములను నిర్వర్తించుచూ, జాతి పరిణామమునకు నిరంతరంగా, నిర్విరామముగా కృషిచేయు పరమగురువుల నుండి యిట్టి సలహా సంప్రదింపులకై అనుయాయులు ఎదురుచూచుట న్యాయ సమ్మతము కాదు. మన కుటుంబ పోషణము, వ్యక్తిగత, సాంఘిక, ఆర్థిక, అభివృద్ధి విచక్షణతో మనమే నిర్వర్తించు కొనుచూ, పరహితము, లోకహితమూ మిళితమైయున్న కార్యములకై త్రికరణశుద్ధితో పనిచేయు సైనికులవంటివారు, వారికి కావలెను కాని, గోరుముద్దలకై ఎదురుచూచు పసివారు కాదు. అనుయాయు లను మెచ్చుకొనుట, తీయని మాటలు చెప్పుటకు పరమగురువులు తమ అమూల్యమైన సమయమును వెచ్చింపరు.

32

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 6

ఈ కాలమున పరమగురువుల శిష్యులము అనుకునేవారు, సాధకుల మనుకొనేవారు, వారిని గూర్చి పరమగురువులు చెప్పినట్లుగా ఎన్నియో ముచ్చట్లు పలుకుతారు. అవి అన్నియు నిజమునకు భ్రాంతి దర్శనములే. వీటినుండి బయటపడకపోయినచో ఏ సాధకుడూ పరమ గురువుల రాజ్యమున ఒక సైనికునిగా నిలబడలేడు. పరమ గురువు లిట్లు తెలుపుదురు.

"నీ జీవితమునకు నీవే స్వామిత్వము వహింపుము. నీవే నీ సమస్యలను విచక్షణతో పరిష్కరించుకొనుము. తప్పులు చేసినచో తప్పించుకొనక సరిదిద్దుకొనుము. నిన్ను నీవు మరచి యితరులకే మైనా తోడ్పడగలవేమో చూడుము. నీయందు తప్పులు పట్టుటకు కానీ, నిన్ను శ్లాఘించుటకు కాని, బుజ్జగించుటకు కాని వీలుపడదు. అట్లు చేసినచో నీ అభివృద్ధిని ఆటంకపరచినవారమగుదుము. ఎట్టి పరిస్థితులలోనూ విచక్షణను కోల్పోకుము. మరపు రానీయకుము. కర్తవ్యమున నిష్కర్షగ జీవింపుము."

అది 1919వ సంవత్సరం. కార్తీకమాసం. ఆహ్లాదకరమైన శరదృతువు కన్నుల కింపు గావించుచున్నది. ఆ రోజు ఉదయం పిల్లలను బడికి పంపి, కొన్ని నిముషములు చల్లనిగాలి హాయిగా పీల్చుకొనుటకు మా ఇంటి దగ్గరలోని ఒక చిన్న కొండపైకి చేరితిని. అచట చతికిలబడి జీవితమును పర్యావలోకనము చేయుట ప్రారంభించితిని. అంతలోనే అకస్మాత్తుగా నేను అప్రమత్త నైతిని. చైతన్యమున ఒక క్రొత్త మెలకువ ఏర్పడినది. ఎచ్చటనుండియో సుదూరముగ సంగీతము వినవచ్చినది. ఆ గానము ఎటునుండి వచ్చుచున్నదో యని పరికించితిని, పరిశీలించితిని. అది నా చుట్టూ వున్న ఆకాశము నుండి కొండ మీదుగా నాలో ప్రవేశించి వినిపించు చున్నట్లుగ గమనించితిని. అమితాశ్చర్యము పొందితిని. గానము నాదమై, నాదము వాక్కై యిట్లు వినిపించినది.

"ప్రజా సంక్షేమమునకై కొన్ని పవిత్ర గ్రంథములను వ్రాయు టకు నిర్ణయింపబడినది. వాటిని వ్రాయుటకు నీవు అర్హురాలవు. ఈ మహా యజ్ఞమును ప్రారంభించుటకు నీవు అంగీకరింతువా?"

తక్షణమే నే నిట్లంటిని.

"ముమ్మాటికీ అంగీకరింపను. నే నెవరికిని వ్రాయసకత్తెను కాజాలను. అట్టి విషయములు నా కనంగీకారములు." ఆశ్చర్య మేమనగా – నేను వినిన దివ్యవాణికి అసంకల్ప ప్రతీకారచర్యగా ఈ సమాధానము అకస్మాత్తుగా వైఖరీ వాక్కుగా వెలువడినది.

**33**

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 7

**అ**ప్పుడా దివ్యవాణి యిట్లనెను :

"**బు**ద్ధిమంతు లెవరునూ తొందరపాటు నిర్ణయములు చేయరు. తొందరపాటుతనము పతనకారణము. నీవు దైవవశమున ఒక వరము కలిగియున్నావు. దూరశ్రవణము నీకేర్పడియున్నది. మేము తెలుపు విషయములు, వ్రాయగోరు గ్రంథములు విశేషమైనటు వంటివి. సామాన్యములు కావు. భ్రాంతికారకములసలే కావు. ఈ మహత్కార్యము వలన జీవునిగ నీకు ఉద్ధరణమే కలుగును."

దివ్యవాణి ఇట్లు పలికినప్పటికీ నా నిరాదరణ ధోరణి మారలేదు. పలికిన పురుషునియొక్క ధ్వని స్పష్టముగను సూటిగనూ యున్నది. అది నా గురుదేవుని కంఠధ్వని కాదని స్పష్టముగ తెలియు చున్నది. ఆ అవ్యక్తపురుషుడు మూడు వారముల తరువాత అదేరోజున మరల కలియుదునని తెలిపి, అదృశ్యమాయెను. పై మొత్తము సన్నివేశము అటుపైన ఒక కలగా గోచరించినది. అది కలగాని కల. ఆ సన్నివేశమునకు ప్రాముఖ్యమీయక నా దైనందిన జీవితమున

నిమగ్నమైతిని. మూడు వారములు యాంత్రికముగ గడచిపోయినవి. ఒకరోజు రాత్రి పిల్లలను నిద్రపుచ్చి ముందుగదిలో ఒక వాలుకుర్చీలో కూర్చొనియుంటిని. దివ్యవాణి మరల వినిపించినది. అంతకు ముందు తెలిపిన విషయములే తెలిపినది. నేను మునుపటి వలెనే నిరాకరించితిని. ఆ దివ్యవాణి రెండువారముల పాటు తనకు తోడ్పడవలెనని, అటుపైన నిర్ణయము చేసుకొనవచ్చునని తెలిపినది. నేను కొంత కరగితిని. రెండు వారములే కదా! అటుపైన నిర్ణయించుకొన వచ్చునుకదా! అని, "సరే" నంటిని, ఈ విధముగా నా గురుదేవులు తలపెట్టిన కార్యము అనూహ్యముగా మొదలగుచున్నదని కూడా నాకా సమయమున తెలియదు. నేను అనుమతించిన కొద్దిరోజులలోనే నాకు "Initiation, Human and Solar" అను గ్రంథము వివరింప బడుటయు, నేను వ్రాయుటయూ జరిగినది.



**34**

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 8

**జ్వాల్**కూల్ మహర్షిగారి బోధనలను ప్రపంచమున కందించుటకు నే నాయనకు వ్రాయసకత్తె నైతిని. “ Initiation, Human and Solar ” అను గ్రంథము పూర్తయినది. అప్పటికొక నెలరోజులు గడచినవి. ఈ కార్యక్రమమును తలచుకొనునపుడల్లా నాలో ఒక ఆందోళన కలుగుచుండెడిది. ప్రపంచము నన్ను ఒక మతిభ్రమించినదానివలె భావించునేమో! అను భయమేర్పడినది. అందువలన నేనిక యీ పని చేయగూడదని నిర్ణయించుకొంటిని. జ్వాల్కూల్ మహర్షికి నా ఆవేదన నిట్లు తెలిపితిని.

“నాకు ముగ్గురు కుమార్తెలున్నారు. వారిది చాలా పిన్న వయస్సు. వారికి నేనే ఆధారము. మీరు నడిపించుచున్న కార్యమున నాకు పిచ్చి కలుగునేమో! అనారోగ్యమేర్పడునేమో! అను భయము తీవ్రముగ నున్నది. అందువలన నేను మీ గ్రంథరచనా మహాయజ్ఞము నకు తోడ్పడజాలను.”

పై విధముగా తెలుపగా జ్వాల్కూల్ మహర్షి అంగీకార సూచకముగ తలయూపి యిట్లని సలహా యిచ్చిరి.

"నీ సహకారము నిరాకరించుటకు ముందు నీవొకసారి నీ గురుదేవుని సంప్రదించుము."

ఈ విషయమున నా గురుదేవులు దేవాపి మహర్షిని సంప్రదించవలెనా? వలదా? అను తర్జన భర్జన ఒక వారము నాలో సాగినది. అటుపైన గురుదేవులను సంప్రదించవలెనని నిర్ణయము చేసుకొని, వారిని ప్రార్థించితిని. వారి సాన్నిధ్యము లభించినది. తన సాన్నిధ్యము కొరకు నే నెట్లు ప్రార్థింపవలెనో నా గురుదేవులు నాకు నిర్దిష్టముగ తెలిపియున్నారు. దాని ననుసరించి ప్రార్థించితిని. ఈ ప్రార్థన అత్యంత బాధ్యతాయుతమైనది. భౌగోళికముగా జాతి శ్రేయస్సునకై నిర్విరామముగా కృషి చేయుచున్న ఒక మహాత్ముని పిలుచుటయనగా అది ఎంతయో అవసరమున్న సన్నివేశమై యుండవలెనే గానీ, మరొకటి కారాదు. వ్యక్తిగతముగ నా జీవిత సమస్యలను గూర్చి నేనెన్నడూ నా గురుదేవుని ఆవాహనము చేయలేదు. సంఘ శ్రేయస్సు కార్యక్రమమునందు అత్యంత క్లిష్ట పరిస్థితి యేర్పడినప్పుడు మాత్రమే చాలా అరుదుగా ఆయనను నేను ఆవాహనము చేయుచుండెడిదానను. ప్రస్తుతము నేనున్నది నా దృష్టిలో క్లిష్ట పరిస్థితే. ఒక అపరిచిత వ్యక్తి అశరీరుడై నాతో సంభాషించు చుండెను. సనాతన వాఙ్మయమును ప్రపంచమున కందించుటకు సహకార మర్థించు చుండెను. అతడు అందించిన మొదటి గ్రంథము అద్భుతముగా నున్నదని కొందరు మిత్రులు ప్రశంసించినారు. మరికొందరు నా స్థితిని ఒక పూనకపు స్థితిగా, ఏదియో భూతము నన్నావరించి వాడుకొనుచున్నదనియూ, అనతి కాలములో నాకు పిచ్చిపట్టుట కాని, లేదా తీవ్రమైన అనారోగ్యము కలుగుటకాని స్పష్టముగా

తెలుపుచున్నారు. రెండవ తరగతివారి అభిప్రాయము నన్ను కలవర పెట్టుచున్నది. అశరీర మహాపురుషుడు నన్ను బలవంతపెట్టక నిర్ణయమును నాకే వదలినాడు. అతడు నా కిచ్చుచున్నది ఒక సువర్ణావకాశమో లేక నేనొక భ్రాంతి దర్శనమునకు లోబడి నన్ను నేను పతనము గావించుకొనుచుంటినో నా కవగాహన యగుటలేదు. అట్టి తీవ్రమైన మనో సంక్షోభమున నా గురుదేవుని ఆవాహనము చేయుటకు నిర్ణయించుకొంటిని. భక్తిపూర్వకముగా వారి దర్శనమునకై ప్రార్థన చేసితిని. నా గురుదేవులు అనతికాలముననే తమ సాన్నిధ్యము ననుగ్రహించి యిట్లనిరి.



**35**

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 9

"**అ**శరీరుడగు మహాపురుషుడు నీతో సంభాషించుట, నీ సహకారమును కోరుట నేనెఱిగిన విషయమే. నీ వెట్టి అపాయము నకూ గురికాబడలేదు. ఈ కార్యము వలన నీవు భౌతికముగా కాని, మానసికముగా కాని, అనారోగ్యము పొందవు. పై విషయమున నీవు నిశ్చింతగ నుండవచ్చును. అత్యంత పవిత్రమగు మహాయజ్ఞమున నీకొక నిర్దిష్టమైన కర్తవ్య మిపుడేర్పడినది. ఇది ఒక సువర్ణావకాశము! ముందు తరములకు ఎంతయో ఉపయోగపడు విజ్ఞానము ఆ మహాపురుషుడు అందించుటకు నిన్నెన్నుకొనెను. నిజమునకు, అతనికి నేనే నీగురించి తెలిపి నిన్ను యీ మహత్కార్యమున వినియోగించు కొనమని సూచించితిని. అతడు నీకూ చిరపరిచితుడే. చేయబోవు కార్యక్రమముల కారణముగా నిన్ను నేను అతని శిక్షణమునకు బదిలీ చేయుట లేదు సుమా! నిన్నెప్పటికినీ నా శిక్షణముననే యుంచెదను. నేను నీకిచ్చు శిక్షణములో భాగముగ ఆ మహాత్ముని కార్యము పరిపూర్తి గావించుము. నీకు శుభము కలుగును."

అని నా గురుదేవులు దేవాపి మహర్షి నా మనస్సునగల సందేహముల నన్నింటినీ నివృత్తి చేయుచూ విశదముగా పలికిరి. వారికి నేను కృతజ్ఞతాభివందనములు తెలుపుచుండగా వారదృశ్యులై నారు. నా హృదయము ఆ క్షణమున పొంగినది. నా గురుదేవులు నన్ను అనుగ్రహించుటకై దివ్య ప్రణాళికయందు నాకు కూడా వ్రాయసకత్తెగా ఒక బాధ్యత నప్పగించినారు. త్రికరణశుద్ధిగ నేను జ్వాల్‌కూల్ మహర్షిగారికి స్టెనోగ్రాఫర్‌గా పనిచేయుటకు నిశ్చయించు కొంటిని. ఈ విషయము జ్వాల్‌కూల్ మహర్షిగారికి తెలిపితిని. వారు అంగీకారముగ తమ చిరునవ్వును ప్రసరింపజేసిరి.



## 36

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 10

మహర్షి జ్వాలాకూలుని బోధనలను ఆరంభదశలో యథా తథముగా పదములను, వాక్యములను వ్రాయుచుండెడిదానను. ఆయన ఎక్కడినుండి తమ బోధనలను ప్రసారము చేయుచుండిరో నాకు తెలిసెడిది కాదు. ఆయన వాగ్ధ్వని మాత్రము స్పష్టముగా నాలోన వినిపించెడిది. ఈ విధముగా నా మెదడును శ్రమతో తీర్చిదిద్దిన నా గురుదేవులు దేవాపి మహర్షికి సదా నేను కృతజ్ఞురాలిని. నా పిన్నతనమునుండి నన్ను రకరకములుగా తీర్చిదిద్ది సాంప్రదాయపు ఊబిలో నున్న నా మనోతత్వము నుద్ధరించి, నా మెదడును చైతన్యవంతము గావించి, దానికి దూరశ్రవణము చేయగల అర్హత నేర్పరచినారు. పదుల సంవత్సరముల వినయ పూర్వక శిక్షణము కారణముగా నే నీనాడు దూరశ్రవణము చేయుచూ మహత్తరమైన జ్ఞానమును విని, వ్రాయగలుగుట నేర్చితిని. జ్ఞానమాత బ్లావెట్స్కీ యిట్లే ముందు తరమున 'తెర తొలగింపు', 'గుప్తవిద్య' అను యుద్గ్రంథములను ప్రపంచమున కందించినది. అదే కోవలో నేను

కూడ పయనించు చుంటినని తెలిసి కృతజ్ఞతా పూర్వకముగా, భక్తి, వినయము, శ్రద్ధలతో వ్రాతపని చేయుచుంటిని.

వ్రాతపని బాగుగా ముందుకు సాగిన సమయమున నా మనస్సు మహర్షి జ్వాలాకూలుని మనస్సుతో పూర్తిగా అనుసంధాన మైనది. అది కారణముగా పదములు, వాక్యములు అందుకొను స్థితినుండి భావము నందుకొని భాషను ఏర్పరచు స్థితికి ఎదిగితిని. అటుపైన బీజప్రాయమైన భావములను జ్వాలాకూలులందించు చుండగా పేరాలుగా వ్రాయుట వరకూ ఎదిగితిని. ఇందు నా కృషి, నా గురువనుగ్రహము రెండునూ సమపాళ్ళలో ప్రాముఖ్యము కలిగియున్నవని కూడా తెలిసినది.



## 37

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 11

పరమగురువులతో మనకేర్పడిన పరిచయము గూర్చికాని, వ్యక్తిగతమైన అనుభూతుల గూర్చి కానీ యితరులకు తెలుపుట బాధ్యతా రహితమైన పని. అత్యంత బాధ్యతాయుతముగ సంఘమునకు శ్రేయస్సు గలుగు కార్యములను నిర్వర్తించుటయేగాని, వారి నామములను బహిరంగముగా గాని, ఆత్మీయులనుకొను వారితో గాని, ముచ్చటించగూడదనునది నేనెఱిగిన ఒక ముఖ్యసాధనా సూత్రము.

న్యూయార్కు నగరమున 'నొబిలిటీ క్లబ్' అను ఒక క్లబ్ వున్నది. రష్యాకు చెందిన 'జార్ చక్రవర్తుల' వంశీయులలోని ఒక రాజు ఆ క్లబ్‌లో ప్రసంగించనున్నాడని, నేను తప్పక ఆ ప్రసంగము వినుటకు హాజరుకావలయునని, నా మిత్రురాలు ఒకామె నాకు గట్టిగ తెలిపినది. నేను సమావేశమునకు హాజరైతిని. ఎందరో ధనికులు, రాజవంశము వారు, పెద్ద పెద్ద అధికారులు సమావేశమున నుండిరి. అలెగ్జాండర్ అను పేరుగల జార్ రాజు సభలో ప్రవేశించు చుండగా అప్రయత్న

ముగ సభయంతయూ లేచి నిలబడి, ఆయన ఉన్నతాసనము నధిష్ఠించు వరకూ ఎవరునూ వారి వారి స్థానము లందు ఆసీనులు కాలేదు. ఇట్టి సాంప్రదాయము బ్రిటిష్ మరియు ఏషియన్ నాగరికతలో కలదుగాని, అమెరికా వారికి లేదు. ప్రసంగము ప్రారంభించుచూ అలెగ్జాండర్ ఇట్లనిరి. ''కొంతసేపు నేను రష్యాదేశపు రాజవంశీయుడనని మీరందరూ మీ మనస్సుల నుండి తొలగించండి. ఒక జీవునిగ యితర జీవులతో ప్రసంగించుటకు నేను వచ్చితిని. ఈ సమావేశమున మన స్థితిగతులు అప్రస్తుతము.''

పై వాక్యములు విని శరీరమంతయూ గగుర్పొడిచి నేను నిశ్చేష్టుడనై కూర్చొంటిని. నా స్నేహితురాలితో "ఇట్టి పుణ్య పురుషుని ప్రపంచవ్యాప్తముగ నున్న నా మిత్రు లందరికీ పరిచయము చేసినచో ఎంత బాగుండును!" అని పలికితిని. మరునాడుదయము నా ఫోన్ మ్రోగినది. ఒక వ్యక్తి "రష్యా దేశపు రాజవంశీయులు, రాజశ్రేష్ఠులు అయిన శ్రీ అలెగ్జాండర్ ప్రభువు మిమ్ములను 'రిట్జ్' హోటల్‌లో కలియుటకు సిద్ధముగా నుందురు. మీరు తప్పక రావలెను." అని తెలిపి ఫోన్ పెట్టి వేసెను. నేనొక క్షణము బిత్తరపోతిని. 11 గంటలకు హోటల్ ప్రాంగణము చేరితిని. అచట ప్రభువుగారి కార్యదర్శి నన్ను కలిసి, "మీకు రాజుగారితో ఏమిపని? వారి నుండి మీకేమి కావలయును?" అని ప్రశ్నించెను. నేను మరల బిత్తరపోతిని. వెంటనే మనసు సంబాళించుకొని, "నా కేమియూ పనిలేదని, రాజుగారే నన్ను చూచుటకు రమ్మనిరని తెలిసి వచ్చితినని, వారిని చూచుటకు గాని,

వారితో సంభాషించు టకు గాని, నేనెట్టి ప్రయత్నమూ చేయలేదని" తెలిపితిని. కార్యదర్శి కూడా ఆశ్చర్యపడి అలెగ్జాండర్ రాజుగారి వద్దకు నన్ను తీసుకొని పోయెను. రాజుగారు నన్ను చిరునవ్వుతో ఆహ్వానించి "నేను మీ కేమి చేయగలను?" అని ప్రశ్నించిరి. నాకు మరల ఆశ్చర్యము కలిగినది. నే నాయనను ఏమియూ కోరలేదు. ఆయన, అమెరికాలో కొందరు వ్యక్తులను కలిసి జ్ఞాన విషయమై చర్చలు జరిపిన బాగుండునని తెలిపిరి. అటుపైన కొన్ని గంటలు మా మధ్య ఆధ్యాత్మిక విషయములు సంభాషణలలో దొర్లినవి. 'ప్రేమమతము' అని ఆయన రచించిన పుస్తకమును నా కందించినారు.

ఒక మిత్రుని ద్వారమున పరిచయమైన అలెగ్జాండర్ గారు ఒక విచిత్ర వ్యక్తిగను, చక్కని ఆత్మ సాధకునిగను గోచరించిరి. వారితో మరియొకమారు మాట్లాడవలెనని మరియొక పార్టీని ఏర్పాటు చేసితిని. మూడవ సమావేశమున అలెగ్జాండరుగారు నన్నిట్లు ప్రశ్నించిరి.



# 38

## మహర్షి దేవాపి సాన్నిధ్యము - 12

"శ్రీమతి బెయిలీ గారూ! మీ రెవరు? మీ రేమి చేయు చుందురు? మన మిదివరకు కలసినపుడు కూడా మీ గురించి నా కేమీ తెలుపలేదు. మిమ్ము గూర్చి మాకేమీ తెలియదు." అనిరి. నే నిట్లు పలికితిని.

"నే నొక సామాన్య స్త్రీని. జన్మతః ఆంగ్లేయురాలను. ప్రస్తుతం అమెరికా దేశస్థురాలను. సామాన్యుల గూర్చి ఎవరికి మాత్రము ఏమి తెలియును? నా గురించి మీ కేమీ తెలియకపోవుట సహజము. చెప్పుకొనుటకు కూడా నేను ఏ ప్రత్యేకతలూ లేని దానిని. నేను సంఘ మున ఒక అజ్ఞాత వ్యక్తిని."

రాజుగారు మౌనముగా తలయూపి, నే నేమయినా కోరినచో తన సహచరులతో దానిని తప్పక నిర్వర్తించగలనని తెలిపి వెడలి పోయిరి.

అటుపైన మామధ్య పరిచయము పెరిగినది. ఒక రోజున కలిసి కారులో ప్రయాణము చేయుచుండగా అకస్మాత్తుగా రాజుగారు

నావంక ప్రేమపూర్వకముగా చూసి, "శ్రీమతి బెయిలీ! నాకు కూడా జ్వాల్‌కూల్ మహర్షిగారు వ్యక్తిగతముగా తెలియునని మీకు తెలుపు చున్నాను. ఈ వార్త మీకేమైనా సంతోషము కలిగించునా?" అని చిరునవ్వు నవ్విరి. మరల బిత్తరపోవుట నావంతైనది. అప్రయత్న ముగ నిటారుగ కూర్చొని "యస్ సర్" అని పలికితిని. ఒక క్షణమాగి "మీరు తెలిపిన వార్త నన్ను ఆశ్చర్యపరచుటయే గాక, హృదయమును తబ్బిబ్బు చేయుచున్నది. నా ఆనందమునకు అవధులు లేవు. మీరు మరల మరల నన్ను కలియుటలో యింత గంభీరమైన ఆంతర్యము కలదని నేనూహించలేదు. ఎంతైననూ మీరు గంభీరులు." అని పలికితిని. పరమగురువుల అనుయాయులందరూ గంభీరులే! పవిత్ర విషయములు రహస్యముగ నుంచగలిగినవారే వారి మార్గాను యాయులు కాగలరు అని తెలిపిరి. వారికే గురుసాన్నిధ్యము అందిన ఫలము.

**39**

## సాన్నిధ్యము

1. ఏ సాధకునికైనను ఏడు సంవత్సరములు ఒక చక్రముగ ఒక దీక్ష నడువవలెను. శ్రద్ధాభక్తులను బట్టి స్వీకరించిన దీక్ష ఏడు సంవత్సరములలో సాఫల్యమిచ్చును.

2. ఒక సాధకుని శిష్యునిగ అంగీకరించుట అను అంశము సద్గురువు యొక్క ఇష్టా అయిష్టములను బట్టి యుండదు. సద్గురువునకు ఇష్టా అయిష్టములుండవు. ప్రవర్తనమున సాధకుడు చూపించు ఉత్తమ లక్షణములే వాని స్వీకారము నకు తోడ్పడును.

3. నీ సత్ప్రవర్తనము ద్వారా సద్గురు సాన్నిధ్యమును నీవు ఆవాహనము చేయగలవు. కొన్ని ధర్మ సూత్రములను ఏకాగ్రతతో పాటించినప్పుడు సద్గురువు నీ వైపు ఆకర్షింప బడును.

4. ఏ సూత్రములను ఆధారముగ సద్గురువు నీకు సాన్నిధ్యము నిచ్చెనో ఆ సూత్రములను ఎన్నటికిని విడువరాదు. వాటిని

మరచినచో సద్గురువు సాన్నిధ్యము నీకు తెలియకయే అదృశ్యమగును.

5. త్రికరణశుద్ధి, నిష్కామ కర్మము, పరహితము ఇత్యాది గుణములు నీయందు శాశ్వతముగనున్నచో సద్గురు వెల్లప్పుడు నీతో నుండును.



40

## కర్మ స్వరూపము

సత్సంకల్పములు కలిగినప్పటికిని అవి కార్యరూపము దాల్చుట అరుదు. కార్యరూపము దాల్చినను పరిపూర్తియగుట ఇంకను అరుదు. దానికి కారణము సంకల్పమున శ్రద్ధ ఒకటికాగ, రెండవది వ్యక్తిగత స్వభావము. వ్యక్తిగత స్వభావమును ఎప్పటికప్పుడు పరిశీలించుకొనుచుండవలెను. పూర్వకర్మ కారణముగ స్వభావము శుభ, అశుభ మిశ్రమమై యుండును. శుభ వాసనలను పెంచుకొను చుండుటచే అశుభ వాసనలు బలహీనపడి నశించును. ఇదియే సత్సాధన!

కర్మ వ్యక్తిగతమే కాక సామూహికము కూడ. కుటుంబ కర్మ, కులకర్మ, ప్రాంతీయ కర్మ, దేశీయ కర్మ, జాతికర్మ మరియు భౌగోళిక కర్మగా యుండును. అందుచే బద్ధజీవనము కొంత తప్పదు. కాని సాధకునకు తన వ్యక్తిగత కర్మను సరిచేసుకొనుట ఒక్కటియే కర్తవ్యము.

పై విధముగ వ్యక్తిగత కర్మనుండి విముక్తుడు కావలెనన్నచో

నిష్కామ కర్మ యోగమే మార్గము. వేరొక మార్గము లేదు. ఈ యోగ మార్గమునకు త్యాగమును జోడించినచో త్వరితగతిని గమ్యమును చేరగలడు. ప్రస్తుత మెప్పుడును కాలగర్భములోనికి కలిసిపోవు చుండును గనుక పై సూత్రముల నాశ్రయించి భవిష్యత్తును తీర్చిదిద్దుకొనుము.

## 41

## సాధన-శరీరము

ఆత్మ సాధనము కొన్ని రోజులకు సంబంధించినది కాదు. ఆత్మానుభూతి కలుగుటకు సాధకుని పరిశుద్ధిని బట్టి కొన్ని సంవత్సర ములు లేదా కొన్ని జన్మలు పట్టవచ్చును. జీవితమున శిశు ప్రాయము ననే సాధన మొదలగువానికి, ఆ జన్మయందే సిద్ధి లభించుట కవకాశము కలదు. ఉత్తరార్థమున యోగసాధన గూర్చి తాపత్రయ పడువారు ఆ శుభవాసనను ముందు జన్మలలోనికి కొనిపోయి, మరుజన్మలో చిరుప్రాయముననే యోగానుష్ఠాన బుద్ధిని పొందుదురు.

మానవ శరీరము ఏడు సంవత్సరముల ప్రాయము నుండి యోగ మార్గము ననుసరించుటకు అనువుగ నుండును. ఇది శ్రేష్ఠమైన సమయము. అచటినుండి ప్రతి యేడు సంవత్సరములకు శరీర కణములు స్థూల మగుచుండగ శ్రేష్ఠమైన సాధనకు దేహము సహకారము నందించుట తగ్గును. ముప్పది ఐదు సంవత్సరముల వరకు శరీరమున మార్దవ ముండుట కవకాశ మున్నది. నలభై రెండు సంవత్సరముల తరువాత శరీరము బిరు

సెక్కి సాధనకుపయుక్తము కాక యుండును. చిన్నతనముననే శరీరమునకు యోగాంగములైన యమ నియమములను నేర్పినచో జీవితమంతయు యోగ సాధనమునకు శరీరము అనుకూలముగ వర్తించును.



## 42

# తుమ్మ ముళ్ళు

**ఆ**ధ్యాత్మిక స్ఫూర్తి కలిగి జీవితమును నిర్వర్తించుకొన్నచో బాగుండునని సర్వసామాన్యముగ ప్రతి సాధకుడును భావించును. తన హృదయమున సద్గురువు నిలచి సరియగు స్ఫూర్తినిచ్చి కార్యములను సర్వశుభప్రదములుగ నిర్వర్తించవలెనని ఆశపడుట కూడ సహజము.

అట్టి ఆశ సద్గురువులకు కూడ నుండును. కాని నీ హృదయమను సింహాసనమున ముళ్ళకంపలు పేర్చి యుండుటచే సద్గురువు ఆసీనుడు కాలేడు. ముళ్ళకంపను తీసి మెత్తని, చల్లని ఆసనము వేసి ఆహ్వానించుట సదాచారము.

నీలోని ముళ్ళకంపలు నీ భావపరంపరయే ! ఇతరులపై నీకు గల దురభిప్రాయములు ముళ్ళ వంటివి. సహాధ్యాయి యెడల అట్టి భావము లున్నచో అవి ముళ్ళలో తుమ్మ ముళ్ళ వంటివి. అవి తీవ్రముగా బాధ పెట్టగలవు. కావుననే "సహాధ్యాయి యెడల సోదర భావము" అను ఒక నియమమును అందించియున్నాము. ఆ నియమమును తప్పక ప్రవర్తించువారి హృదయము, నిర్మలత్వమునకు

అవకాశమేర్పరచును. మనసున యితరులనుగూర్చిన అభిప్రాయములు సమసినచో అట్టి హృదయము గురుపీఠము కాగలదు. ధర్మక్షేత్రము కాగలదు.



43

## సూచనలు-1

1. సుముఖత లేనివారికి సత్యమును గురించి, సద్గురువును గురించి, సద్గ్రంథములను గురించి వివరింపకుము. వారి అవహేళన, విముఖత– సత్యమునకవమానకరము.

2. తన వారి కొరకై పాటుపడని వానిని దరిచేర నీయకుము. అట్టివాడు బాధ్యత లెరుగనివాడు. భక్తి లేనివాడు, దేశభక్తి లేనివాడు, బాధ్యత నెరుగనివాడు– స్నేహమునకు పనికిరాడు.

3. తెలిసినవారు, తెలివిగల వారందరును మంచివారు కానక్కర లేదు. సంబంధములు పెంచుకొనుటలో ఈ విచక్షణను కలిగి యుండవలెను.

4. శ్రేయోదాయకమైన కార్యమును నిర్వర్తించుటలో అవహేళనకు, అపనిందలకు, నష్టమునకు గురియైనను తప్పులేదు. కాలక్రమ మున అది అమూల్యమైన ఫలములను కొనితేగలదు.

5. సత్పురుష దర్శనము, సద్గ్రంథ పఠనము, సత్య భాషణము

ఎన్నటికిని నిరర్థకములు కావు. సత్పురుషుల యెడల చూపిన త్యాగనిరతి ఉత్తమోత్తమ ఫలములనందించగలదు.

6. మిమ్ములను మీరు సంస్కరించుకొను మార్గమున మమ్ములను దర్శించుట ఉత్తమము. కేవలము మా దర్శనము కోరువారు, వారి సంకల్పబలమున దర్శించినను అది అపాయకరము కాగలదు. మా దర్శనమున మీలోని సంస్కారము లన్నియు ఒక్కసారిగ అలజడి చెందగలవు. అది కారణముగ కొన్ని నీచప్రవృత్తులు బైటపడు అవకాశము గలదు. పిచ్చి యెక్కు అవకాశములు కూడ గలవు.

**44**

## సూచనలు-2

1. సద్గురువు బోధనలను త్రికరణశుద్ధిగ ఆచరించువారు ముగ్గురు కలసినచో మహత్కార్యములను సాధింపవచ్చును. అట్టి కార్యమునకు పతనముండదు.

2. ప్రతి మనిషికిని హృదయము కలదు. కేవలము సత్కార్యముల తోనే దానిని స్పందింప చేయగలవు. భాషణము మాత్రమున ఎవనికిని లోతైన స్పందనము కలుగదు.

3. నిజమైన శక్తి సామర్థ్యములు ఇతరులతో కలిసి పని చేయునపుడు మాత్రమే తెలియనగును. స్వంతముగ పని చేయుటకన్న కలిసి పనిచేయుటకు ఎక్కువ సామర్థ్యము కావలెను. ఈ విషయమున నీవు సమర్థుడవో కావో నీకుగ నీవే ప్రయోగాత్మకముగ తెలుసుకొనుము.

4. మీ సంఘమున నూతన సభ్యులు ప్రవేశించినపుడు వారి యెడల నీ ప్రవర్తన మెట్లున్నదో గమనించుము. నీకు తెలిసిన

విషయములు సానుభూతితో వారికి తెలుపుట నీ ప్రథమ కర్తవ్యము. వారియందు ఉదాసీనుడవై యుండుట నీ అహంకారమునకు చిహ్నము.

5. పరహిత కార్యము వ్యాప్తిచెందుట సహజము. పనులు పెరుగుచున్నచో వాని నాచరించుచు నీవును పెరుగుము. వాని పెరుగుదలకు నీవు అడ్డుపడినచో నీవు తొలగింప బడుదువు. ఈ విషయమును గూర్చి ఆలోచింపుము.

**45**

## సదాచారము

పరిశుద్ధ జీవనము ఒక్కటియే మార్గమున పురోగతి నివ్వ జాలదు. సదాచారవంతు లెందరో గలరు. పాత్రను పరిశుద్ధి చేయుట సద్వినియోగపరచుటకే కదా! కేవలము ప్రతిదినము తోమి, కడిగి, భద్రముగ వుంచిన పాత్ర వలన వినియోగము లేదుకదా! ఆహార పదార్థములను వండుటకు పాత్రను వినియోగించినట్లే నీవు కూడ పరహితమను యజ్ఞమునకు సమర్పణము చెంది యుండవలెను. పాత్ర అగ్ని తాకిడి భరించి, రుచికరమైన పదార్థములను తయారుచేసి పదిమందికి పోషణము కలిగించును. నీవును అట్లే జీవితపు ఆటుపోటులను భరించుచు, పదిమందికి వినియోగపడు పద్ధతిలో జీవించుట ముఖ్యము. కేవలము సదాచారమే సమస్తము అను భ్రమనందు జీవింపకుము. సదాచారమవసరమే. అది లేనివారు సత్కార్యములను నిర్వర్తించలేరు. సత్కార్య నిర్వహణకు సదాచారముతో పాటు సత్సంకల్పము, తెగించు బుద్ధి (ధీరత) కూడ నుండవలెను. ఇట్టి గుణములు లేని సదాచారము డాంబికముగ నుండును. తెలియని అహంకారము నిన్నాశ్రయించి యుండును. పదిమందికి ఉపయోగ పడిన జీవనమే జీవనము. త్వరపడి పరహిత కార్యమున పాల్గొనుము.

# 46

## విచక్షణ

సద్గురువుపై పూర్తిగ భారము వైచి కర్తవ్యము నిర్వర్తింపని వాడు భ్రష్టుడగును. అట్టివానికి స్వశక్తి తగ్గును. నీపై నీవాధారపడుట పెంచుకొనుచు అత్యవసర విషయములనే సద్గురువుకు నివేదించుట నీ పెరుగుదలకు తోడ్పడును.

సద్గురువున్నాడు కదా! అను మితిమీరిన విశ్వాసముతో బాధ్యతలను మరచుట అవివేకము. దీని వలన సాధారణ బాధ్యతలు కూడ నిర్వర్తించలేని స్థితి కలుగును. వేలు పట్టుకొని నడిపించుట ధీమంతులకు తగదు. నీకుగ నీవు నడువుము. కర్తవ్యములను, బాధ్యతలను నీకుగ నీవు మోయుము. కష్ట నష్టముల నోర్చుకొనుము. వేలు పట్టుకొని నడచువాడవు మహత్కార్యము లేమి చేయగలవు?

ప్రతిదినము ప్రార్థన సమయమునందు నీకు వలసిన మానసిక సహాయము అందింపబడ గలదు. ధృతి గలిగి నీవే సమస్త బాధ్యతలను నిర్వర్తించుము.

తన సమస్యలను తను స్ఫూర్తివంతముగ పరిష్కరించుకొను వానికి సద్గురువు సహాయము కూడ వెన్నంటి యుండగలదు. అర్జునుడు స్వయముగ యుద్ధము చేసినాడు. శ్రీకృష్ణుడు తోడ్పడినాడు. మిక్కుటముగ గురువుపై నాధారపడువాడు ఏమియును చేయజాలడు.

# 47

## కపటి

పరమగురువులను గూర్చిన సంభాషణము అత్యంత బాధ్యతా యుతమైనది. వారిని గూర్చి ఎంత తక్కువ సంభాషించిన అంత మేలు. కారణమేమన వారిని గూర్చిన అవగాహన కలవారు వాఙ్నియమము కలవారగుటచే మాట్లాడరు. వారిని గూర్చి తెలియని వారు గాలి కబుర్లుగ నియమముల నుల్లంఘించి మాట్లాడు దురు. వారు చెప్పు విషయములు వారికే తెలియనివి. తనకు తెలియని విషయములు తెలిసినట్లుగ చెప్పువాడు కపటి. తమ గుర్తింపుకొరకై పరమగురువులను గూర్చి తెలిసినట్లుగ పలుకుచూ, ఇతరులను తనకు లోబడునట్లు చేసుకొనుచుండును.

సద్గురువులను గూర్చి చర్చించుటకన్న శ్రద్ధాభక్తులతో సత్కార్య ముల నాచరించుట శ్రేయోదాయకము. వేల సంవత్సరముల తరువాత నా ఉనికిని ఈ మధ్య కాలమున కొందరికి తెలియజేయుట వలన మానవ జాతియందు చాల అలజడి జరిగినది. రభస జరిగినది. వారు రచ్చ కెక్కుటయే కాక మమ్ములను కూడ రొచ్చులో దింప జూచినారు. ఇది అంతయు భక్తులమనుకొను ఆవేశపరుల కారణముగ వెదజల్లబడిన బురద. మాటిమాటికిని గురునామమును ఉదహరించు వ్యక్తి అపాయకరమని గుర్తింపుడు.

# 48

## ప్రభావము

ప్రతివాని జీవితము తన పరిధిలో ఇతరులను కొంత ప్రభావితము చేయుచుండును. కారణమేమనగా ప్రతి ఒక్కరూ చైతన్య స్వరూపులే అగుట వలన. కొందరి ప్రభావము తాత్కాలికముగ నుండును. కొందరి ప్రభావము చిరకాల ముండును. ఎంత చెట్టు కంత గాలి అన్నట్లు మంచి ప్రభావమైనను, చెడు ప్రభావమైనను జీవి పనులను బట్టి యుండును. అందువలననే మంచి అయినను, చెడు అయినను సమర్థత కలవారి నుండే వ్యాపించును. పై కారణ ముగ మంచిని పెంచవలెనన్నచో మంచివారు సమర్థులై యుండ వలెను. సమర్థత, మంచితనము కూడియున్నచోట దివ్యవైభవ ముండును.

సామాన్యముగ సమర్థత యున్నచోట స్వార్థముండును. మంచి తనము కలచోట సమర్థత లేక యుండును. స్వార్థపరులైన సమర్థులను మంచివారినిచేయుట కొంత కష్టము. సాధుజనులను సమర్థవంతు లను చేయుట సులభము. పై కారణముగనే దైవము అవతరించి

నపుడు గొల్లలతో నుండెను. గొఱ్ఱెల కాపరితో నుండెను. మహాత్ములు కూడ సామాన్యులతో కూడి యుందురు. వారిని తీర్చిదిద్దుకొనుచు సంఘము చక్కబెట్టుట దివ్యకార్యము. అదియే దివ్య ప్రణాళిక కూడను. దివ్య జీవనమును అనుసరించదలచిన వారు ఈ మార్గముననే నడువవలెను.

## 49

# సంస్కారము - జ్ఞానము

కన్ను చూచును, చెవి వినును. కాని హృదయము సత్యా సత్యములను గ్రహించును. జ్ఞాన సముపార్జనము మనసున స్థిరపడిన వాడు తనకు ప్రత్యేకమైన గుర్తింపుకు పాట్లుపడుచుండును. అదే జ్ఞానము హృదయమున వికసించినపుడు తన ప్రత్యేకత భావమును కోల్పోయి లోకహితుడగును. మనిషి సంస్కారము ననుసరించి జ్ఞాన మతనిని అహంకారిగ గాని, ఆత్మవంతునిగ గాని చేయగలదు. ఇది జ్ఞానము చేయుపనికాదు. సంస్కారము చేయుపని. తన కొరకై పాటుపడు జ్ఞాని జ్ఞానియే కాదు. అతడు స్వార్థపరుడే. తన పరిసరము నందలి జీవుల వేదనలను గుర్తించి తాను పొందిన జ్ఞానబలముతో వారికి వినియోగపడుటయే జ్ఞానమునకు పరమావధి. వినియోగము పడని జ్ఞాని అజ్ఞానికన్నా మూర్ఖుడు. అతడిని ప్రకృతి క్షమింపదు. దొంగ దొంగతనము చేసిన అది సామాన్య విషయము. పోలీసుయే దొంగతనము చేసినచో అది క్షమించరాని నేరము. ఇందు మొదటి వాడు అజ్ఞాని, రెండవవాడు జ్ఞాని. జ్ఞానికి కల ఏకైక కార్యము లోకహితము. లోకోద్ధరణము. అది ద్రవ్యయజ్ఞముగను, జ్ఞాన యజ్ఞముగను సాగవలెను.

సంస్కారి, జ్ఞాని యగుట సవ్యమార్గము.
కుసంస్కారి, జ్ఞాని యగుట అపసవ్యము.

## 50

# నీరు పల్ల మెరుగు

నిండుగ వున్న తటాకము నుండి క్రిందుగ వున్న ప్రదేశము నకు నీరుపారి వాటిని నింపును. రెండిటి యొక్క సమతలము ఒకటి యగు వరకు నీరు పల్లమునకు పారును. అట్లే ఉన్ముఖుడగు శిష్యుని లోనికి గురువు మేధస్సు ప్రవహించును. వారిద్దరి మధ్య కల అనుబంధముచేత అది సాధ్యపడును. అదే విధముగ ఉన్ముఖులైనచో భార్యాభర్తల నడుమ కూడ అట్టి చైతన్య ప్రభావము నిర్వర్తింపబడి ఇద్దరునూ సమానమగు చైతన్య స్ఫూర్తి కలవారగుదురు. గురువు నుండి శిష్యునకు ఈ ప్రవాహము నిర్వర్తింప బడుటకు శిష్యునికి ఉన్ముఖత్వముతో పాటు సంస్కారము ముఖ్యము. సంస్కారము సరిగా లేనిచోట చైతన్య ప్రవాహమున కడ్డంకు లేర్పడును. ఈ అడ్డంకు లెక్కువగ శిష్యుని మనో వికార రూపమున నుండును. దేహము చేత కూడ ప్రవాహమునందుకొనలేని దుస్థితి యందుండవచ్చును. ఇందు మొదటిది శిష్యుడి జన్మల నుండి తానుగ తెచ్చుకొనుచున్నది. రెండవది తను జన్మించిన వంశము తల్లి తండ్రులకు సంబంధించినది. ఈ రెండిటిని సంస్కరించుకొనుట శిష్యుని వంతు. చైతన్య ప్రవాహము నిర్వర్తించుట మా వంతు.

## 51

# ముక్కుసూటి మార్గము

**అ**తి చిన్న జీవియందు, అతి పెద్ద దైవమునందు నిన్ను నీవు దర్శించుట ఆత్మ దర్శనామార్గము. ఇట్లు దర్శించు సాధకుడు దేనిని అశ్రద్ధ చేయడు. మానవ మేధస్సు గొప్ప విషయములందు ఆసక్తి కలిగియుండుటచే ఆత్మ దర్శనమునకు అర్హత కలిగియుండదు. అట్టి అర్హత కలుగవలె నన్నచో ఆడంబరములకు తల ఒగ్గని మనస్సేర్పడ వలెను. ఆత్మతత్త్వ మన్నిటను నిండియున్నది గనుక అన్నిటియందు దానిని దర్శించుట క్షేమమగు మార్గము. ఇట్లు దర్శించువానికి భ్రమ, భ్రాంతి కలుగును. క్రమముగ అతడు సత్యదర్శనుడు కాగలడు.

పెద్దపెద్ద ఘనకార్యములను నిర్వహించువారు చిన్న విషయము లందు అశ్రద్ధవలన తలక్రిందులగుట, పతనము చెందుట లక్షల సార్లు జరిగినది. పర్వత శిఖరము నధిరోహించినవాడు ఇంటి గడప దాటుచు జారిపడి ఎముకలను విరుగగొట్టుకొనిన సందర్భములు గలవు. ఆత్మ ఒకే శ్రద్ధతో సమస్తమును ఆవరించి యున్నది. ఆత్మకు పెద్ద-చిన్న లేదు. అంతయు తానే. ఆత్మదర్శనాభిలాషికి గూడ అట్టి

గుణము అలవడవలెను. “సమస్తము నేనే. నేను కానిదేదియు లేదు. అందరియందు నన్నే దర్శింతును. ప్రేమింతును. ఆదరింతును. స్ఫూర్తితో ప్రతిస్పందింతును” అని ప్రతి ఉదయము భావన చేసి, ఆ భావనను ఆచరణమున పెట్టుటకు ప్రయత్నించుట సూటియగు సాధన. ఇట్టి సాధనా మార్గమున మరపు కలిగినను మరల మరల ప్రయత్నించుటయే ఉపాయము. ప్రతి సాయంత్రము నీ ఆత్మదర్శనా సాధన ఎట్లు సాగినదో పర్యాలోచనము చేయుము.

52

## ప్రజ్ఞావిలాసము

వస్తువులను చూచుచున్నపుడు నిశితముగ చూడుము. నిజము నకు ప్రతి వస్తువును సంఖ్య, శబ్దము, వర్ణము, పదార్థము యొక్క సముదాయము. వీటిని సమీకరించు శక్తి వీటి నావరించి యుండును. దానినే ప్రజ్ఞ యందురు. అది సాధారణ దృష్టికి అవ్యక్తముగ నుండును. కాని ఈ సమీకరణ ప్రజ్ఞను మాత్రమే దర్శించుట దీక్షగా అవలంబించి నచో శబ్దము, వర్ణము, పదార్థము కేవలము ఆ ప్రజ్ఞ యొక్క తొడుగులుగ గోచరించును. క్రమశః ప్రజ్ఞయందు, నీ ప్రజ్ఞ అను సంధానమై లోదృష్టి ఏర్పడగలదు.

ఇట్లు పరిసరముల కన్పించు రూపములన్నియు కూడ శబ్ద, వర్ణ, పదార్థముల సమీకరణమే అని తెలియును. నీయందు కూడ సమస్తమును అట్లే సమీకరింపబడియుండుట తెలియును. ఒకే ప్రజ్ఞ వేరు వేరు కేంద్రములుగ ఏర్పడి, వేరు వేరు సమీకరణములను చేసుకొని రూపాత్మకమైనదని తెలియును. ప్రజ్ఞ ఒక్కటియే గాన, అది నీవే గనుక, సమస్తము నందును "నే నను" ప్రజ్ఞయే నిలచి

యున్నదని, ప్రజ్ఞకు విభజనము లేదని, విభజనము కేవలము ఒక భావన యని తెలియును.

పై భావము నీయందు స్థిరపడినకొలది సమస్తము నీ కనుకూల మగుచుండును. అప్పుడు నీవు పూర్ణ ప్రజ్ఞావంతుడవై, నీ రూపము నతిక్రమించి అన్నిటియందు నేనుగ భాసించగలవు.



## 53

## కర్మవిమోచనము

కర్మవిమోచన మార్గము విచిత్రమైనది. సంసిద్ధత గల వారికిది సులభముగ లభించగలదు. సంసిద్ధత లేకయే సాధకులు విమోచనము కలిగించుకొనుట లేదు.

దూరప్రయాణమునకై ఒక బృందము ఓడనెక్కినది. ఓడలో ఒక వ్యక్తి ధనము దోచబడెను. అతడు మౌనముగ తనకు జరిగిన అన్యాయమును ధీరతతో భరించెను. సముద్రము నడుమ ఓడ ఒక నిక్షిప్తమైయున్న రాతిని ఢీకొని పగిలినది. ఓడ ముక్కలు చెక్కలు అయినది. ధనము పోగొట్టుకున్న ప్రయాణీకుడు ఒక చెక్కను పట్టుకొని రేయింబవళ్ళు తేలుచు ఒక అద్భుత ద్వీపమును చేరెను. ఇతర ప్రయాణీకులు ఓడతో సహా సముద్రమున మునిగిరి.

నూతన ద్వీపవాసులు తీరము చేరిన వ్యక్తిని ఆదరించి సపర్యలు చేసి తమతో నుండుటకు సకల సౌకర్యములు ఏర్పరచిరి. ద్వీపవాసి ఒకరు ప్రయాణికుని ఇట్లు ప్రశ్నించెను. “నీవు బ్రతికి ఈ ద్వీపము చేరుట ఒక అద్భుతము. ఇతరులందరును సముద్రమున

మునిగిరి. నీవు మాత్రము తేలుచు, ద్వీపము చేరితివి. దీనికి కారణ మేమైయుండును ?

ప్రయాణీకు డిట్లనెను. “నాకు తెలిసిన కారణ మొకటియే. మిగిలిన వారికన్న నాకు ప్రయాణమున ఖర్చు ఎక్కువైనది.”

**54**

## తప్పుడు కోట

**క**లియుగమున తప్పులు సులభముగ మన్నింతురని, ఒప్పులను శ్లాఘింతురని, మంచి కొంచెమైనను ఫలిత మెక్కువగ నుండునని, చెడు ఎక్కువైనను కొంత క్షమింపబడునని నానుడి కలదు. ఇందలి సత్యము నేతిబీరకాయ వంటిది.

మీకు తెలుసునా! ఈ భూమిపై కద్రు స్థానమున "తప్పుడు కోట" ఒకటి గలదు. ('కద్రు' స్థానమనగా అధర్మమును ప్రేరేపించు ప్రజ్ఞా కేంద్రము) ఈ కోట కట్టడము తప్పుడుగ జరిగినది. దాని నిర్మాణము తప్పుడు ప్రదేశమున చేయబడినది. కోట యందలి రాజు తప్పుడు వివాహమాడెను. అతడు తప్పుడు యుద్ధములు గూడ చేసెను. అతని మంత్రులు కూడ తప్పుడు సలహాలనే ఇచ్చెడివారు. రాజు తప్పుడు జూదములాడెడివాడు. అతనికి తప్పుడు రోగములు వచ్చినవి. అకాలముగ మరణించినాడు. తప్పులు కొంతవరకే సహింపబడగలవు.

పై తెలిపిన తప్పుడు కోటను కలి ఆవరించిన మానవుని శరీరముతో సరిపోల్చవచ్చును. అందలి జీవునకు కోటలోని రాజునకు

పోలికయున్నది. కలి ఆవరించిన జీవుని జననమే తప్పుడుగ జరుగును. పోషణము అపవిత్రమగు ఆహారముతో జరుగును. వివాహము గుణముతో సంబంధములేక జరుగును. అతని జీవన పోరాటము తప్పుల సంకులము. అతని మిత్రులు, సలహాదారులు కూడ తప్పుడు సలహాల నిత్తురు. మధ్యవయస్సుననే రోగములు మీదపడి అకాలమరణము సంభవించును. కలి ఆవరించిన వాని శరీరము కద్రు స్థానములోని తప్పుడు కోట వంటిది.



# 55

## నూతన శంఖారావము

అసత్యభాషణము చేయువాని జీవనము ముళ్ళ తివాచీవలె నుండును. దానిపై నడకగాని, పడకగాని సుఖము నీయదు. అసత్యభాషణము, ప్రవర్తనము ఆధారముగ నిర్మింపబడు జీవనము ఎప్పటికప్పుడు పేకమేడవలె కూలుటకు సిద్ధముగ నుండును. అసత్యభాషి తానుచ్చరించు వాక్యములపై విశ్వాసము కలిగి యుండడు. క్రమశః తనపై తనకు విశ్వాసము కోల్పోగలడు. ప్రస్తుతమున కొందరు వ్యక్తులు, పీఠాధిపతులు, మతములు తామాడిన అసత్యముచే నిర్మించుకొనిన పేకమేడలను నిలుపుకొనుటకు నిర్విరామముగ కృషి చేయుచున్నారు. భయము చెందియున్నారు. ఇట్టివారు మతాధిపతులు గానే కాక శాస్త్రవేత్తలుగను, విద్యావేత్తలుగను, రాజకీయనాయకులుగను పెద్దపెద్ద పదవుల నలంకరించి యున్నారు. రాబోవుకాలము కుంభచైతన్య సంబంధితమగుటచే వీరి ప్రవర్తనము లన్నియు ప్రజల ముందు కాలపురుషుడు ఎండగట్టుట జరుగును. దీనికి నాంది ఉపాసిక (H.P.B.) చేసిన శంఖారావమే.

## 56

## కొన్ని ప్రశ్నలు

మిమ్ములను సూటిగ కొన్ని ప్రశ్న లడుగుదును. సమాధానము మీకు మీరే చెప్పుకొనుడు. నాకు చెప్పనవసరము లేదు. నా ఈ ప్రశ్నలు సాధకులకు మాత్రమే.

1. నీ యందు ధర్మానుష్ఠాన బుద్ధి యున్నదా?
2. అవసర సమయమునందు కూడ అధర్మము ప్రోత్సహించబడదా?
3. గురువునందు, దైవమునందు ఎప్పుడైన సందేహము వచ్చునా, రాదా?
4. నీవు పరనింద చేయుదువా? చేయవా?
5. అసత్య భాషణమునకు జంకుదువా? జంకవా?
6. సంవత్సరమున అసహనము ఎన్నిసార్లు కలుగును ?
7. మనస్సునకు స్థిరము ఏర్పడినదా? లేక చంచలత్వ మున్నదా?

8. పనులయందు శ్రద్ధ, భక్తి యున్నదా? లేక అశ్రద్ధ, నిర్లక్ష్యము ఉన్నదా?

9. నీవు శరీర శ్రమకు సిద్ధమేనా?

10. నీకు దైవమన్న భయమా?



57

## మా కొలబద్ద

సాధకులను అంతేవాసులుగ ఎన్నుకొనుటకు మా వద్ద ఒక కొలబద్ద ఉన్నది. మీరు మీ దైనందిన జీవితమున చిన్న చిన్న విషయముల యందు, చిల్లర విషయములయందు అసత్య మాడుదురా? ఆడరా? అనునది ఈ కొలబద్ద. అవసరము లేకున్న కూడ అబద్ధము లాడుట మీ యందు మేము తరచు గమనించు చుందుము. ఈ యలవాటు అపాయకరమైనది. ఈ యలవాటుగల సాధకునకు త్రికరణశుద్ధి అనునది అసాధ్యము. ఎన్ని మంచి గుణము లున్నను, ఎంత సమర్థతయున్నను దీనివలన సమస్తము భ్రష్టము చెందును. అసత్యభాషణము సత్యదర్శనమునకు పూర్తిగ వ్యతిరేకము.

దివ్యలోకము లన్నియు సత్య మాధారముగ నిలబడియున్నవి. భాషణమున సత్యము లేనివాడు దివ్యలోకముల కెట్లు ఎగబ్రాకగలడు? మిమ్ముల నంతేవాసులుగ అంగీకరించుటకు మీ యందు గల ఈ స్వభావము గోడవలె అంతరాయము కలిగించుచున్నది. ఈ కంచుగోడను మీరే నిర్మూలించుకొనవలెను. విషయము చిన్నదే

యైనను, దాని వలన కలుగు అపాయము చాల పెద్దది. చిన్న అగ్గిపుల్ల కారణముగ వందలకొద్ది ఇండ్లు దగ్ధము కాగలవు. ఈ విషయమున కొంత శ్రద్ధ వహింపుడు.



## 58

## శంబళ

శంబళ మానవజాతికి శాంతి, దాంతి, ఆనందము కలిగించును. శంబళ దైవమునకు మార్గము. శంబళ సత్యాన్వేషకులకు ధృవతార.

కొందరికి శంబళ సత్యము. కొందరికి శంబళ కల్పితము. మరికొందరికి శంబళ జీవితాశయము. ఇంకొందరికి శంబళ సర్వసంపద ప్రదాత.

శంబళ భూమి ప్రజ్ఞ. దేహమునకు జీవుడెట్లో భూమికి శంబళ అట్లే. జీవునకెట్లు ఒక నామమున్నదో శంబళ ప్రజ్ఞకు కూడ నామము కలదు. ఆ నామమే సర్వపూజ్యమైన సనత్కుమార నామము. అతని నుండియే భూమికి ప్రాణము, తెలివి ప్రసార మగుచున్నవి. అతని హృదయము ఒక అద్భుతమైన రజత పద్మము. అతని హృదయమే ఆదిత్య హృదయము కూడ. ఆదిత్యుని హృదయమునందు ఏ ప్రజ్ఞ వసించుచున్నదో అదియే సనత్కుమారుని హృదయమున గూడ

వసించి యున్నది. సప్తకిరణముల ప్రజ్ఞను సప్తగ్రహముల ద్వారా తా నందుకొనుచు సనత్కుమారుడు భూమికందించుచున్నాడు.

దేహము యొక్క అస్థిత్వమునకు జీవాత్మ ఎట్లు సత్యమో, భూమి భూమిజీవుల అస్థిత్వమునకు సనత్కుమారుడట్టి సత్యము. భూమిపై జీవుల పరిణామమునకు, పరిణితికి, పరిపూర్ణతకు సనత్కుమారుడే అధిపతి. నిజమునకు అతడు పరిపూర్ణ అగ్ని స్వరూపుడు.



## 59

## శ్రావస్తి

**భూ**మిపై సనత్కుమారుని ప్రణాళికను నిర్వహించుటయే జగద్గురువు మైత్రేయుని ప్రణాళిక.

మైత్రేయుని బోధనలు జీవ చైతన్యమును మేల్కొల్పి సృజనాత్మ కము చేయుట.

మైత్రేయుని బోధనలు అనంతము, అనిర్వచనీయము, అప్రతర్క్యము అగు విరాట్పురుషుని, అతని సృష్టి విధానమును జీవుల కెరుకపరుచుట.

మైత్రేయుని బోధనలు విశ్వాత్మ చైతన్యమును పరిచయము చేసి, మతములకు మన్వంతరములకు అతీతము మరియు శాశ్వతము నగు ధర్మమును, దైవమును పరిచయము చేయుట. కూటములు, వర్గములు గురుపరంపరాగత మతములలో చిక్కుపడిన వారికి మైత్రేయుని బోధలందవు.

మైత్రేయుని బోధనలు అగ్ని సమానములు. సూటిగ హృదయ

కమలమును మేల్కొల్పి, వికసింపజేసి విశ్వాత్మ చైతన్యమునందు రతి గొలుపును.

మైత్రేయుని బోధనలు జీవుల పునరుత్థానము కొఱకే. ద్విజత్వము నందించుట కొరకే. అనగా పదార్థమయమైన దేహమున పుట్టిన జీవుడు దివ్యపదార్థమున మరల పుట్టుట.

భూమిని, భూమి జీవులను దివ్య వైభవము వైపునకు నడిపించుట కొఱకే మైత్రేయ మహర్షి దివ్యశరీరమును ధరించి వేలాది సంవత్సరముల నుండి యజ్ఞార్థము భూమిపై నిలచియున్నాడు.



## 60

## మెల్లకన్ను

సమదృష్టి కలవారికే కేంద్రము గోచరింపగలదు. ఇతరులకు కేంద్రబిందువు కేంద్రమున కాక అటునిటుగ గోచరించుచుండును. సమదృష్టి లేనివారు, కేంద్రము చూడలేనివారు, మెల్లకన్ను గలవారిగ మేము భావింతుము. అందరికిని కన్నులున్నను ఒకే వస్తువును చూచుచున్నను ఒక్కొక్కరికి ఒక్కొక్కటి గోచరించును. కాని వస్తువు కేంద్రము తద్వారా సమగ్రరూపము మాత్రము గోచరించదు. మా అనుయాయి అయిన అక్బరు చక్రవర్తి సమదృష్టి లేనివారిని మెల్లకన్ను వానిగ సంబోధించుచుండెను. వీరబలుడు (బీర్బల్) ఒక్కనినే అతడు సర్వధా విశ్వసించుచుండెను.

నేతలు సమదృష్టి గలవారినే విశ్వసించవలెను. పక్షపాతదృష్టి కలిగినవారందరు గ్రుడ్డివారే. ధృతరాష్ట్రుడు పుట్టు గ్రుడ్డి. అనగా జన్మతః పక్షపాత బుద్ధికలవాడని అర్థము. పక్షపాతధోరణి గ్రుడ్డితనముకాగ, సత్యమును సమగ్రదర్శనము చేయనివారు మెల్లకన్ను గలవారు. సమదృష్టి గలవారికే చూచుశక్తి స్పష్టముగ నుండును.

చూచుటయందు కుడి ఎడమలు ఉండవు. నిజమునకు వీరు కుడి ఎడమ కన్నులతో చూడరు. వానికి కేంద్రమైన జ్ఞాన నేత్రముతో చూచెదరు. వారి చూపు, వారి అవగాహన ఇతరుల కుండదు. ఉండదని గూడ వారు తెలిసియుందురు. మెల్లకన్ను చూపులు, గ్రుడ్డి చూపులు, సమగ్రదృష్టి వారి కవగతమే. మొదటి రెండు తెగల వారిని వీరు నిరసింపరు. వీరి యెడల మౌనము వహించి యుందురు. మూడవ తెగవారిని "కలాప"కు ఆహ్వానింతురు.

61

## గ్రద్ధ కన్ను

**యో**గి యొకరు తన ఆశ్రమమున వస్తువుల అమరికను సున్నితముగ మార్పు చేయుచుండెను. అంతేవాసులు, అనుయాయులు సామాన్యముగ వీనిని గమనింపరు. అతి చిన్న మార్పునుగూడ గమనించు అంతేవాసిని అతడంతరంగమున అంగీకరించి, ఆశీర్వదించి ప్రత్యేక బోధనలు, రహస్యార్థములు తెలుపుచుండెడివాడు. ఇతరులకు సామాన్య విషయములు తెలుపుతుండెడివాడు.

ఒకనాడు యోగి గారి సహాధ్యాయి ఒకరు ఆశ్రమమున కేతెంచెను. యోగి రహస్యముగ చేయుచున్న మార్పులను గమనించెను. మార్పులన్నియు అర్ధరాత్రమున జరుగుచుండెడివి. గమనించిన మిత్రుడు యోగి వింత ప్రవర్తనమును గూర్చి ప్రశ్నించెను.

యోగి యిట్లనెను. "గ్రద్ధ కన్ను కలవారికే నా ఆశ్రమమున నిజమైన ప్రవేశము అనుమతింపబడును. భౌతిక ప్రవేశము అంతరంగ ప్రవేశము కాజాలదు. పరిశీలనా స్వభావము లేనివానికి మహత్తర విషయములు బోధించి లాభము లేదు. చెముడు, గ్రుడ్డి గలవారితో

ఎంత శ్రమించినను శ్రవణ, దృశ్యముల అనుభూతి వారికి కలుగదు గదా! అత్యంత స్వల్పమైన మార్పును కూడ పరిశీలనా దృష్టితో చూడగల ఒక్క అనుయాయి ఉన్ననూ, నా యందుగల విద్యను అతని కందించి ఋషి ఋణమును తీర్చుకొనుచున్నాను. పరిసరముల యందు జరుగు మార్పులు, అట్టి మార్పుల ప్రభావము తెలియుటకు వలసినది శ్రద్ధ, అప్రమత్తత. అందుకే యీ అర్ధరాత్రి శ్రమ." యోగులిద్దరును నవ్వుకొనిరి.



62

## చర్విత చర్వణము

ప్రస్తుత కాలము పూర్వకాలమును గుర్తుచేయు చున్నది. కాల చక్రమున మానవజాతి చరిత్రలో చేసిన పొరపాట్లే మరల చేయుట కనిపించును. ఇప్పుడు జరుగుచున్న సంఘటనలన్నియు వినాశమును ప్రోత్సహించునవిగ గోచరించుచున్నవి. అట్లాంటిస్ నాగరికత జలమయం కాకముందు వారును యిట్లే ప్రవర్తించిరి. సన్నివేశముల వివరములలో క్రొత్తదనమున్నదిగాని విధానమంతయు పాతయే. అపుడును నకిలీ భాష్యకారులు, కపటయోగులు చాలమంది పామరులను భ్రష్టు పట్టించినారు. ఇప్పుడును అదే జరుగుచున్నది. ఓ న మ లు రానివారు గూడ మహాత్ములుగ గుర్తింపబడుటకు తపన చెందుతున్నారు. కపట వేషణము, భాషణము, సత్యదూరమగు సాధనా పద్ధతులు, భ్రమలయందాకర్షణ అప్పుడును జరిగినది, ఇప్పుడును జరుగుచున్నది. కృతఘ్నత, ఆధ్యాత్మిక అనాగరికత, ఆటవిక ఆధ్యాత్మిక ప్రదర్శనములు అప్పుడు ఇప్పుడును గూడ మరల మిక్కుటముగ గోచరించుచున్నవి.

అట్లాంటిస్ నాగరికతలో గూడ ఆకాశగమన విద్య గలదు. వారును వినువీధిలో త్వరితముగ ప్రయాణము చేయుటకు పరికర

ములు కలిగియుండిరి. వేగముగ కదలుటకు, త్వరితముగ కబళించుటకు, బలముతో ఆక్రమించుటకు ఆ పరికరములను వాడుచుండిరి. అప్పుడును ఇప్పుడును కూడ భౌగోళిక సంచారము, గ్రహాంతర సంచారము జరిగినది, జరుగుచున్నది. అప్పుడును ఇప్పుడును కూడ ఆలయములను ధ్వంసము చేయుట, అపవిత్రము చేయుట, అపహాస్యము చేయుట జరిగినవి, జరుగుచున్నవి. సోమనాథుడు, కాశీ విశ్వేశ్వరుడు, అయోధ్యారాముడు, మధురానాథుడు భారతమున అవమానింపబడినట్లే, మధ్య ఆసియాలో శాంతినిలయమైన **జెరూసలేము** దేవాలయము, దక్షిణ అమెరికాలో శంబళకు ప్రతీకయైన **ఇబెజ్** (IBEZ) దేవాలయము, మధ్య అమెరికాలో గల **అమేరు** దేవాలయములు అవమానింపబడినవి.

అపుడును ధర్మోల్లంఘనము మితిమీరి జరిగినది. ఇపుడును జరుగుచున్నది. అపుడును భూమి అంతర్భాగములలో మానవులు అలజడి కలిగించిరి. ఇప్పుడును అదే పని చేయుచున్నారు. చేసిన పొరపాట్లే మరల చేయుట వలన, ఇదివరకటి ఫలితములే మరల పొందవలసియుండును. మానవజాతి జీవనము చక్ర భ్రమణమున సాగుచున్నదేగాని ఆరోహణ క్రమము కొద్దిమందికే అలవడుచున్నది. జాతి కథ చర్విత చర్వణమే.

## 63

# యోగవిద్య

శబ్దము నుచ్చరించు శాస్త్రము వ్యాకరణ మనబడును. దేవతలీ శాస్త్రమును దర్శించి మానవులయందు ఉచ్చారణశక్తి నేర్పరచి నాలుకపై వాక్కును స్థిరపరచిరి. మానవులకు దేవతల వలన కలిగిన శక్తియే వాక్కు. దేవతలకు శబ్ద శాస్త్ర దర్శనము జరుగుటకు వారి యందలి అంతర్యామి ప్రజ్ఞయే కారణము.

దేవుడే శ్వాసగా జీవుని రూపమున దిగివచ్చు చున్నాడు. లోక సంహితార్థము కొరకు దేవుడే తన్ను తాను వేరుగా గుర్తించి మనస్సుగా దిగివచ్చు చున్నాడు. అట్లు దిగివచ్చిన వెనుక శ్వాస వేరుగ, మనస్సు వేరుగ ఉచ్చారణశక్తి, వాక్‌శక్తి వినియోగించుచున్నవి.

వాఙ్నియమముతో మనస్సును మరల శ్వాసతో కూర్చి తనను తాను తెలియుటయే యోగవిద్య.

# 64

## అంతఃకరణములు

భగవంతుడు మానవుడుగా భూమిపై దిగివచ్చినపుడు అతని చతుర్వ్యూహము కూడ అతనితో దిగివచ్చును.

తాను వాసుదేవుడుగ దిగివచ్చును. తన అహంకారము సంకర్షణుడుగ దిగివచ్చును. తన బుద్ధి ప్రద్యుమ్నుడుగ దిగివచ్చును. తన మనోశక్తి అనిరుద్ధుడుగ దిగివచ్చును.

శ్రీ కృష్ణావతారమున పై నాలుగు వ్యూహములు వరుసగ శ్రీకృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడుగా దేహమును ధరించిరి.

శ్రీ రామావతారమున పై చతుర్వ్యూహములే, శ్రీరాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడుగ దిగివచ్చిరి.

పై వ్యూహము లన్నియు మానవుని యందు గూడ స్థితి గొన్నవి. అందు మొదటిది మానవుని యందలి దైవము. రెండవది అతని అహంకారము. మూడవది అతని బుద్ధి, నాల్గవది అతని మనస్సు.

ఈ చతుర్వ్యూహములే అంతఃకరణములు.

# 65

## అవధూత దేహ ధర్మము

అపక్వాహారము, అల్పాహారము, అధికముగ జలములను సేవించుట వలన క్రోధాదులు తగ్గి సత్త్వగుణ మలవడును. మైపూతలు మాని కేవలము శుచికై జలస్నానము చేయుట, శరీరమునకు ఇతర సంస్కారములు అనగ, జుట్టు, గడ్డము, మంగలిపని చేయింపక విడచుట. యివి యతి ధర్మములు.

ఒక వయస్సు దాటి వార్ధక్యము సమీపించు కొలదియు తెలియకయే దేహమునకు సుఖించు కోరిక పెరుగును. దానివలన దేహము రోగాక్రాంత మగును. అవధూత ధర్మము వహించినచో చిట్ట చివరి క్షణము వరకు దేహము ఆరోగ్యముగ నిలబడును.



## 66

## సద్గురువు

ఎవరి సమక్షములో మనస్సు నిర్మలమవుతుందో అతడే సద్గురువు.

ఎవరి సాన్నిధ్యములో భేదభావం పుట్టదో అతడే సద్గురువు.

మనస్సే సంసారం. మనస్సే ప్రకృతి. మనస్సే యింద్రియములకు రాజు. అట్టి మనస్సును నిర్మలము గావించి దాటించువాడే సద్గురువు.

నీ ప్రకృతిని దాటించువాడే సద్గురువు.

వాసనలను శమింపజేసి జ్ఞానజ్యోతిని వెలిగించి ఆత్మ జ్ఞానము నందించేవాడే సద్గురువు.

నీ హృదయములో ప్రకాశిస్తున్న ఆత్మకు బాహ్యారూపముగా దర్శనమిచ్చువాడే సద్గురువు.

## 67

## సహవాసము

సాధకునకు సహవాస విషయములో అప్రమత్తత అవసరము. కలసిన ప్రతి మనిషితో స్నేహము చేయుట తగదు. స్నేహమునకు గుణము ప్రధానమై యుండవలెను. అంతటా నీరు ఉన్నా త్రాగటానికి కొంత నీరే పనికి వస్తుంది. అందుచే స్నేహము విషయమున సాధకుడు శ్రద్ధ వహించవలెను. సాధకుడనగా సత్యసాధకుడు. అతడు సత్యాన్వేష కుడు. నీవు సాధకుడననుకొనుచున్నచో సత్యాన్వేషణము నందు శ్రద్ధ కలవారితోనే సహవాసము చేయవలెను. అట్లు కానిచో సాధన కుంటుపడగలదు. పరిచయస్తుల గుణగణములను పరిశీలించు కొని సహవాసము చేయుటకు పూనుకొనుము. దుస్సాంగత్యము దురభ్యాస ముల నేర్పరచి జన్మ జన్మలకును వెంటాడును. అందువలన సత్సాంగత్యమే శరణ్యము. సత్సాంగత్యము వలననే మనసునకు సంగదోషము తొలగును.

68

## బ్రహ్మచర్య వ్రతము

వ్రతములలోకెల్ల బ్రహ్మచర్య వ్రతము శ్రేష్ఠమైనది. మొదట శారీరక బ్రహ్మచర్యము, అటుపైన మానసిక బ్రహ్మచర్యము సాధించుకొనవలెను. మనసు బ్రహ్మమునందే చరించినచో బ్రహ్మచర్య వ్రతము పరిపూర్తి యగును.

బ్రహ్మచర్యము, భోగజీవనము పరస్పర విరుద్ధములు. యోగి భోగియై కూడా నుండగలడు. కాని భోగి యోగి కానేరడు. యోగసిద్ధి కలుగునంత వరకు భోగజీవనమునకు ఉన్ముఖత్వము చూపరాదు.

కేవలము భౌతికమైన బ్రహ్మచర్య మవలంబించిన చాలదు. మనస్సును, బ్రహ్మమును మరల మరల జ్ఞప్తికి తెచ్చుకొనుచు, అరిషడ్వర్గములు చేరనివ్వని మనస్సు నేర్పరచుకొనవలెను.

బ్రహ్మ భావమును ఊహించుచు, శ్లాఘించుచు అందరి సుఖమే ప్రధానముగ జీవించువాడు బ్రహ్మచర్య వ్రతదీక్షను అవలంబించిన వాడగును.

**69**

## ఫల త్యాగము

సత్సాధకునకు త్యాగగుణము శ్రేష్ఠమగు ఆలంబనము. మైనపు వత్తి తాను కరగుచు ఇతరులకు వెలుగు నిచ్చును. కర్పూరము తాను హరింపబడుచు ఇతరులకు క్షేమము నిచ్చును. గంధపు చెక్క తాను అరుగుచు ఇతరులకు చల్లదనాన్ని, పరిమళాన్ని ఇచ్చును. చెఱకుగెడ నమలబడుతుంటే తీపి నిచ్చును. సృష్టిలో త్యాగము వలననే అన్నియు అమృతత్వ స్థితి చెందియున్నవి.

కొందరు వస్తువులను త్యాగము చేసెదరు. కొందరు ధనమును త్యాగము చేసెదరు. ద్రవ్యత్యాగము కన్న భావత్యాగము ముఖ్యము. వాసనలతో కూడిన భావములను త్యాగము చేయుట మొదటి మెట్టు. కర్మఫల త్యాగము తరువాతి మెట్టు. ఆత్మత్యాగము తుదిమెట్టు. అది లోకశ్రేయస్సు నుద్దేశించి చేయువాడే మహాత్ముడు.



# 70

## అసూయాగ్ని - 1

ప్రస్తుత ప్రపంచమున అసూయకు లోను కాని వారు బహు కొద్ది మంది మాత్రమే. ఇతరులతో తమను పోల్చుకొను స్వభావము కలవారికి అసూయ సోకును. సుయోధనుడు, కర్ణుడు అసూయకు లోనై నశించినారు. ప్రస్తుత కాలమున ఈ వాసన మిన్నగ నున్నది. అసూయ గలవానికి కర్తవ్యమునందు శ్రద్ధ ఉండదు. అశ్రద్ధ గలిగిన వానికి జ్ఞానము లభింపదు. అసూయ అసుర సంపదలో చక్రవర్తి వంటిది.

అసూయకు ప్రతీకారము తమ్ముని వంటిది. ప్రతీకారమునకు హింస తనయుని వంటిది. ఇవన్నియు కలిసి జీవుని  నరకమునకు నెట్టును. అసూయకులోనై తానెంతటి దుష్కృత్యముల నొనర్చినాడో విశ్వామిత్ర మహర్షి రామునికి తన ఆత్మకథగ వివరించి, ఎట్టి స్థితి యందును అసూయ చెందరాదని హెచ్చరించెను. అర్జునుని శ్రీకృష్ణుడు కూడ అట్లే హెచ్చరించెను. పతనము చెందినవారందరు కూడ అగ్నిలో పడిన శలభమువలె నశింతురు.

**71**

## అసూయాగ్ని - 2

అసూయ నిన్ను సూదివలె అనుశ్యూతము పొడుచుచుండును.

అసూయ హృదయాన్ని దహించుచుండును.

అసూయతో చేసిన సత్కార్యములు ఫలించవు.

అసూయ పునాదిగా చేయు దైవారాధనము దైవము నాకర్షించ లేదు.

అసూయాపరునికి సత్సంకల్పములు కలుగవు. కావున పరివర్తన యుండదు. అసూయ మనస్సును, దేహమునకు అమిత తాపము కలిగించును. అసూయ మనిషిని నిలువెల్ల విషముతో నింపును.

అసూయాపరునికి సమస్తము అంధకారమే.



72

## ఆడంబరము - అధోగతి

త్రికరణశుద్ధి లేని జీవనము కృత్రిమము. కృత్రిమ జీవనము అశాంతికి కారణము. లౌకిక జీవనమునకు గాని, అలౌకిక జీవనమునకు గాని త్రికరణశుద్ధి ముఖ్యము. కృత్రిమ జీవనము జీవుని రకరకములుగ బంధించును. తన నిజస్వభావమునకు విరుద్ధముగ మాటలాడువారు, పనులు చేయువారు ఆడంబరులు. లోపల స్వార్థబుద్ధి, వెలుపల ధర్మ ప్రవచనము, వీరిలో ఎక్కువగా కనిపిస్తాయి. ఇట్టి డంబాచారులకు మాటలో సరళత యుండదు. చేతలో స్పష్టత యుండదు. ఆడంబరమునకు ఎక్కువ లొంగి ఉందురు. ఇట్టివారు ఆధ్యాత్మిక మార్గమున పురోగతి చెందుట దుర్లభము. ఆడంబర జీవనమునకు మూలమున స్వార్థముండును. తనను, తనవి పెంపొందించుకొనుటకు ధర్మపన్నములు వల్లించుటయే కాని నిజముగ ధర్మానుష్ఠానబుద్ధి యుండదు. ధనకాంక్ష, కీర్తికాంక్ష కలిగి కామక్రోధములకులోనై, అసూయాగ్రస్తుడై అధోగతి పాలగును. డంబము ఆత్మశత్రువు. ఆత్మహంత.

## 73

# ప్రేమ

ఈ ప్రపంచమున ప్రేమ అరుదుగా గోచరించును. వ్యామోహము, మమకారము, పరస్పర అవసరములు ప్రేమగా తరచు వ్యక్తమగుచుండును. ఒకరిపై మరికొరిపై గల అవసరమునుబట్టి ఆదుకొనెదరు. అవసరమునబట్టే ప్రేమ. కాని అవసరము లేకపోయినచో ప్రేమ లేదు. ప్రేమ పేరున ఒకరినొకరు బంధించుకొనుచుందురు. ఒకరిపై మరియొకరు ఆశలు పెంచుకొనుచుందురు. ఒకరి నుంచి మరియొకరు ఆశించెదరు. ఆశించినది లభించని యెడల ప్రేమ ద్వేషముగా మారుచుండును. అదే విధముగా తనవారు మమకారభావము ప్రేమగా తారసిల్లుచుండును.

నిజమైన ప్రేమకు తనవారు, పైవారు అని యుండదు. అట్టి ప్రేమ ఆశించదు, అడుగదు. ఆ ప్రేమయందు హెచ్చుతగ్గులు ఉండవు. ఆ ప్రేమకు అవసరములు ఉండవు. వ్యామోహము అంతకన్న ఉండదు. నిజమైన ప్రేమ అపరిమితము. కృతిమ ప్రేమ పరిమితము.

నిజమైన ప్రేమ వికాసమునిచ్చును. కృతిమ ప్రేమ దుఃఖము నిచ్చును. అహంకారి, మమకారి ప్రేమించలేరు. సమదృష్టి అను పదమునకు మరియొక పేరే ప్రేమ. నిజమగు ప్రేమ యందు ధర్మము, సత్యము, అహింస, అస్తేయము, అపరిగ్రహము ఇమిడియుండును. కృతిమ ప్రేమ యందు పై గుణములు కానరావు.

ప్రేమ ఆత్మతత్త్వమునకు సంబంధించినది. ఆత్మ నెరిగినవాడే నిజమైన ప్రేమికుడు. ఇతర ప్రేమలన్నియు చిల్లర ప్రేమలు. మనస్సుకు, బుద్ధికి కూడా అందని పరమపవిత్రమైనది ప్రేమ. ప్రేమ యున్నచోట కల్మషము ఉండదు. నిజమైన ప్రేమ తెలియవలెనన్నచో, అది మహాత్ముల జీవితమునందే కన్పపట్టును.

## 74

## ఉడకని మెతుకులు

నీవు నమ్మిన సద్గురువు రూపమును నీవు హృదయమున గాని, పాలభాగమునకాని దర్శించి, ధ్యానించుట ఒక ఉత్తమమైన సాధనా మార్గము. అహంకారులు ఈవిధముగ ధ్యానించలేరు. నీవు నమ్మిన సద్గురువు నీకు సమస్తమై యుండవలెను. అతని ముఖమును, ఆసీనుడైన అతని రూపమును నీవు ధ్యానమున స్పష్టముగ చూడ గలుగుట నీకెంతయూ మేలుచేయగలదు. సద్గురువు నీ ముందుండి నిన్ను నడిపించెడి దివ్యజ్యోతి అని తెలియుము. అతని నుండి నీ వెప్పటికప్పుడు నీ బుద్ధిని ప్రచోదనము కావించుకొనవచ్చును. అతని వెలుగు నీ చుట్టును ఒక వెలుగు ఆవరణ మేర్పరచి నిన్నెల్లప్పుడును పరిరక్షించుచుండును. నీ మనస్సున అతని భావములు మెదలవలె నన్నచో అతని ధ్యానమున నీవు నిలచి యుండుటయే సూత్రము. అతని ననుసరించుట యనగా అతని భావముల ననుసరించుటయే. అనుకరణము వలన ప్రయోజము లేదు.

సద్గురువుతో భావమయ లోకమున సహకారము నందవలె నన్నచో ఆయన రూపధ్యానము గావింపవలెను. దివ్యలోకములకు,

నీకును మధ్య ఆయన వంతెనయై నిలబడి నీవు ఆయనతో కుదర్చు కొను మైత్రిని బట్టి నీకాలోకానుభూతిని ఆయన కలిగించగలడు. నీ ద్వారా దివ్యకార్యములను నిర్వర్తించగలడు. నీ నుంచి పలుకగలడు. బోధన చేయగలడు. నీ ధ్యానమును బట్టి నీ సామీప్యమున నుండ గలడు. సాయుజ్యమును, సారూప్యమును కూడ ప్రసరించగలడు.

సద్గురువు దొరికిన తరువాత కూడ నిరాకారమునే ధ్యానింతు మని భావించువారు, వారి అహంకారము కారణముగ త్రిప్పలు పడుచుందురు. దైవము తన దూతగ గురువును పంపినపుడు గురువే దైవమని తెలియక, ఆయన యందు పరిపూర్ణవిశ్వాసముంచక, ఆయన అందించిన మార్గమున నడచువారు అహంకారులు. ఉడకని మెతుకుల వంటివారు. వీరికి పరిష్కారము, వారి అహంకారమును సద్గురువు పాదముల వద్ద సమర్పించుటయే.

**75**

## సుగంధ పరిమళములు

విత్తనములు, ఎండు ద్రాక్ష, ఖర్జూరము మొదలగు పండ్లు, పూవుల సువాసనల ద్వారా చికిత్స చేయుట అతిప్రాచీనము. గులాబి వాసన వాతావరణమున గల అపాయకరమగు భూతములను పారద్రోలును. గులాబి తోట చిత్తమునకు స్ఫూర్తి నిచ్చును. నరములకు శాంతి గూర్చును. ఊపిరితిత్తుల వ్యాధి కలవారికి బార్లీ నీరు మిక్కిలి ఉపయోగము. దేవదారు దివ్యతత్త్వములను ప్రసారము చేయును. సుగంధము, ఇతర పరిమళ ద్రవ్యముల వాడుకను మానవజాతి శృంగార క్రియలకే పరిమితి యొనర్చినది కాని, నిజమునకు వాని వినియోగము ఆధ్యాత్మిక సాధన కుపయోగము. గంధము చెక్క ఈ విషయముననెంతయో ఉపయోగకరము. పూర్వకాలము సత్పురుషులు గంధమును పూసుకొనుట, గంధము చెక్కను తమ వద్ద నుంచుకొనుట చేయుచుండెడివారు. ఆధునిక కాలమున తయారగుచున్న పర్ఫ్యూమ్‌లు (perfumes), సెంట్లు (scents) కామమునకు ప్రేరణ కలిగించును కాని, జీవుని చిత్తమునకు శాంతి కలిగింప లేవు. అనేకానేక పతన కారణములలో వికృత పరిమళ సుగంధములు ఒకటిగ గుర్తింపుడు.

## 76

# హృదయ సమర్పణ

**ధ్యా**నమున జీవుడు "తానుండుట" అనగనేమో తెలియుటకు ప్రయత్నించును. అది తెలియుట సత్యమును తెలియుటయే. ఈ ప్రయత్నమునకు మహత్తరమగు విఘ్నము భయము. భయము జీవుని ఆవరించినచో యిక అతడు పెరుగుట కవకాశము లేదు. అంతకు మునుపు పొందిన వృద్ధికూడ భయకారణముచే అక్కరకు రాదు. మమ్ముల ననుసరించువారు మాపై విశ్వాసముంచి భయమును వదలవలెను. భయపడు వానికి హృదయము కుంచించుకొని పోవును. ఊపిరితిత్తులు కూడ చిన్నవగును. శ్వాస పూర్ణముగ జరుగక, ఆయాసము వచ్చును. ఆయాసము భయమునకు దారితీయును. భయము మరింత పెరుగును. ఊపిరి అందని స్థితి కలుగును. దానితో మరణభయము కలుగును. ఇదంతయు భయము వలననే.

మాపై విశ్వాసము పెంచుకొన్నచో భయము మిమ్ములను చేరదు. సద్గురువు నిర్భయమును నీ హృదయము నుండి అందించ గలడు. విశ్వాసము హృదయమును తెరువగలదు. అందుండి మీకు

సమస్తమును అందించగలడు. అందులకే భరతదేశమున హృదయమును దైవమునకు, గురువునకు అర్పించు సంప్రదాయమేర్పడినది. హృదయ సమర్పణమునకు విశ్వాసము ప్రధానము.

**77**

## నూతనత్వము

నిర్ణయమందలి వైవిధ్యమునందొక ఆనందము కలదు. వైవిధ్యము ఆనందహేతువు. క్రొత్త ఒక వింత, పాత ఒక రోత అను సామెతలో సత్యమున్నది. తెలిపిన విషయమునే మరల తెలుపుచున్నను తెలుపు విధానమున క్రొత్తదన మున్నచో శ్రోత లానందింతురు. సృష్టియందీ క్రొత్తదనముండుట చేతనే ఆకర్షణీయ ముగ నుండును. ప్రతి సూర్యోదయము, ప్రతి పౌర్ణమి, ప్రతి ఋతువు క్రొత్తగనే యుండును. వైవిధ్యము ఒక నూతనత్వమును కొనితెచ్చి ఆసక్తిని, ఆనందమును కలిగించును. అనుభవించువారికి చిత్తశాంతి యగును. అట్లు క్రొత్త క్రొత్తగ బోధించుట సద్బోధకుని నైపుణ్యము. అదే భోజనమైనను క్రొత్త క్రొత్తగ వండినచో తినువారి కాసక్తి కలుగును. అవే వస్తువులైనను అమరికలో మార్పు చేయుటచే క్రొత్తదనముద్భవించును. ఈ రహస్యము తెలిసిన వైద్యుడు అవే మందులిచ్చుచున్నను, మాటలతో రోగిని ఉత్సాహపరచుచు అతని యందు ఆనందముద్భవింప చేయవలెను. ఆనందము కలిగించుట

అసలైన వైద్యము. ఆనందించునపుడు శరీరగ్రంథులు చక్కగ స్రవించును. దేహమునకు వలసిన జీవసార ముద్భవించి స్వస్థత చేకూర్చును. ఆనందపరచువాడు నిజమైన ఆత్మీయుడు.

# 78

## మధుర మార్గము - 1

**క**న్నులకు కనపడనివి చూచుటకు, చెవులకు వినపడనివి వినుటకు ప్రయత్నము చేయుడు. దివ్యలోకమందలి మూర్తులను చూచుచున్నట్లు, వారి భాషణము వినుచున్నట్లు భావన చేయుడు. ఇది యొక ప్రయోగము. ఇట్లు చేసినచో పరిసరములందలి రూపములు, భాషణములు, మీకిక వినపడవు. చప్పుడులు మీకంతరాయమును కలిగించవు. క్రమముగ మీ యందు దూరదృష్టి, దూర శ్రవణము ఏర్పడును. మీ సద్గురువును కూడ మీరిట్లే నిజముగ దర్శించవచ్చు. ఇది నిజమైన "పరధ్యానము." ఇహమును మరచు స్థితి. కాల కృత్యములు, కర్తవ్యములు, నిత్య నైమిత్తిక కర్మలు యొనర్చిన పిమ్మట ఈ పరధ్యానమున నిమగ్న మగుడు. దీని వలన మీరు పొందు అనుభూతి కారణముగ మీ శరీర ధాతువులలో కోరదగిన మార్పు వచ్చును. ఇహలోక విషయము లంతగ బాధింపక పట్టు సడలును. మీరాబాయి కృష్ణునిట్లే ఆరాధించి నది. భక్తులందరు ఊహాజనిత మార్గముననే తీర్చిదిద్దబడినారు.

ఇది యొక మధురమైన మార్గము. దీనిలో తన్మయత్వముండును. మధురాష్టకము దీనినే సూచించుచున్నది. గాయకులు, కవులు ఈ మార్గమున తరించినారు. అపురూప మగు దివ్య దర్శనములు అందిన ఫలముగ ఈ మార్గ మొసంగును.

79

## మధుర మార్గము - 2

**మ**ధుర మార్గమునకు జగద్గురువే గురువు. అతడే శ్రీకృష్ణుడు. అతని సాన్నిధ్య స్థితియే మధురానగరము. ఋషులు, దేవర్షులు, దేవతలు, మునులు, యోగులు నిమిత్త కారణములను గైకొని దివ్య మాధుర్యమునకై మధురానగరము వచ్చి పోవుచు నుండెడివారు. మముబోంట్ల వారి మాట యిక చెప్ప నవసరము లేదు. జగత్తునే మోహింప చేయగల చరితము శ్రీకృష్ణునిది. అతని సాన్నిధ్యము వర్ణనాతీతమగు మాధుర్యము కలిగించును. జీవుల అస్థిత్వమునే మరపింపచేయగల మాధుర్య మాయన సాన్నిధ్యమున నున్నది. గోప స్త్రీలే యన నేల? నారదాది మహర్షులు సైతము, అతని సాన్నిధ్య మాధుర్యమునకై తపన చెందుచుండిరి. అతని చూపు మధురము, నడక మధురము, నవ్వు మధురము, మాట మధురము, చేత మధురము, గానము మధురము, రథసారథ్యము మధురము. పరవశము కలిగించు అతని రూపమును చూచి మహా భారత యుద్ధమున శత్రువులందరును అతని ముందే చేరిరి. యుద్ధమును

గమనించిన మాబోటి వారికిది విదితము. అర్జునుని అస్త్రములచే సంహరింపక మునుపే కృష్ణుని చూపులతో చూపులను కలిపి శత్రువు లతనిని చేరిరి. కేవలము రక్తమాంసాదులతో కూడిన దేహములనే అర్జునుడు వధించెను. యుద్ధమున భీష్ముడొకడే ఇది గమనించెను.



**80**

# మధుర మార్గము - 3

శ్రీకృష్ణ సాన్నిధ్యము ప్రకృతినే పరవశింప చేసినది. శత్రువులేమి లెక్క. శత్రువులను చంపు శ్రమ అర్జునునిది. అతడు సంహరింపక ముందే శ్రీకృష్ణుడా జీవులందరిని తనలోనికి ఆకర్షించినాడు. "అర్జునా! నీవు ప్రత్యేకముగ చంపున దేమియు లేదు. వీరందరును చనిపోయియే యున్నారు." అని కృష్ణుడు పలికి నప్పుడు అర్జునునికి అర్థము కాలేదు. పది దినములపాటు భీష్ముడు కృష్ణుని చూచుచు యుద్ధమున నిలచి మధురానుభూతిని పొందినాడు. తన నెట్లును శ్రీకృష్ణుడు పరిపూర్ణముగ నాకర్షించెను. తన శరీరమున గూడ అతని దివ్యాయుధ స్పర్శచే పులకింప చేయమని ప్రార్థించినాడు. తెలిసియు ఆకర్షితులై యుద్ధమున మరణించినారు. కృష్ణ సాన్నిధ్య మాధుర్యము వారికే దక్కినది. ఆ మాధుర్యము అర్జునునికి దక్కకపోవుట విచిత్రము. శ్రమయే అతనికి మిగిలినది. కృష్ణ భక్తి మాధుర్యమున శ్రమ లేదు. తాను చేయుచున్నా నన్న భావనయే యుండదు. పరమాత్మ అకర్తగ నుండి జీవులను అకర్తస్థితికి చేర్చినాడు. మోక్షమని తెలియకయే కృష్ణభక్తులు మోక్షము

పొందినారు. అతని సాన్నిధ్యము మోక్షమునే సన్యసింపచేయు యోగము. మోక్షమునందుండుటయే గాని మోక్షమునందున్నామను కొనుట బంధమే. మోక్షమును కోరుట చిక్కుముడి. శ్రీకృష్ణుని వేణుగానము జీవులను అప్రయత్నముగ అత్యున్నత స్థితి యందుంచినది.



81

## మధుర మార్గము - 4

**నూ**తనత్వము మాధుర్య మార్గమునకు పునాదియని తెలిపితిమి. నూతనత్వము ఆనందము కలిగించును. ఆనందము తుష్టిని, పుష్టిని కలిగించును. శ్రీకృష్ణుడు నిత్యనూతనుడు. అతడెప్పు డెట్లుండునో ఎవరునూ ఊహించలేరు. ఎట్లు ప్రవర్తించునో అసలే తెలియదు. అతనియందంతయు నూతనత్వమే. అతను నిత్యనూతను డగుటచే అతనిని గూర్చిన భావన నిత్యానందకరము. బాలురు, స్త్రీలు, వృద్ధులు, వీరులు, వైరులు, మిత్రులు, భార్యలు, బంధువులు ఎవ్వరునూ అతని చేష్టలను ముందుగ నూహింపలేకపోయిరి. అతని నుండి కార్యములు జరుగుచున్నప్పుడు చూచి ఆశ్చర్యపడుట, ఆనందపడుట, దైనందిన చర్యగ మారినవి. అతడిట్లు తన పరివారము నంతను ఉత్సాహమున నుంచెను. చిల్లర విషయములందు వారికి గల ఆసక్తిని తన సాన్నిధ్యములోనికి మరల్చెను. అతని వేణుగానముతో భూమిని, పశుపక్ష్యాదులను ప్రచోదనము గావించెను. ఆ వేణుగాన తరంగములే నెమరు వేసుకొనుచు భూమి, దానిని ఆవరించియున్న

పంచభూతములు, గురుపరంపర ఇనుమడించిన ఉత్సాహముతో కర్తవ్యములను నిర్వర్తించుచున్నవి. ఈ మధుర సాన్నిధ్య మార్గముల కన్న మించిన మార్గమేదియు లేదని మధురాధిపతి తన చివరి సందేశముగ జీవుల కందించెను.



# 82

## కలుపుగోలుతనము

నీచపు ఆలోచనలు విషపురుగుల వంటివి, త్రాచుపాముల వంటివి. వానిని పెంచి పోషించుట వినాశనము కొరకే. మానవునికి భావమే ప్రధానము. భావములందు సత్యము, ధర్మము, దయ, ప్రేమ పెంపొందినచో జీవుడూర్ధ్వగతి చెందగలడు. అరిషడ్వర్గములను పెంచి పోషించినచో జన్మల తరబడి అధోగతి చెందును. సత్పురుషులను, దైవమును దూషించుట, హింసించుట చేసినవారు అసుర జన్మలను కూడ నెత్తుదురు. మీ భావములనుబట్టి మీ భవిష్యత్తు నిర్ణయ మగుచున్నది. మీ భవిష్యత్తునకు మీరే నిర్ణేతలు. కావున మీ పరిస్థితుల కెవ్వరిని దూషింపవద్దు, మిమ్ములను కూడ మీరు దూషించుకొన వలదు. ఆత్మనింద పనికి రాదు, పరనింద అసలే పనికిరాదు.

తోటి మానవులను అవగాహన చేసుకొనుచు, అందరిని కలుపుకొనుచు, ముందుకు సాగుట మేము గుర్తించిన విలువ. కలుపుకొనుటలో విచక్షణ ముఖ్యము. కలుపుకొనుటకు ముందు ఏరుకొనుట ముఖ్యము. ఎన్నుకొనుట కూడ ముఖ్యమే. కనబడినవారి నందరిని కలుపుకొని నడచినచో మార్గము కల్లోలిత మగును. విచక్షణ నీ స్నేహితునిగ ఎప్పుడును ఉండవలెను.

## 83

## శ్రమ - ఫలితము

"శ్రమించుటకు వెనకాడకుము. మంచిని పెంచుము. సత్పురుషులను గౌరవించుము." ఇది మా శాసనము. పుట్టిన ప్రతి పసిపాప అరచేతియందును ఈ శాసనము లిఖించవచ్చును. దీని ననుసరించినవాడు దివ్య మార్గమును చేరగలడు. ఇదియే దీక్షగ సాగినవాడు పవిత్ర హృదయుడై దివ్యత్వమును చేరగలడు.

పై శాసనమును మీరందరును గంట గంటకు మననము చేసుకొనుట మంచిది. ప్రపంచపు ఆటుపోటులలో మరపు సహజము. ప్రక్కదారులు పట్ట కుండుటకై నిరంతర మననము ముఖ్యము. మననము, ఆచరణము పట్టుపడి నచో తుఫానుయందు కూడ నీవు స్థిరముగ యుందువు. చాల శ్రమ పడితిని, ఇంక ఎంత శ్రమపడ వలెను? అను వారికి మా సమాధానము 'యిక చాలు'. ఈ సమాధానము కోరువారు పురోగతిని వాయిదా వేసినట్లే. మరియొక శ్రమ పడువాడు "ఈ శ్రమకు ఫలితమేమి?" అని భావించినచో మా సమాధానము 'ఇదిగో నీ ఫలము!' అని ఫలమందించి ఊర కుందుము. ఫలితము పునః ప్రారంభమే. ప్రశ్నలు లేక శ్రమించువారికి ఫలము దివ్యశరీర నిర్మాణము.

## 84

# మూర్ఖత

అన్నిదేశముల సంస్కృతులయందు రక్షించు దేవతల కథలున్నవి. రక్షకులున్నారు. అన్ని బోధనలయందు రక్షకుల కథలు కోకొల్లలుగ యున్నవి. భూమిని, భూమి జీవులను రక్షించు వారున్నారు. గ్రహములను, సూర్య మండలములను రక్షించు దేవత లున్నారు. చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు వివిధ సమయములలో రక్షణ పొందిన సన్నివేశము లున్నవి. ఆధునిక యుగమున మానవుని కెందులకో రక్షకులపై నమ్మకము లేదు. ఇది దురదృష్ట కరము. చీమ నుండి బ్రహ్మ వరకు వారి వారి పరిధులలో వారికి రక్షణ అందుచునే యున్నది. ఈ రక్షక తత్త్వమే దుర్గ. ఆమె సైన్యము లెక్కల కందనిది– ఆమె పుత్రులే సద్బోధకులు. వారు బోధించునది క్షేమకర మార్గము. జీవులకు స్వస్థతను కూర్చుట, స్వస్థానమునకు దారిచూపుట వారి పని. దిక్కు చూపు వారిని నిర్లక్ష్యము చేయుచు, దిక్కులేని వారమని వాపోవుట కలి సోకిన మానవుల వికారము. ఇట్టి స్థితియందు మేమేమి చేయవలెను? దిక్కు చూపుచునే యుందుము. మీరు చూచు వరకు వేచియుందుము. మంకుపట్టు పట్టి ఏడ్చుచున్న పిల్లవానిని కొంత తడవు ఏడ్వనిచ్చినచో అటుపైన అతడే మంకు వదలి ప్రవర్తించగలడు. ఇది మీపై మాకు గల విశ్వాసము.

## 85

## ఒక రహస్యము

నీకు నీవే సహాయపడుము. ఇతరులకు కూడ సహాయ పడుము. వీలున్నంత వరకు సహాయము నర్థింపకుము. ఇది యొక శాసనము.

తనకుతాను సహాయపడువాడే ఇతరులకు కూడ సహాయ పడగలడు. పూర్వము ఒక మహారాజు వుండెడివాడు. అతనికి నిద్ర పట్టుట లేదు. రాజగురువును పిలిచి తన పరిస్థితిని వివరించినాడు. రాజగురువు రాజును నిర్దేశించి "నీ నిద్రించు పాన్పు ఒక్కసారి పరిశీలింపుము" అని పలికెను. రాజు భటులను పిలిచి పాన్పు పరిశీలింప చేసెను. అందొక రాతి బెడ్డ యున్నది. వారది చూపించి నారు. అదియే కారణమైయుండునని భావించి రాజు మరునాడు పాన్పుపై పరుండెను. ఆ రాత్రియు రాజుకు నిద్దుర పట్టలేదు. రాజు గురువును మరల ప్రశ్నించెను. రాజగురువు మరల అదే సమాధాన మిచ్చెను. రాజు మరల పాన్పును పరిశీలింపచేసెను. తలగడ క్రింద చచ్చిన బల్లి యొకటి కనపడెను. రాజు భటులపై కోపించెను. మరుసటిరాత్రి మరల నిద్రించెను. నిద్దుర పట్టలేదు. రాజు విసుగు చెందెను. రాజుగురువును కారణమేమి యని అడిగెను. గురువిట్లనెను.

"రాజా నీ పరుపును నిన్ను పరిశీలించుకొనమంటిని. ఆ పని నీ వొకరికి అప్పచెప్పితివి. నీ కన్నులతో నీవే పరిశీలించుకొనుట మంచిది. నీ వట్లు చేయుట లేదు. అదియే కారణము" అని పలికెను. ఆ రాత్రి రాజు తానుగ పాన్పును క్షుణ్ణముగ పరిశీలించెను. అందొక అయస్కాంతమున్నది. ఆశ్చర్యపడినాడు. దానిని తీసివేసి నిద్ర కుపక్రమించెను. నిద్రించెను. మరునాడు ఉదయమే రాజ గురువు వచ్చి నిద్ర పట్టినదా? యని యడిగెను. రాజు నవ్వుచు సంతృప్తిగ తలవూపెను. రాజ గురువు యిట్లనెను. "కారణము అయస్కాంత మనుకొనుచున్నావా? కాదు సుమా! నీ పని నీవు చేసుకొనుటయే నీ నిదురకు కారణము."

తమ పని తాము చేయనివారికి నిదుర పట్టదు. చేయించుకొను వారికసలే పట్టదు. తమకు, యితరులకు కూడ సహాయము చేయుచు శ్రమించువారికి నిదుర పట్టును. ఇదియొక రహస్యము.



## 86

## తారణ మార్గము

మైత్రేయ మహర్షికి స్త్రీలపై గల విశ్వాసము పురుషులపై లేదు. సర్వ సమస్యలకు ఆయన దృష్టిలో స్త్రీయే పరిష్కారము. మానవ జాతియందు స్త్రీలకు గల సంస్కారము జాతి సంస్కారముగ ప్రతిబింబించును. సంఘమున స్త్రీకి గల గౌరవమే సంఘ గౌరవముగ ప్రతిబింబించును. స్త్రీ పవిత్రతయే జాతి పవిత్రత. సత్సంతతి కలుగవలెనన్నచో మాతృమూర్తి పవిత్రమూర్తియై యుండవలెను. స్త్రీలు సంస్కరింప బడినచో జీవసంస్కారము సుగమమగును. కశ్యప ఋషి తండ్రియైనను దితికి దైత్యులు పుట్టినారు. అదితికి ఆదిత్యులు పుట్టినారు. కద్రువకు పాములు పుట్టినవి. వినతకు విహంగములు పుట్టినవి. సత్సంతతికి స్త్రీ సంస్కారము ఎంత ప్రాముఖ్యమో ఈ కథల వలన తెలియును. మైత్రేయుడు స్త్రీ ఆరాధకుడు. ఆయన జీవ పరిణామమునకై శైలపుత్రి నారాధించిరి. ఆమె ఆజ్ఞల ననుసరించిరి. స్త్రీ ఆరాధన ఒక విధముగ మైత్రేయ మార్గమే. స్త్రీని నొప్పించినచో పరిణామములు అధికముగ నుండునని తెలియవలెను. స్త్రీని

మెప్పించినచో ఫలములధికములని కూడ తెలియవలెను. సృష్టిని అధిష్ఠించి యున్నది జగన్మాతయే. పరమాత్మ సైతము ప్రత్యక్షమగుటకు జగన్మాత రూపమునే ఆశ్రయించవలెను. తారణమునకు మాతయే యుపాయము. అట్లు కానిచో మాయయే మిగులును.



87

## సంస్కారము

సద్భావములు, శుభములు ఎటునుండి వచ్చినను, ఎవరి ద్వారా వచ్చినను నిరాకరింపకుము. కేవలము స్వార్థపరత్వముతో కాక పక్షపాత రహితముగ వినుము. పక్షపాత రహితముగ చూడుము, మాట్లాడుము. స్వార్థ దృష్టితో చూచినప్పుడు దివ్యమగు విషయములు కూడ ఆనందము కలిగించలేవు. నీ హృదయమున తోటివారి విజయమునందు, సౌఖ్యమునందు ఎట్టి భావము కలిగియుందువో అదియే నీ సంస్కారమునకు కొలబద్ద. తోటివారిని సహించలేక పోవుట, అతనికి జరుగుచున్న మంచిని చూచి సహజముగ సంతో షింపలేకపోవుట నిజమగు దుఃఖము. ఈ దుఃఖము నుండి బయల్పడుట సామాన్యము కాదు. అసామాన్యమే. తెలిసినవారు కూడ తోటివాని ఉన్నతిని హృదయపూర్వకముగ ఆనందించలేరు. అంగీకరింపనే లేరు. ఇట్టి ఈర్ష్యాళువులు దైవారాధనము చేసిన ఏమి ఫలము?

తోటి జీవుని ఆనందమే తన ఆనందముగ భావించుట

లోకహితుని లక్షణము. వారి బాధ తమ బాధగ భావించుట, వలసిన సహాయము చేయుట కూడ వారి లక్షణము. ఇది నేర్వనివారు జ్ఞానమునకై ఆరాటపడుట వ్యర్థము. ఇతరుల ఉన్నతిని, సద్గుణములను, విజయములను, వారికి కలుగు శుభములను నీవు విన్నప్పుడు హృదయమున ఆనంద స్పందన కలిగినచో నీవు సంస్కారుడవు. లేనిచో నీది కుసంస్కారమే. కుసంస్కారులకు దైవము ప్రతిస్పందింపదు.

# 88

## మా అనుభవము

ఉరుములు, పిడుగులతో గాలివాన యున్నప్పుడు నీవటు నిటు నిదురలో పరుగిడుదువా? లేక కుదురుగ నొకచోట నుందువా? బుద్ధిమంతుడు అట్టి భీకర సన్నివేశములలో ఒక పంచను చేరి తలదాచుకొనును కదా! అట్లే విపత్కర సన్నివేశములలో కూడ చెదరక హృదయమున చేరి సన్నివేశము దాటిపోవు వరకును లోన యుండ వలెను. విపత్కరమగు సన్నివేశములు జీవితమున ఎవరికి తప్పవు. ఎంత చెట్టుకు అంతగాలి యున్నట్లు జీవి పన్నాను బట్టి అతనికొచ్చు కష్టనష్టములుండును. బాహ్యమున ఒడుదుడుకులు సహజము. అంతరంగమున అవి లేవు. చక్కని గృహమందు యున్నవానికి గాలి, వాన, ఉరుములు, మెరుపులు చూచుటలో ప్రకృతి గాంభీర్యము తెలియును. వానను చూచుచు ఆనందించును కూడ. లోనవున్న వానికే ఈ ఆనందము అందులకే “లోనికి పొమ్ము, శాంతిని, స్వస్థతను పొందుము.” అని మేము నిరంతరము ఘోషించుచుందుము. ఇది. చెవికెక్కక పోవుటయే నిజమగు కలి. అజ్ఞానము.

జీవులు ఎన్నిన్నియో దైవకార్యములను, దైవారాధనమును గావించుచున్నారు. కాని వారికి శాంతి మాత్రము లేదు. కారణము

చేయు కార్యములన్నియు బాహ్య సంబంధితములే. అంతర్గతమునందే నిజమగు హితమున్నది. జీవితమున ప్రాథమిక దశలో అంతర్గత మగుట నేర్వవలెను. తాబేలును గురువుగ నుంచుకొని, ఇంద్రియముల వ్యాపారమునులోనికి త్రిప్పుట నేర్వవలెను. ఇందెంతయో హిత మున్నది. విద్యాలయములందు ఇతరములైన విద్యలకన్న ఈ విద్యకు ప్రాధాన్యమందించినచో జీవులు పటిష్ఠమగు చేతన కలిగి సన్నివేశ ముల యందు చెదరని శాంతి కలిగియుందురు. ఇది చదువు పాఠకులు కూడ ఈ పని చేయరు. ఇది మా అనుభవము.

## 89

# ప్రదర్శన - దర్శనము

పునర్జన్మను గూర్చి నీవెన్నడైన భావింతువా? మరణమును గూర్చి భావింతువా? జన్మించక ముందు మరణించిన వెనుక నీ వెట్లుంటివో ఎప్పుడైన ఆలోచించితివా? ఆలోచించుట సత్సాధకున కవసరము. నీ విప్పటికే లక్షలాది సార్లు పుట్టితివి చచ్చితివికూడ. అన్నిసార్లు పుట్టిచచ్చిననూ, చచ్చిపుట్టిననూ దాని అనుభవము నీకు లేదు కదా! నీవెట్లు పుట్టితివి? ఎట్లు చచ్చితివి? నీకు తెలియనే లేదు కదా! ఈ రెండు సన్నివేశములు జరుగునప్పుడు నీ వున్నావు. నిద్రకు ముందు, నిద్ర తరువాత నిద్రయందును, మేల్కాంచుట యందును స్వప్నమునందుకూడ నీవున్నావు. ఉండుట సత్యమే. కాని సన్నివేశములు జరుగుచున్నప్పుడు నీవున్నను పరికించలేక పోవుచున్నావు. దీనికి కారణమేమి? కారణ మొకటియే. నీయందు సాక్షిగ గమనించు బుద్ధి జనించలేదు. ఈ సాక్షిత్వము నీయందు జనించవలె నన్నచో దైనందినముగ జరుగు సన్నివేశము లలో గమనించుట నేర్వవలెను. సన్నివేశము నందిమిడి పోవుట కాక దానిని గమనించువానిగ, సన్నివేశమునకీవలగ నుండవలెను.

అన్ని సన్నివేశములయందు నీవు సాక్షిగ నుండి జరుగుచున్న సన్నివేశమును సినిమా చూచినట్లు చూచుటవలె చూడవలెను. చిన్ని చిన్న విషయముల యందు దీనిని ముందు ప్రయత్నింపుము. ఇది అభ్యాసముగ స్థిరపడినచో క్రమముగ నీవు నీ జీవితమును నందలి సన్నివేశములను, నీ సినిమాగ చూడగలవు. ఇట్లు చూచుట నేర్చుటయే తారణమునకు మార్గము. అలసత్వము లేక ప్రయ త్నింపుము. మేమీ విద్య శ్రీకృష్ణుని నుండి నేర్చితిమి. ఆయన సాక్షీభూతులై యుండి కర్తవ్యమును అప్రమత్తతో నిర్వర్తించుచుండిరి. అన్ని మార్పులను చూచుచు వాని యందు మాకర్తవ్యములను నిర్వర్తించుచున్నాము. మా పుట్టుకలు మరణముల కూడ చూచితిమి. మీ పుట్టుకలు మరణములు కూడ చూచుచున్నాము. మీ రూపములు మారుచున్ననూ, జీవులుగ మేము గుర్తించుటకిదియే రహస్యము. మీరు మాకు పరిచితులే. మా సినిమాకథ, మీ సినిమాకథ కూడ చూచుచునుందుము.



**90**

## మానవ లక్షణము

సహకరించుట సామాన్య విషయము కాదు. సహకారమొక ఉత్తమ గుణము. దైనందిన జీవితమున సద్భావములకు, సత్కార్యము లకు, సహకరించుట సాధకునకు అత్యవసరము. దీనికి తరుల భావములను మన్నించగలుగు సద్బుద్ధి యుండవలెను. ఇతరుల భావములను కొట్టివేయుట, ఇతరుల సత్కార్యములను తిరస్కరించుట, దూషించుట నిరుపయోగము. నీవట్లు చేసినచో నీకును అట్లే జరుగును. ఇట్టి సాధకులెందరో అధ్యాత్మిక సోదరత్వమని ఆరాటపడు చున్నారు. సోదరత్వమునకు సహకారము మొదటి లక్షణము. సహకరించుట తెలియని వానికి సోదరత్వము లేదు.

ప్రతి సాధారణ సాధకుడును తనతో నెవ్వరును సహకరించుట లేదని వాపోవుచుండును. దానికి కారణము తానే. తానితరులతో సహకరించుట ముఖ్యము. ఇతరులు తనతో సహకరించువలెననుట అహంకారము. మొదటిది వినయమగు మార్గము. రెండవది అవిధేయ తను సూచించును. ఉట్టికెక్కలేనమ్మ, స్వర్గమునకు ప్రాకులాడుట యెట్లో, పెద్దలతో సహకరించని పిన్నలకు, దైవీభావమందుట అట్లే అసాధ్యము. ఇట్టి వారి ఆధ్యాత్మిక సోదరత్వ భావము కారుమేఘము

లతో కూడినదై ఉరుములు, మెరుపులు, గాలివానగ యుండును. ప్రతి ఆధ్యాత్మిక సంఘమును, సూక్ష్మలోకముల నుండి గమనించు మాకు, యిదియే మరల మరల కన్పట్టుచున్నది.

ఒక సోదర బృందమున, ఆశయమొక్కటే యున్నను దానిని నిర్వర్తించు విధానమున పలువురికి పలుభావము లేర్పడుచుండును. దానికి కారణము సభ్యుల స్వభావ వైవిధ్యము. అందరును ఒకే స్థితిని చేరిన ప్రజ్ఞను కలిగి యుండరు కదా! వాని స్వభావమందలి వైవిధ్యములే వారి వైవిధ్య ధోరణికి కారణము. వైవిధ్యమగు భావము లను సమన్వయించుట సులభమగు విషయము కాదు. దీనికి సహనము ముఖ్యము. అట్టి సహనము కలవాడే బృందమును నడుపుట శ్రేయస్కరము.

సహనము, సద్బుద్ధి, సహకారము, సోదరత్వమునకు అత్యంత ఆవశ్యకమగు అంశములు. దీనిని పొందుటకు చైతన్యమును వికాసవంతము చేసుకొనవలెను. ఇతరుల అభిప్రాయములను కూడ పరిగణలోనికి తీసుకొని ఆలోచించుట దీనికి ప్రధానము. పదికోణముల నుండి ఒకే విషయమును అవగాహన చేసుకొనినచో కార్యనిర్వహణము సమగ్రముగ యుండును. సభ్యులందరును పరితృప్తి చెందుదురు.

సహకరించుట అనుకరించుటకన్న కష్టమైన పని. “పై వారి ననుకరింతుము. తోటివారితో సహరించము.” ఇది ప్రస్తుత మానవుని లక్షణము.

# 91

## భౌతికలోక సత్యము

సోదరత్వము, సమానత్వము, స్వతంత్రము అనుభావములకు భౌతిక ప్రపంచమున అస్థిత్వము లేదు. ఇవి సూక్ష్మము దివ్యము అయిన లోకములకు సంబంధించినవి. అమృతత్వలోకములకు సంబంధించినవి. సూక్ష్మలోకమున సృష్టిధర్మములు పరిపూర్ణముగ నవగాహనము కాగలవు. భౌతిక లోకమున అవగాహన వక్రత చెంది యుండును. స్వభావమునకు బానిసలైన జీవులకు స్వాతంత్ర్యము మృగ్యము. స్వభావమే బలీయమై జీవుని ఆశయములు దానికి లోబడి యుండుటచే జీవునకు స్వాతంత్ర్యము లేదు. స్వాభావిక భావములు స్వతంత్ర్యమునకై ప్రయత్నించినపుడు అవి పరస్పర విరుద్ధములై, ధర్మవిరుద్ధములై ఘర్షణ చెందును.

సమానత్వము స్వభావమునకు లోబడినవారికి అసాధ్యము. అందరూ జీవులే అను భావనము తెలిసియున్నప్పటికిని స్వభావము నందు సమానత లేకుండుట వలన సమానత్వము సిద్ధింపదు. సమర్థులు, అసమర్థులు సమానులు కారు. తెలిసినవారు తెలియని వారు సమానులు కారు. స్వభావము వైవిధ్యమై యున్నప్పుడు సమానత్వము అసాధ్యమగును.

దివ్యము, అమృతము అగులోకముల యందు సత్పురుషులు ఏర్పరచుకొన్న సోదరత్వము సమానత్వము స్వతంత్రత ధర్మమున కనుగుణమై యుండును. ధర్మము నాచరించు వారికే క్రమముగ సమానత్వ మననేమో తెలియును. ధర్మనిష్ఠ బాధ్యతగ నిర్వర్తించు వారకే స్వతంత్రత అననేమో తెలియును. అట్టివారి మధ్యే సోదరత్వము వెల్లి విరియును.

భౌతిక ప్రపంచమున జీవుడు కర్తవ్యమును, సృష్టి ధర్మములను నెరిగి ప్రవర్తించుట ద్వారా బుద్ధిలోకములలోనికి ప్రవేశించినపుడు పై మూడు అంశములు అవగాహన కాగలవు. శ్రీరాముని జీవితమున ఈ మూడు అంశములను గమనించవచ్చును. అతడు సర్వ స్వతంత్రుడు. ఆ స్వాతంత్ర్యము అతనికి కర్తవ్య నిర్వహణము నుండి ధర్మాచరణము నుండి వికసించినది. బాధ్యత పడక కర్తవ్యము నెరుగక ధర్మము నెరుగక జీవించు జీవులకు సోదరత్వము, సమానత్వము, స్వతంత్రము ఎండమావులవంటివి. చట్టములెన్ని ఏర్పరచినను ఈ ఆశయములను పొందలేరు. వీనిపేర విధ్వంసమే జరుగుచు నున్నది. స్వతంత్రమని, సమానత్వమని అగ్రరాజ్యములు, అగ్రవర్ణములు బలహీనులను హింసించుటయే మానవజాతి చరిత్రగ సాగుచున్నది. ఈ మూడు ఆశయములు వ్యక్తిగతముగ సిద్ధించగలవే గాని సామాజిక ముగ సిద్ధింపవు. అవతార పురుషులు దిగి వచ్చినను భౌతికలోకమున నుండు శాశ్వత సత్యమిదియే.

## 92

## జ్ఞానము - భాష

**జ్ఞా**నము అందరి కొరకును నిర్దేశింపబడినది. దానినే కొందరికే పరిమితము చేయుట ధర్మముకాదు. సూర్యుని వెలుగు, వాయువు, నీరు, భూమి అందరికిని నిర్దేశింపబడినవి. అట్లే జ్ఞానముకూడను. అందరికి అందుబాటులో జ్ఞానము నుంచుట పెద్దల కర్తవ్యము. అందుకొనుటకందరు రుచి చూపించక పోవచ్చును. కాని అందుబాటులోనుంచుట మాత్రము కర్తవ్యమై యున్నది.

జ్ఞానము, కాలమును బట్టి భాషను మార్చుకొనుచుండును. ప్రాచీన భాషలయందు గల జ్ఞానమును ప్రాంతీయ భాషలలోనికి కొని తెచ్చుట ఒక మహా యజ్ఞము. భాష భావమును తెలుపుటకే కదా! దివ్యభావమును ప్రాంతీయ భాషలోనికి, ప్రాచీన భాష నుండి గొని వచ్చుట వలన జ్ఞానము యొక్క అందుబాటు మిక్కుటముగ నుండును. అట్లు కానిచో ఆవశ్యకత యున్న తావులకు జ్ఞానమందదు.

ప్రస్తుత కాలమున భాష అంతకంతకును అవస్థితి చెందుచు నున్నది. కావున జ్ఞానము కూడ అట్టి భాషలలోనికి కొని రావలెనా? అను ప్రశ్నపుట్టును. వికారము చెందిన భాష నుండి జ్ఞానము

నందించుట సులభము కాదు. కావున భాష వికారము చెందకుండు టకై చేయు ప్రయత్నముకూడ లోకహితకార్యముగ కన్పట్టును.

మా అనుయాయులు చాలా మంది జ్ఞానమును ప్రాచీన భాషల నుండి జనాదరణ గల భాషలలోనికి భౌగోళికముగ మార్చుచు నున్నారు. మరికొందరు భాష పతనము కాకుండ కూడ ప్రయత్నము చేయుచున్నారు.

భాషయందుగల వికృతి పలుకు వాని యందు కూడ ప్రవేశింప గలదు. వికృతముగ భాషించు వారు క్రమముగ వికృతమగు స్వభావము చెందుట తథ్యము. వాక్కునకు అమితమగు శక్తి కలదు. దాన్ని పవిత్రముగ ఉచ్చరించినచో, ఉచ్చరించువాడు పవిత్రుడగు చుండును. అపవిత్రముగ నుచ్చరించినచో అపవిత్రుడగు చుండును. నిర్లక్ష్యముగ నుచ్చరించినచో లక్ష్యము లేనివాడగును. శ్రద్ధగ నుచ్చరించినచో శ్రద్ధను పొందువాడగును. శ్రద్ధయే సమస్త విద్యలకు ముఖద్వారము. భాషణమునందలి శ్రద్ధ మిమ్ములను ఉత్తమోత్తమ స్థితికి గొనిపోగలదు. జ్ఞానమునకు యిది తొలిమెట్టు. సరళముగను, స్వచ్ఛముగను, స్పష్టముగను పదముల నుచ్చరింపుడు. సరియగు పదములను సరితూకముగ నెంచుకొని వినియోగింపుడు. మీ భాషణము ప్రశాంత ప్రవాహమై ప్రవహించుట ముఖ్యము.



93

## వైద్యమతములు

వైద్యమునందు వివిధ సిద్ధాంతములున్నవి. ఎవరి సిద్ధాంతము వారిది. ఒకరి సిద్ధాంతమొకరు ఒప్పుకొనరు. వారి సిద్ధాంతమే గొప్పదనుభావము, అందరి వైద్యుల యందు కన్పట్టుచున్నది. వైద్య సిద్ధాంతములకు, మత సిద్ధాంతములకు పెద్ద వ్యత్యాసమున్నట్లుగ గోచరించదు. దైవమును గూర్చిమతము లున్నట్లే వైద్యమును గూర్చి కూడ మతములున్నవి. ఇతర మతములు, తమ మతముతో సరి కావని ఎట్లు మతాధిపతులు భావింతురో, అట్లే వైద్యాధికారులు కూడను.

కొందరు హోమియో వైద్యము గొప్పదందురు. మరికొందరది అశాస్త్రీయ మందురు. కొందరు అలోపతి, శాస్త్రీయము గనుక గొప్పదందురు. అదియును అశాస్త్రీయమే మరియు విషపూరితము కూడ అని కొందరందురు. ఇంకొందరు ఆయుర్వేదమద్భుత మందురు. మరికొందరు ఆయుర్వేద శాస్త్రమునకు ప్రామాణికమగు సిద్ధాంతములు యందు వ్యత్యాసముందందురు. ఒక కుటుంబము నందు నిర్వర్తింపబడు ఆయుర్వేదమునకు మరియొక కుటుంబము నందు నిర్వర్తింపబడు ఆయుర్వేదమునకు అవగాహనలో బేధముం

దందురు. వివిధ ప్రాంతములందు వివిధమగు అవగాహనలతో కూడి తామరతంపరవలె అంతుపట్టక నుండునది ఆయుర్వేద మని కొందరి భావము. మరికొందరు ప్రకృతి చికిత్స అన్నిటికన్న ఉత్తమమైన దందురు. అట్లే చీనీవైద్యము, యునాని వైద్యము, నాటు వైద్యము (పసరు వైద్యము) మొదలైనవెన్నియో వైద్యవిధానములున్నవి.

అన్ని వైద్య విధానములు పరిమితములే. పరిపూర్ణములు కావు. ఇవి అన్నియు కలిపినచో పరిపూర్ణమగు వైద్యమేర్పడునని మరియొక మతము. ఈ భావము కూడ పరిమితమైన భావమే.

దైవము యొక్క అవగాహనమే, మత మందించవలసినది. దైవము యొక్క అవగాహన తగ్గి మతవాదములు పెరుగుచున్నప్పుడు మానవ మేధస్సులో దైవమదృశ్యమై వాదములు, వివాదములు విరోధములు, యుద్ధములు పుట్టుచున్నవి కదా! అట్లే వైద్యము కూడ పరిణమించినది. వైద్యము ప్రాణశాస్త్రము. ప్రాణము యొక్క తీరుతెన్నులు తెలియక వైద్యము చేసినచో ప్రాణము ఇనుమడింపదు. దేహమునందలి ప్రాణ స్పందనములు, ప్రాణము ప్రవేశించు తీరు ప్రవహించు తీరు, దానికేర్పడు అవరోధములు గ్రహించుట మరచిన వైద్యశాస్త్రములు పరిష్కారము నందించలేక వికారము చెందుచున్నవి. మన చుట్టును వాతావరణమున గల ప్రాణము మన యందెట్లు ప్రవేశించునో తెలియవలెను. మనయందు ఎట్లు ప్రవహించునో తెలియవలెను. వానికవరోధములెట్లేర్పడుచున్నవో తెలియవలెను. ఆ అవరోధనములనెట్లు నిర్మూలించవలెనో తెలియవలెను. ఇది వైద్యము నకు మూల సూత్రము.

## 94

## నిశ్శబ్దము - స్నేహము

నిజమైన స్నేహము, నిశ్శబ్దమై యుండునని చైనీయుల సూక్తి. నిశ్శబ్దమే నిజమైన స్నేహితుడని మరియొక సూక్తి. ప్రేమ, స్నేహము నిజమైనచో అది మాటలయందులేక, చేతలయందు మాత్రమే యుండును. చేతలేయుండును గాని మాటలుండవు. స్నేహమును, ప్రేమను భాషణములోనికి దించువారు లోతులేనివారు. వారికి నిశ్శబ్దపు లోతు, రుచిలేక, కేవలము పేలవమైన మాటల నుండి వ్యక్తము చేయుదురు. వాచావాత్సల్యమే లోతులేని వారికి ప్రీతి. ప్రపంచమంతయు మాటల గారడిలో చిక్కి, ప్రేమయని స్నేహమని తల్లక్రిందులగు చున్నది. నిజమగు స్నేహము గలవారు, ప్రేమగలవారు దాని రుచి తెలిసి, భాషణమున రగుల్కొనక, తత్సంబంధిత కార్యముల నిమగ్నులగుదురు.

నిశ్శబ్దమున ప్రవహించినంత స్నేహము, ప్రేమ, మాటలలో ప్రవహింపజాలదు. సీతారాముల ప్రేమ వారిరువురికే తెలియును. కృష్ణప్రేమ భార్యలకన్న గోపికలకే ఎక్కువ తెలియును. ద్రౌపదిని గూర్చి కృష్ణునికి గలప్రేమ అత్యంత సన్నిహితము, సున్నితము కూడ. సత్యభామకది అంతుపట్టలేదు. భరతునిపై రామునికి గల ప్రేమ

మాటలలో వ్యక్తము కాలేదు. రాముని స్నేహమంతయు క్రియా రూపమే. భాషణామయము కాదు. గుహుడైనను, జటాయువైనను, శబరియైనను, సుగ్రీవుడైనను, విభీషణుడైనను రాముని స్నేహమును, ప్రేమను, చేతలద్వారా రుచి చూచిరే కాని మాటల ద్వారా కాదు.

లోతులలో జీవించువారికే, స్నేహము ప్రేమ తెలియును. లోతులు నిశ్శబ్దమునకు సంబంధించినవి. నిశ్శబ్దమున సాన్నిధ్య మున్నది. సాన్నిధ్యము దివ్యసాన్నిధ్యమే. మన యందలి సాన్నిధ్యమే మన ప్రాణములను, తెలివిని నడుపుచున్నవి. మనము గుర్తింప కున్నను, ప్రాణముగను, తెలివిగను పని చేయుచున్నది. ఈ స్నేహమును, ప్రేమను ఏమని పిలువవలెను? సతతము మనలను ప్రేమించు దైవప్రేమ నిశ్శబ్దముననే నున్నది. స్నేహమునకు ప్రేమకు దైవమే పరాకాష్ఠ. అది నిశ్శబ్దమున ప్రవేశించిన వారికే తెలియును.



# 95

## విటమినులు

ప్రస్తుతకాలమున విటమినులను విపరీతముగ భుజించు చున్నారు. దేహపోషణమునకు అవి అత్యావశ్యకములని వైద్యశాస్త్రము యొక్క నమ్మిక. విటమినుల స్వీకరణము కారణముగ ప్రాణశక్తి (Vital Force) పెరుగునని నమ్మకము. విటమినుల విషయమున మాదొక అవగాహన యున్నది. మా అనుభవమున ప్రాణశక్తిని పెంపొందించు విటమినులు జీవుని యందే యున్నవి. జీవునియందలి సద్గుణమలే నిజమగు విటమినులు. సద్గుణములు ప్రాణమును పెంపొందించి నంతగ విటమినులు పెంపొందింపలేవు. సద్గుణవంతులు మిక్కుట ముగ ప్రాణశక్తి కలిగి యుందురు. వారహర్నిశలు పనిచేయుచున్నను ప్రాణము నీరసింపదు. తెలివికి సద్గుణంబుల బలిమి గూర్చినచో అంతకుమించిన విటమినులు, టానిక్కులు లేవు. సద్గుణములే సమస్త విటమినులకు నివాస స్థానము. సద్గుణములు లేనివారికి యీ స్థావరములు మూతబడవు. వారు విటమినులు తినుచున్నను ప్రాణమంతంత మాత్రముగనే యుండును.

సాధారణ మానవునకు విటమినులు పనిచేయపోవుటకు కారణము వారియందు సద్గుణముల కొఱతయే. మా దృష్టిలో

విశ్వాసము మొట్టమొదటి సద్గుణము. విశ్వాసము మూఢ నమ్మకము కాదు. అది ఆత్మవిశ్వాసము. తనయందు తనకు నమ్మకమున్న వానికి ఇతరులయందు కూడ నమ్మకముండును. ఇతరులయందు అప నమ్మకము తమ యందలి అపనమ్మకము యొక్క ప్రతిబింబమే. అపనమ్మకము ప్రాణమునకు శత్రువు. నమ్మకము ప్రాణమునకు మిత్రుడు. నమ్మినవాడు చెడడని ఆర్యోక్తి. నమ్మి చెడినవాడు లేడని మరియొక ఆర్యోక్తి. అనుమానము, అపనమ్మకము గలవారు విటమినులుగొనుట నిష్ప్రయోజనము. అట్టివారికి విటమినులు అపాయమని కూడ మా నమ్మకము. విటమినులను గొని అపనమ్మిక శక్తి పెరుగునే కాని ప్రాణము పెరుగదు.

అపనమ్మకము, అనుమానములకు సహాయనిరాకరణము (Non-co-operation) తోడైనచో ఇక అట్టివారికి ఔషధములు, విటమినులు పనిచేయుట కష్టము. ఇది తెలియవలెను.

## 96

## పనితనము

కొందరు పరమగురువుల బృందముల గూర్చి మాటాడరు. తలవంచుకొని వారి పని వారు చేయుచుందురు. మరికొందరు గురువులను గూర్చి అధికముగ మాట్లాడుదురు. మా అనుభవమున రెండవ తెగవారే మా బృందమునకు ద్రోహము చేయుదురు. మాకు అధికముగ మాటాడువారన్నచో భయము. మౌనముగ పనిచేయువారు మా దృష్టిలో శ్రేయస్కరులు. అధిక భాషణము అపాయకరము. పనిచేయువారికది తగదు.

మమ్మనుసరించువారికి పగలు పనిచేయుట, రాత్రి నిద్రించుట అని యుండదు. పగలుబట్టి పనికాదు. పనిని బట్టి పగలు. పని యున్నచో వారికి పగలు, రాత్రి తేడా యుండదు. ఇట్టివారే పనిని ప్రేమింపగలవారు. అట్టివారిని మేము ప్రేమింతుము. ఇట్టిపనివారు ఉల్లాసముగ నృత్యము, గీతము అనుభవించుచున్నట్లుగ పనిచేయు చున్నప్పుడు మేమును వారితో వంత కలుపుదుము. చేయవలసిన పనియందు యిట్టి ప్రీతికలుగుట ఉత్తమోత్తమ స్థితి.

**97**

## మొండితనము

సంకల్పబలము వేరు, మొండితనము వేరు. మొండితనము మూర్ఖము. అది అజ్ఞానముతో కూడియుండును. యిట్టివారు, తమ మొండితనము కారణముగ జీవితమున బరువు పెంచుకొందురు. మొండి గుఱ్ఱమును రౌతు ఎట్లు విసర్జించునో, మొండి వానిని సత్కర్మ విసర్జించును. మొండితనము గలవారు, ప్రజ్ఞాకేంద్రమునకు పక్ష వాతము కలిగింతురు. పట్టు, విడుపులు గలవారే జీవన ప్రవాహమున తేలియాడువారు. మూర్ఖత వినాశకారణమై జీవుని పతనము కావింతురు. మొండితనము, మూర్ఖత, కరుడు గట్టిన అహంకారము– ఈ మూడింటిని ప్రతివారు విమర్శించుకొని, వీనిని విడచి సంకల్ప బలమున స్థిరపడుట ఉత్తమము. మొండివారు ఎంతోదూరము ప్రయాణము చేయలేరు. కారణమేమనగా వారి మొండితనము అపాయకారణములను సృష్టించుచుండును. వాటిని ఎదుర్కొనుటలో మొండివారు అలసి సొలసి పోవుదురు. ఇంతలో శరీరము కృశించి నశింతురేకాని మొండితనము వదలదు. మొండితనమున ప్రవేశించిన వారిని, ఆ మొండితనమే మొసలియై పట్టును.

**98**

# యుక్తాహారము

**సు**న్నితమగు మానవ చైతన్యమునకు మాంసాహారము అపాయకరము. చచ్చినవానిని, చంపిన వానిని తినుట వలన అతని చైతన్యమునకు అవస్థితులేర్పడును. ఎంత నిర్మూలించినను మాంస ఖండమున రక్తముండును. అట్టిమాంస ఖండములను తినుటవలన రక్తము త్రాగిన వారగుదురు. మాంసము తినకూడదనుటకు కారణ మిదియొక్కటియే. రక్తమునకు మాంసమునకు విడదీయరాని బంధమున్నది. రక్తపు ప్రభావము మాంసముమీద మిక్కిలిగ యున్నది. అట్టి మాంసమును భుజించుట వలన రక్త పిపాసుల బుద్ధులు, మానవ మేధస్సును చేరును. అంతియేకాదు దీని వలన రకరకములగు వ్యాధులు కూడ మానవ దేహమున పుట్టును. ఈనాడు భూమిపై జరుగు మారణహోమమంతయు హింసా ప్రవృత్తి, రాక్షసత్వము, రక్తాహారము వలననే! రక్తము త్రాగువారు, భుజించువారు రాక్షసులు కాక ఎట్లుందురు? ఇట్టివారి నుండి పుట్టు భావములన్నియు రక్తదాహమును కోరుచునేయుండును. కల్లోలములు పుట్టించుట, యుద్ధములు చేయుట, శాంతిని భంగపరచుట అను వినాశకర కార్యములయందు యిట్టివారి జీవచైతన్యము యిమిడి పోయినది.

పై విషయమును గూర్చి శాస్త్రజ్ఞులు నిశితముగ శాస్త్రీయమగు ప్రయోగములు చేయవలసిన అవసరమెంతయునున్నది. జంతు వధశాల వద్ద గల వాతావరణమును పరిశీలించినచో పై సూచించిన సత్యములు తెలియగలవు. ఇట్టి మానవ ప్రవర్తన యందు మార్పు రానిచో నూతనయుగమారంభమే కాదు. మానవులకు తెరతొలగింపు యుండదు. దీనిని గూర్చి ప్రభుత్వము, వైద్యము, విద్య కృషి చేయవలసిన అవసరమెంతయు గలదు.

రక్తాహారమే ప్రస్తుత కాలమున మానవజాతి అలజడికి మూల కారణము. యుక్తాహారమే పరిష్కారము.

## 99

## శిష్య దురాచారము

**బు**ద్ధునికి దేవదత్తుడు, ఏసుక్రీస్తునకు జూడాసే తీరని ద్రోహము చేసినట్లు చరిత్ర పుటల కెక్కినది. చరిత్ర పుటల కెక్కక సద్గురువులకు ద్రోహముగావించిన వారు కోకొల్లలు. సద్గురు వందించిన బోధలనను యథాతథముగ గ్రహించుటయే మొదలు కష్టము. ఎవరి స్వభావమును బట్టి వారు బోధనలను అవగాహన చేసుకొందురు. సద్గురువు బోధనకన్న శిష్యుని అవగాహన భిన్నముగ నుండవచ్చును. ఇది సర్వసామాన్యము. ఈ కారణముగ బోధనలను మరల మరల శ్రద్ధగ వినవలెను. తాను వింటినని, తెలుసుకొంటినని అనుకొనువాడు అహంకారి. ఒకటికి పదిమార్లువిని తన అవగాహ నను అవకాశమున్నప్పుడు సద్గురువు వద్ద పరిశీలించుకొనవలెను. ఇది మొదటి మెట్టు.

తాను పొందిన అవగాహనను ఆచరణలోనికి కొనివచ్చుటకు దీనితో ప్రయత్నింపవలెను. అట్టి దీక్షకు శ్రద్ధ, భక్తి, సంకల్పబలము, ప్రధానమై నిలచును. ఆచరణ మార్గముననే బోధన ఆకళింపు కాగలదు. ఇది రెండవ మెట్టు.

ఆచరణమున ఆకళింపైన బోధనమును సహాధ్యాయులతో, బంధుమిత్రులతో వారి ఆసక్తిని బట్టి పంచుకొనుట మూడవ మెట్టు. ఇది బాధ్యతాయుతమైన శిష్యత్వము.

ప్రస్తుత కాలమున బోధనలందుకొని అవగాహన చేసుకొనక, తామాచరించక ఇతరుల కందించువారు కోకొల్లలుగ నున్నారు. ఈ స్వభావము శిష్యులలో ఈనాడు కొత్తగ ఏర్పడినదికాదు. ద్వాపర యుగ ఆరంభమునుండి యిట్టి ప్రవర్తనము మొలకెత్తినది. ఇది దురాచారము.

ఈ దురాచారము వలన శిష్యునికి హాని కలుగును. జీవితము ముందునకు సాగుతున్న కొలది మానసికముగ పలుమార్లు గాయపడు చుండును. క్రమముగ గురుశిష్య సంబంధ సూత్రము తెగును. ముందు జన్మలలో మరల గురువునకై అన్వేషణము జరుగును. ఈ దురా చారము సద్గురువును కూడ బాధించును. పై కారణముగ సద్గురువులు శిష్యుల నంగీకరించుటకు వ్యామోహపడరాదు. కలియుగమున శిష్యవ్యామోహము గురువునకు, దురాచారము శిష్యునకు హెచ్చుగు చున్నది.

# 100

## శంబళ

**శం**బళ, ఒక దివ్యాశ్రమము. భూమిపై జరుగు దివ్య కార్య క్రమములకు ప్రధాన కేంద్రము. అన్ని ఆశ్రమములకాధారము. దివ్య జీవనులకు శంబళ దివ్యానుభూతి. శాశ్వత సత్యము. ఇతరులకు అది పుక్కిటి పురాణము. శంబళను గూర్చి అనేకానేకములుగ వదంతులున్నవి. కొందరికది, మరుగుపడిన దివ్యసంపద. మరికొందరికి అది భూగర్భితమైన ప్రాచీన గ్రామము. ఇంకొందరికి అది ఆకసమున తేలుచుండు సూక్ష్మమగు ఆశ్రమము. తెలిసినవారు శంబళను భూమికి దివ్యరాజధానిగ తెలుపుదురు. అందు భూమిని పాలించు ఏకైక చక్రవర్తి యగు సనత్కుమారుడు, వసించియున్నాడని భావింపుడు. అతడు శ్రీకృష్ణుడు భూమిపై సంచరించినపుడు, ప్రద్యుమ్నుడై అతనికి జన్మించినాడని తెలుపుదురు. శ్రీకృష్ణుడు దేహత్యాగము చేసిన వెనుక మరల సనత్కుమారునిగ స్వస్థానమున నిలచి పరమగురువుల పరంపరకు అండగ నిలచియున్నాడని కూడ తలతురు. అతడే భూమిని, భూమి జీవులను పరిపాలించుచు వారి పరిణామమునకై కృషి సలుపుచున్నాడని భావింతురు.

సనత్కుమారుడు సనక సనందనాదులతో నొక త్రిభుజముగ

నేర్పడి బ్రహ్మలోకము నుండి భూలోకము వరకు నొక చైతన్య సూత్రమును సంధించియుంచినాడని, తత్కారణముగ భూమి జీవులు బ్రహ్మలోకమునకు చేరుటకు వలసిన మార్గము తెరచి యున్నదని మైత్రేయాదులు తెలుపుదురు. అతడే ఈ భూమికి జీవమని, ప్రధాన చేతనమని, మేము తెలిసియున్నాము. అతడు మైత్రేయునికి కొండంత అండగ నిలచి అతని ఆశయ పరిపూర్తికై వలసిన సహాయ సహకారము లందించుచు అనాదిగనున్నాడు. అతడు చక్రవర్తి. మైత్రేయుడు గురువు. ఒకరు రాజు, మరియొకరు పురోహితుడు. మేమందర మతని ఋత్విక్కులము. మీరందరతని పిల్లలు.

# 101

## నిస్పృహా

మీలో కొంత మంది సద్గురువు నాహ్వానించి (ధ్యానమున) మీకున్న సమస్తమైనటువంటి బాధల్ని కుండపోతగా వారి ముందు పోస్తూ వుంటారు. చాలా సేవ చేస్తున్నాము కదా! "మా కెందుకీ బాధలు, కష్టాలు" అని ప్రశ్నించెదరు. ఇటువంటి సత్యభామ బుద్ధి (ఆరోపణ బుద్ధి) మానుకోవటము ఉత్తమము. ఆరోపణలు చేయటానికి ఆవాహన మెందుకు?ఎప్పుడూ ఆరోపణలు చేసే వారి దగ్గరికి మీకు వెళ్ళబుద్ధి అవుతుందా? మాకు వెళ్ళ బుద్ధి అవుతుంది. పిలుస్తే వస్తాము, కాని మీ బాధలు ఆరోపణలు మా రాకను గుర్తింపనీయవు.

మీరు బాధలలో నున్నప్పుడు మీరు చేయవలసినదల్లా మేమందించిన బోధనలు చదువుకొనుచు, మనో ప్రశాంతత మనో వైశాల్యతను పొందుచుండవలెను. అట్లుకానిచో క్రమముగ మీకు భక్తి తగ్గును. అనుమానము పెరుగును. మీ చేతన ఘర్షణకు గురి అగును. మేము అనంత ప్రేమను, ఆదరణను ఎప్పుడూ ప్రసరించు

చునేయుందుము. మీరు యోగమున నిలచి సేవను పెంచుడు. మాతో అనుసంధానము కూడ పెంచుడు. అప్పుడు మీ సమస్యలకు పరిష్కారములు దొరకును. మాతో మీ అనుసంధానమును యిట్టి సమయమున పెంచుకొనవలెను కాని ఆరోపణలతో తెంపుకొనరాదు. ప్రతినిత్యము కత్తిపీట ముందు కూర్చుని ఉల్లిపాయలు కోయుచు ఏడ్చుచున్న వారివలె మీరు మాకు గోచరించుదురు. దీని వలన ఎట్టి ప్రయోజనము లేదు. పై తెలిపిన సూత్రములను పాటించుడు.

# 102

## ఒక సాధన

కన్నులు మూసిగాని కన్నులు తెరచిగాని ఒక రమ్యమగు దృశ్యమును ఊహించి చూచుట నేర్చుడు. అట్లే ఊహించి వినుట నేర్చుడు. ఉదాహరణకు కనులు మూసుకొని కైలాస పర్వతమును చూచుట, తిరుపతి వెంకటేశ్వరుని చూచుట, బెజవాడ కనకదుర్గను చూచుట యిత్యాది దూరపు ప్రాంతముల నున్న మనవారిని చూచుట. ఈ చూచుటలో వివరములు చూచుట కూడ చేయవలెను. ఇట్లే వినుటకూడ చేయవచ్చును. పరధ్యానమున కనపడుట, వినపడుట కన్న, నిర్దేశించి చూచుట, వినుట మిన్న అయిన విషయము. మొదటిది జబ్బు. అందు మన సంకల్పమేమీ లేదు. రెండవది దూరదృష్టి, దూరశ్రవణము. ఇట్లు అభ్యాసము గావించుట వలన మీ యందు దూరదృష్టి, దూరశ్రవణము ఏర్పడగలవు.

పై విధముగ సూక్ష్మదేహమున నున్న నీ సభ్యులనుగాని, దివ్య దేహముననున్న ఒక దేవతనుగాని చూచుటకు ప్రయత్నించినచో క్రమముగ గురుదర్శనము, దైవదర్శనము కూడ కాగలదు. దీని వలన

మీ మనస్సునకు అతీంద్రియ శక్తి పెరుగును. అందునకే ధ్యానమున, ఒకే రూపము నెప్పుడునూ చూచు అభ్యాసమీయబడినది. దీని కారణముగ వినపడనివి వినబడుట, కనబడనివి కనపడుట అను మరియొక సిద్ధి కలుగును.

ఇట్టి సాధనలకు ఓర్పు, నిరంతరత్వము చాల ముఖ్యము. శ్రద్ధకూడ చాల అవసరము. ఈ మూడు గుణములతో సూక్ష్మలోకము, స్థూలలోకమంత నిజమై నిలచును. ఇది ఒక సాధన.

# 103

## బహుముఖత్వము

మరియొక సాధన చెప్పుచున్నాను. మీరొక చేయితో పనిచేయు చున్నప్పుడు రెండవ చేతితో మరియొక పని చేయుగలరా? సామాన్య ముగ చేయలేరు. రెండు చేతులతో రెండు భిన్నమైన పనులను చేయుట ప్రయత్నింపుడు. అట్లే ఒకే సమయమున రెండు భిన్నమైన ఉత్తరములు, చెప్పుటకు ప్రయత్నింపుడు. ఇద్దరు వ్యక్తులతో ఒకేసారి (Alternating గా) మాట్లాడుటకు ప్రయత్నింపుడు. అట్లే వాహనము నడుపుచు మాట్లాడుటకు ప్రయత్నింపుడు. మీరు వాదన చేయుచున్నప్పుడు, ఎదుటివ్యక్తి అసహనమునకు గురి అగుచున్నచో చటుక్కున వాదన మార్గమును మార్చుడు.

పై విధముగ చేయుటలో మీచేతనను ఒకే సమయమున రెండు విధములుగ ప్రవహింపచేయు అలవాటేర్పడును. అట్లు చేయుటలో చేతన ప్రవాహము సన్నగిల్లరాదు. ఒకే చైతన్యము రెండు రకములుగ ప్రవహించుటచే సృష్టి ఏర్పడుచున్నది. మీ నుండి కూడ సృష్టి జరుగుట కిదియొక ప్రక్రియ. ఉదాహరణకు, మా ప్రియశిష్యుడు జ్వాలా

కూలుడు ఒకే సమయమున రెండు కాదు, మూడు పనులు చేయుట నేర్చెను. అతడు హిమాలయములలో నివసించుచు అదే సమయమున జర్మనీలోను, అమెరికాలోను కూడ పనిచేసి చూపించెను.

ఏకోన్ముఖ కార్యము కలియుగ నైజము. బహుముఖ కార్యములు దివ్యస్థితి. ఇది మేమందరము శ్రీకృష్ణుని వద్ద నేర్చినాము. అతడు యోగేశ్వరుడు. ఒకే సమయమున పదిచోట్ల పది పనులు గావించెడి వాడు. అతడు ఒకే సమయమున తన ఎనిమిద మంది భార్యలతో ఎనిమిది అంతఃపురములలో కలిసియుండుట చూపించి నారద మహర్షినే అబ్బుర పరచినాడు. సాధన నుండి యిట్టి సిద్ధులు పొంద వచ్చును. తీరిక సమయములలో దీనికి సంబంధించిన కసరత్తులు చేయుట తప్పుకాదు. ఇట్టి సాధనల వలన చైతన్యము బహు ముఖము లుగ వికసించగలదు. పశువులు కూడ ఏకోన్ముఖత కలిగి యున్నవి. మానవులంతకన్న చాల శక్తివంతులు. ఇది తెలియుడు.



104

# పెద్దరికము

**అ**కస్మాత్ సంఘటనలలో చెదరకుండుట ఒక సాధన. ఆశ్చర్యపడుట, నిశ్చేష్టుడగుట సర్వసామాన్యము. కలవరపడుట, ఆనందోత్సాహముతో తబ్బిబ్బగుట, ఇవి అన్నియు సర్వసామాన్యములే. ఇట్లగుట చిన్నపిల్లలవంతు. అప్పటికప్పుడు నవ్వుదురు. వెంటనే ఏడ్తురు. ఇది పిల్లల తత్త్వము. అట్లుకాక అన్ని సమయముల యందు, సన్నివేశముల యందు, ఒకేతీరున ప్రశాంతముగ నిర్లిప్తముగ నుండుట పెద్దరికము. ఇది వయస్సును బట్టి వచ్చునది కాదు. జీవిలోతును బట్టి వచ్చునది. జీవచైతన్యము సెలయేరువలె సాగినచో నిర్మలముగ నుండును. దూకుట, పడుట జరిగినచో బురదగ నుండును.

ఈ సాధనకు ఒక సత్యమును గ్రహించవలసి యున్నది. "ఎప్పుడు ఎక్కడ, ఎవరికైనను ఏదైనను జరుగవచ్చును." సృష్టిలో అకస్మాత్ విషయమేమియును లేదు. గ్రహింపు గలవారికి అకస్మాత్‌లు లేవు. అన్నియును సృష్టి యందు క్రమముగనే జరుగును. లోదృష్టి యున్నప్పుడే అది గమనింపబడును. లేనప్పుడు గమనింపబడవు. ఈ అవగాహనతో నిత్యజీవితమును గడుపువారికి విద్యుత్ ఘాతములు

(Shocks) అనునవి ఉండవు. ఈ స్థితి జేరుటకు ఒక సులభమగు మార్గమున్నది. మీ గురువు లేక దైవము యొక్క రూపమునే మొదలు ధ్యానమందు స్థిరపరచుకొనుడు. ఆయన చేతన యందు మీ చేతన లయము చేయుటకు ప్రయత్నింపుడు. వారిలో మీరు లీనమైనట్లు భావింపుడు. తత్ఫలితముగ మీ యందు వారే వసించియున్నట్లు భావింపుడు. ఇది చాల వివరముగ జరుగవలెను. అప్పుడు మీ గురువు లేక దేవత యొక్క ఎఱుకయే మీ ఎఱుకగ పనిచేయగలదు. సంకల్ప మాత్రమున మీ మనో ఫలకముపై మీ సద్గురువు యొక్క రూపముగాని, మీరు ఆరాధించు దైవము యొక్క రూపముగాని స్పష్టముగ దర్శించ గలిగిననాడు మీకు ఈ సిద్ధి కలుగును. అట్లు జరిగినచో అపుడు, ఆకస్మికములగు అపాయములు, అద్భుతములేమియు నుండవు.



## 105

# దైవ నిర్ణయము

**యా**త్రికుడొకడు ఓడ నెక్కుచు నుండగ అతని బంగారపు నగల మూట దొంగిలింపబడెను. అందరును కలత పడుచు, "దొంగ, దొంగ" అని "పట్టుకొనుడు పట్టుకొనుడు" అని "అయ్యో అయ్యో" అని అరచుచు అలజడి గావించిరి. యాత్రికుడు మాత్రము దొరకక పారిపోయిన దొంగవైపు చూచి తోటి యాత్రికులతో నిర్లిప్తముగ "దైవ నిర్ణయము" అని మృదువుగ పలికినాడు. అందరును అతనివైపు ఆశ్చర్యముగ చూచినారు. అతనిని గూర్చి కొందరు ప్రశంసించుకొనిరి. మరికొందరు పాపమనిరి. మరికొందరు "కర్మ" యనిరి. మరికొందరు "అశ్రద్ధ" యనిరి. ఇంకొందరు "దొంగిలింపబడినది, దొంగిలింప బడినది" అని పలికిరి.

ఓడ కదిలినది– అది పెద్ద ప్రయాణము. మూడు పగళ్ళు, రాత్రుళ్ళు గడచిన వెనుక సముద్ర మధ్యమున ఓడ తుఫానుకు గురియైనది– సముద్ర మధ్యమున గల ఒక రాతిని గుద్దుకొని, ఓడ బీటలు వారినది. పడవ మునుగుట మొదలిడినది. ప్రయాణికు లందరును ప్రాణములు చేత బట్టుకొని సముద్రములోనికి దుమికిరి. ఎవరి ప్రయత్నము వారు గావించిరి. యాత్రికుడు ఓడ నుండి చెదిరి

పడిన ఒక చెక్కముక్క ఆధారముగ ద్వీపము నొకటి చేరినాడు. ద్వీప వాసులు అతని నాదరించి శుశ్రూషలు చేసి స్వస్థత కూర్చిరి.

ద్వీపవాసులు యాత్రికునితో నిట్లనిరి "నీవు పయనించిన ఓడ సముద్ర మధ్యమున మునిగినది. వందలాది యాత్రికులు ప్రాణములు కోల్పోయినారు. నీ వొక్కడివే మిగిలినావు. నీ అదృష్టమేమిటో తెలియ కున్నది. నీవు మిగులుట ఒక అద్భుతము." యాత్రికుడిట్లని సమాధాన మిచ్చెను. "నేను ఓడ ప్రయాణమునకు కొన్న టిక్కెట్టు ఖరీదు చాల ఎక్కువ. ఖరీదైన టిక్కట్టుతో ఓడ ఎక్కితిని. అది దైవనిర్ణయము. ఓడ మునుగుట దైవనిర్ణయము. నేను మిగులుట దైవనిర్ణయము."

అంతా దైవనిర్ణయమని తెలియుడు.



106

## సద్గురు రూప ధ్యానము

నీ సద్గురువు యొక్క ముఖారవిందమును అతని రూపమును, నీవు వివరముగ ధ్యానము నందు దర్శించుట నీకెన్నియో విధములుగ మేలు చేయును. అతని సహకారమున నీవు చాల విషయములను దర్శనము చేయగలవు. నీ దృష్టికి చేయవలసిన ప్రణాళిక దర్శన మగును. బోధనలు వ్రాతపూర్వకముగ దర్శనమగును. నీ వద్దకు రాబోవు మనుష్యులు, వస్తువులు, ధనము కూడ ముందుగనే దర్శన మగును. వానిని వినియోగించు ప్రణాళికలు కూడ దర్శనమగును. దివ్యమగు విషయములెన్నియో గోచరించును. క్రమముగ యితర గ్రహములనుండి కూడ వలసిన ప్రజ్ఞ శక్తి కూడ లభించును. మేమట్లే గ్రహగోళాదుల నుండి మీకెన్నియో విలువైన విషయములను కొనివచ్చి పంచుచున్నాము.

ఇందు ఆశ్చర్యపడవలసినదేదియు లేదు. మీ ఆజ్ఞాకేంద్రము సర్వలోకములకు ముఖద్వారము. నీవచ్చట దర్శనమునకై చేయు నిరంతర సాధన, నీ గురువు యొక్క సహకారము కారణముగ యిట్టివి జరుగగలవు. క్రమముగ మీ మూడవకన్ను తెరవబడగలదు. అప్పుడు నీకు క్రమముగ అనంతవిశ్వము, అందుపనిచేయుచున్న అనేకానేక

ప్రజ్ఞలు, శక్తులు పరిచయము కాగలవు. నీవు ఒక అయస్కాంతమువలె వానినాకర్షించగలవు. మీకు ఈ విధమైన మేలుకొలుపు నందించిన సద్గురువును మార్గమును మాత్రము మరువకుము. మరచినచో నిశీధిని (చీకటి యందు) ఆలంబనము లేక గజిబిజి కాగలవు.



107

## స్వస్వరూప దర్శనము

**మై**త్రేయ మహర్షి జీవుని పునరుత్థానమునకే అవతరించి యున్నాడు. అతని బోధనలన్నియు జీవుడు తనకు తాను శాశ్వతుడ నని, నశింపనివాడనని, జననమరణముల కతీతుడనని తెలియ చేయుటకే. అది అతని ప్రధాన కార్యక్రమము. తూర్పుదేశములందు యీ అవగాహన జీవతత్త్వమున యిమిడి యున్నది. అనుభూతియే యింకను కొదవ. దానికి యోగసాధనమే మార్గము. అందుచే అతని అనుయాయులమైన మేము అందరమును పై విషయములు బోధించుచు, వివిధ యోగసాధనా మార్గములనందించుచున్నాము. అష్టాంగయోగమునకు కూడ అతడే అధిపతి. భాగవత మార్గమున విశ్వప్రేమను రుచి చూపుటకు కూడ అతడే ఉపదేశకుడు. భూమిపై అయన జీవనము కేవలము మానవుల పునరుత్థానము కొరకే. ఈ కార్యమునే పశ్చిమమున (పునరుత్థానమును) పరిపూర్ణముగ నిర్వర్తించి చూపించిన దివ్యశాస్త్రజ్ఞుడు ఏసు. అతడు మైత్రేయుని బృందమున గల ప్రముఖులలో నొకడు.

మైత్రేయమహర్షి జాతికి స్ఫూర్తినిచ్చు విషయమున నిర్విరామ ముగ కృషిచేయుచు, మావంటి వారిని ప్రతినిత్యము హెచ్చరిక

చేయుచునుండును. ఆయనెపుడూ మాతో పలుకు వాక్యము "త్వర పడుడు, ఆలస్యము పనికి రాదు. ఆనందమందరికిని అందవలెను. కర్తవ్యమున ఏ మాత్రము అలసత్వముండరాదు." ఆయన పలుకు నపుడు అహర్నిశలు కృషిచేయుచున్న మాకు కూడ యింకను చేయ వలసిన పని చాల మిగిలియున్నదనిపించును. ఆయన దర్శనము, వాక్కులు మాలోనికి చొచ్చుకొనిపోయి యినుమడించిన ఉత్సాహము ఏర్పడును. ఆయనను గూర్చి స్మరించినపుడెల్ల నాకిట్లనిపించు చుండును.

"ఈ మైత్రేయుని కెంత కరుణ! ఈ రోజుననే జాతి అంతయు మేల్కాంచి ఆనందమయ లోకములలో ప్రవేశింపవలెనని తపనచెందు చున్నట్లుగ గోచరించును. జగన్మాతకు ఎంత కరుణ కలదో, ఆ కరుణ అంతయు ఆయన చూపుల నుండి ప్రసరించి, మేల్కొనిన వారిని కూడ మరింత మేలుకొల్పును కదా! ఆయన కన్నులు అనిర్వచనీయ మగు కరుణాపూరితము !!



# 108

## స్వస్వరూపజ్ఞానము

**స**ద్గురువును భ్రూమధ్యమున ధ్యాన మార్గమున వివరముగ దర్శించుట గూర్చి ముందు పాఠములలో తెలిపితిని. తేజోమయమగు అతని రూపమును ఆ విధముగ దర్శించు సాధన యందు మీకు పట్టు చిక్కిన వెనుక, నీవు భ్రూమధ్యమున **సద్గురువు పాదముల చెంత కూర్చున్నట్లుగా** దర్శించుటకు ప్రయత్నింపుము. నీ ముందు నీవు కూర్చున్నట్లు భావింపుము. నీ ముఖమును, రూపమును వివరముగ ఏకాగ్రతతో దర్శించుము. శ్రద్ధ, భక్తి, నిరంతరత్వము, సద్గురువు అనుగ్రహము కారణముగ నీకు నీవు గోచరించుట ప్రారంభమగును. నీకు గోచరించు నీవు, నీకన్న తేజోమయముగ నుందువు. అపుడు నీవు "అది నేనే", "అతడు నేనే", "అతడే నేను" అని భావింపుము. దీనినే సంస్కృతమున **"సోఽహం"** అందురు. అతడు నీవైనప్పుడు, నీ వెవడవో కూడ నీకు తెలియును. అతడు తేజోమయుడు. నీవు మృణ్మయుడవు. అప్పటి నీ భావన యిట్లుండును. "నేను తేజోమయుడను. ఈ మృణ్మయుడు నా గృహము, నా నివాసము, నా దేహము. అది నేను కాదు. నా నుండి అది ఏర్పడినది. దాని యందింతకాలము నీర, క్షీర న్యాయముగ

కలిసి యున్నది. ఇపుడు విడిపడి నేను 'నేనుగ' నున్నాను. నా దేహమునందుండి పనులు చేయుదును. అటుపైన దేహమును విడిచెదను. దాని నుండి విడిపడుటచే మరణించను. అది మరణించును. నేనుందును." ఇట్టి క్షరాక్షరజ్ఞానము నీకు కలుగును. ఇది ధ్యానము వలననే సాధ్యము. కేవలము భావించుట వలన సాధ్యము కాదు. ఈ ధ్యానము సాధ్యపడుటకు కాలము, కర్మము కలసిరావలెను. అందులకై పరహిత కార్యములందు దీర్ఘకాలము సమర్పితుడవై జీవించవలెను. స్వార్థపరులకు యిది అసాధ్యము.



## OTHER BOOKS THROUGH MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

| | | |
|---|---|---|
| 1. | Agni (E/G/S) | 60-00 |
| 2. | Amanaskudu (T/K) | 18-00 |
| 3. | Antardarsana Dhyanamulu (T) | 100-00 |
| 4. | Anveshakudu (T) | 60-00 |
| 5. | Asangudu (T) | 15-00 |
| 6. | Ashram Leaves (E/G/S) | 100-00 |
| 7. | Ayurvedic Principles (E) | |
| 8. | Bharateeya Sampradayamu (T/Hi) | 10-00 |
| 9. | Cow ('Govu' Mahatyam Vivarana) (E/T/K) | 20-00 |
| 10. | Devapi Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 11. | Dhanakamuni Katha (T) | 25-00 |
| 12. | Doctorine of Eternal Presence (E) | 10-00 |
| 13. | Gayatri Mantra - Avagahana (T) | 10-00 |
| 14. | Geetopanishad - Gnana Yogamu (T) | 25-00 |
| 15. | Geetopanishad - Karma Yogamu (T) | 20-00 |
| 16. | Geetopanishad - Sankhya Yogamu (T) | 25-00 |
| 17. | Geetopanishad - Karmasanyasa Yogamu (T) | 20-00 |
| 18. | Good Friday (E/G/S/F/H) | 10-00 |
| 19 | Gurupaduka Sthavam (E) | |
| 20. | Health & Harmony (E) | 120-00 |
| 21. | Hercules-The Man and the Symbol (E/G/S/F) | 100-00 |
| 22. | Himalaya Guru Parampara (T/Hi) | 12-00 |
| 23. | Jupiter-The Path of Expansion (E/G/S) | 40-00 |
| 24. | Jyotirlinga Yatra (T) | 20-00 |
| 25. | Katha Deepika (T) | 40-00 |
| 26. | Listening to Invisible Master (E/G/S/F/H) | 20-00 |
| 27. | Lord Maitreya-The World Teacher (E/G/S/F/H) | |
| 28. | Maitreya Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 29. | Mana Mastaru Garu (T) | 60-00 |

| | | |
|---|---|---|
| 30. | Mantrams-Their Significance and Practice (E/G/S) | 35-00 |
| 31. | Maria Magdalena (E/S/G/F) | |
| 32. | Marriage-A Sacrament (E) | |
| 33. | Maruvu Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 34. | Master C.V.V. (Birthday Message) (T) | 30-00 |
| 35. | Master C.V.V. Noothana Yogamu (T) | 20-00 |
| 36. | Master C.V.V. Yogamu (T) | 20-00 |
| 37. | Master C.V.V. Yogamu-Karma Rahityamu (T) | 10-00 |
| 38. | Master C.V.V. - May Call !(E/G/S) | 100-00 |
| 39. | Master C.V.V. - May Call ! II (E) | 100-00 |
| 40. | Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror (E) | 15-00 |
| 41. | Master C.V.V. - Saturn Regulations | 125-00 |
| 42. | Master E.K. - The New Age Teacher (E/G/S) | 70-00 |
| 43. | Mithila-A New Age Syllabus (E/G/S) | 100-00 |
| 44. | Occult Meditations (E/G/S) | 100-00 |
| 45. | Omkaram (T) | 30-00 |
| 46. | On Change (E/G/S) | 50-00 |
| 47. | On Healing (E/G/S) | 100-00 |
| 48. | On Love (E/G/S) | 50-00 |
| 49. | On Service (E/G/S) | 50-00 |
| 50. | On Silence (E/G/S) | 50-00 |
| 51. | Pranayamam (T) | 10-00 |
| 52. | Prayers (E/G/S) | 100-00 |
| 53. | Rudra (E/G/S) | 30-00 |
| 54. | Sankhya - The Sacred Doctrine (E/G/S) | 75-00 |
| 55. | Saraswathi - The Word (E/G/S) | 60-00 |
| 56. | Saturn-The Path of Systematised Growth (E/G/S) | 40-00 |
| 57. | Shodasopachara Pooja - Avagahana (T) | 10-00 |
| 58. | Sound-The Key and its Application (E/G/S) | 40-00 |
| 59. | Spiritualism - Business and Management (E/G/S) | 25-00 |
| 60. | Sri Dattatreya (E/G/S/T/Hi) | 33-00 |
| 61. | Sri Gurupaduka Sthavam (T) | 30-00 |
| 62. | Sri Krishna Namamrutham (T) | 25-00 |
| 63. | Sri Lalitha-1 (T) | 40-00 |
| 64. | Sri Lalitha-2 (T) | 40-00 |
| 65. | Sri Lalitha-3 (T) | 40-00 |

| | | |
|---|---|---|
| 66. | Sri Lalitha-4 (T) | 40-00 |
| 67. | Sri Lalitha-5 (T) | 40-00 |
| 68. | Sri Lalitha-6 (T) | 40-00 |
| 69. | Sri Sastri Garu (E/G/S/F/T/H) | 40-00 |
| 70. | Sri Shiridi Sai Sayings (E/G/S/T/Hi) | 80-00 |
| 71. | Steps on Silence (E) | 75-00 |
| 72. | Suvarna Sopanamulu | |
| 73. | The Aquarian Cross (E/G/S) | 100-00 |
| 74. | The Aquarian Master (E/G/S) | 75-00 |
| 75. | The Doctorine of Ethics (E) | 35-00 |
| 76. | The Etheric Body (E/G/S) | |
| 77. | The Path of Synthesis (E) | 40-00 |
| 78. | The Splendor of Seven Hills (E/T/Hi) | 15-00 |
| 79. | The Teachigs of Lord Sanatkumara | 150-00 |
| 80. | The Theosophical Movement (E/G/S) | 60-00 |
| 81. | The White Lotus (E/G/S) | 20-00 |
| 82. | Time - The Key (E/G/S) | |
| 83. | Uranus - The Alchemist of the Age | 150-00 |
| 84. | Venus - The Path of Immortality (E/G/S) | 80-00 |
| 85. | Violet Flame Invocation (E/G) | 60-00 |
| 86. | Vrutrasura Rahasyam (T) | 35-00 |
| 87. | Varunagraha Prabhavamu (T) | 22-00 |
| 88. | Wisdom Buds (E/S) | 20-00 |
| 89. | Wisdom Teachings of Vidura (E/G/S) | 80-00 |
| 90. | Moon & Spiritual Astrology (S) | |
| 91. | The Death & Reincarnation (S) | |
| 92. | Commentary on Om Namonarayanaya (S) | |
| 93. | Master Jesus, Life and Teachings (S) | |
| 94. | The Science of Ayurveda & Homoeopathy (S) | |
| 95. | The Teachings of Master D.K. (S) | |
| 96. | The Human Constitution (S) | |
| 97. | The Masters of Wisdom (S) | |
| 98. | The Path of Meditation (S) | |
| 99. | Stories for Disciples (S) | |
| 100. | Spirituality in Daily Life (S) | |
| 101. | Special Practices for Disciples (S) | |
| 102. | Fundamentals of Health & Healing (S) | |
| 103. | Ganesha, The Cosmic Lord of Groupings (S) | |
| 104. | Astrology and Healing (S) | |